ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 8 మే 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



# సాహిత్య ప్రస్థానం

మే 2022
సంపుటి : 3 సంచిక : 8


## హిందీ హడావుడి, అలజడి

**హోం**మంత్రి అమిత్ షా హుకుంలు, తర్వాత పరిణామాలు చూస్తుంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం హిందీని దేశమంతటిపై వెంటనే రుద్దేయాలని ఎంత హడావుడి పడుతున్నదీ స్పష్టమవుతుంది. గతంలో వచ్చిన నిరసన బేఖాతరు చేసి మళ్లీ పాత ఫక్కీకే దిగడం యాదృచ్ఛికమేమీ కాదు. రాజ్యాంగం అధికారిక భాషలుగా గుర్తించినవే 22. మరో 38 భాషలు అందులో చేర్చాలనే ఆకాంక్షలు బలంగా ఉన్నాయి. దేశంలో మాట్లాడే భాషలు, ఉప భాషలు 400 పైనే. దక్షిణాన తమిళం, తెలుగు వంటివి సుదీర్ఘ చరిత్ర గలవి. హిందీ అమలు విషయంలో తొందరపాటు దేశానికే అనర్థదాయకం.

విదేశీ భాష ఇంగ్లీషుకు లేని అభ్యంతరం దేశంలో సగంమంది మాట్లాడే హిందీకి దేనికని కొంతమంది ప్రశ్నిస్తుంటారు. నిజానికి హిందీ మాట్లాడేవారి లెక్క కృత్రిమంగాపెంచి చూపుతున్నారు. హిందీ, హిందూత్వ, హిందూస్థాన్ మంత్రత్రయం సంఘ పరివార్ ఎప్పుడూ వదలిపెట్టింది లేదు. భారత దేశ చారిత్రక వాస్తవికతలూ, భాషా సాంస్కృతిక వైవిధ్యాలు తెలిసిన వారెవరూ ఒకే భాషను, మతాన్ని దేశమంతటా అమలు చేయడం సాధ్యమని అనుకోరు. రెండొందల ఏళ్లు బ్రిటిష్‌వారు పాలించిన ఈదేశంలో ఇప్పుడు ప్రపంచీకరణ తోడై ఆ భాషాధిపత్యం మరింత పెరుగుతుందన్నా .. దానికి పాలకుల పోకడలే ప్రధాన కారణం. గురజాడ చెప్పినట్టు దేశభాషలు వికసించకుండా ప్రజాస్వామ్యం పరిఢవిల్లదు. 1960లలో హిందీని ఏకపక్షంగా రుద్దాలని చూడటం సహజంగానే తీవ్రమైన అశాంతికి దారితీసింది. చివరకు ఏ రాష్ట్ర శాసనసభైనా స్వచ్ఛందంగా తీర్మానం చేస్తేనే హిందీని అమలుచేయాలని నిర్ణయించారు. అప్పటివరకూ అనుసంధాన భాషగా ఆంగ్లం కొనసాగాలని అధికార భాషా విధానంలో పేర్కొన్నారు. రాజ్యాంగం 343 నుంచి 351 వరకూ గల అధికరణాలు చెప్పేదదే. హోంమంత్రి అంటున్నట్టు హిందీయేతరులు ప్రభుత్వాలు ఆ భాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాల్సిన అవసరం లేనేలేదు. అలా చెప్పడం ప్రజాస్వామ్యమూ కాదు. ■


ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్** ◆ **కెంగార మోహన్** ◆ **వొరప్రసాద్**
◆ **చీకటి దివాకర్** ◆ **గనారా** ◆ **కుమార స్వామి**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

## కథలు


ఇల్లాలి చదువు : డాక్టర్ ఎం.ప్రగతి .......... 5
ఎరుక : గార రంగనాథం ......... 18
కర్లీ హెయిర్ : ఎం.విప్లవ కుమార్ ........ 33
ఇరవై ఏళ్ల కల : అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి 46


## కవితలు


కల్లోల యుగాల మీదుగా : నిఖిలేశ్వర్ ................. 8
వాక్యాంతాన్ని నేనే : కంచరాన భుజంగరావు .. 8
తిరుగు ప్రయాణం : ఎస్ హనుమంతరావు ...... 14
అస్తిత్వపు ప్రశ్న : పుష్యమి సాగర్ ............ 22
స్వాతంత్ర్య భారతం : గన్నోజు శ్రీనివాసాచారి 25
నిన్న పాట వైపు ... : బంగార్రాజు ............... 25
ప్రవహించే ఆత్మ : శ్రీధర్ కొమ్మోజు ......... 32
తలంటు : ఒబ్బిని ..................... 37
చివరి గది : పాయల మురళీకృష్ణ....... 41
నవ్వు : డా. పాతూరి అన్నపూర్ణ ... 45
వాడని వసంతం : బి గోవర్ధనరావు ........... 53
ప్రకృతి మర్మం : డా. పి.విజయలక్ష్మి పండిట్ 56
స్వగతం : చొక్కాకుల ప్రసాద్ ....... 57
అంతిమ ఫలితాలు : శ్రీధర్ చౌడారపు .......... 60


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2022 పురస్కారాలు .......... 17
విద్యా వ్యవస్థ కేంద్రంగా చందు నవలలు
– కెపి అశోక్ కుమార్ ............... 9
రావిశాస్త్రి డైరీలో వ్యవహారిక పదాలు
– గార సీత .......................... 15
కంచె దాటొచ్చిన ధిక్కార స్వరం
– కెంగార మోహన్ ................. 23
దళిత సాహిత్యం – సామాజిక చైతన్యం
– ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్ ... 26
అరణ్యకృష్ణ కవిత్వంలో ఆమె
– డా. సుంకర గోపాల్ ............. 30
సాహితీ ప్రజ్ఞ ................................................. 38
స్వయం ప్రకాశ చిత్రకారుడు రాజా రవివర్మ
– గనారా ............................. 39
తెలుగు కథలకు ఇంగ్లీషు పేర్లా?
– మొలకలపల్లి కోటేశ్వరరావు ..... 42
శ్రీలంక సంక్షోభం – కొన్ని పాఠాలు
– ఎంవిఎస్ శర్మ .................... 51
ముఖాముఖి : జానపద కళల పరిరక్షణ చారిత్రిక అవసరం
– బద్రి కూర్మారావు ................ 54
మూడు దశాబ్దాల అనుభవాల తివాచీపై కథా చిత్రమాల
– వి.విజయ్‌కుమార్ ................ 58
డైరీ ......................................................... 61
పుస్తకాలు ................................................... 66



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::
సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# ఇల్లాలి చదువు

- డాక్టర్ ఎం.ప్రగతి
94407 98008

ఎంతసేపలా పొర్లుతావు, నిద్ర పట్టడం లేదా? ఎలా పడుతుందిలే, మనవరాలేమన్నా చిన్నా చితకా బాంబేసిందా? ఒకటేసారి టెన్ థౌజండ్ వాలా పేల్చింది, ఇల్లంతా కంపించి పోయేట్టు! ఎక్కడి నుంచి ఎక్కడికొచ్చి పడ్డామా అనుకుంటు న్నావు కదూ? నిజమే, ఒక సగటు ఆడపిల్లగా పుట్టి పెరిగి, మామూలు టీచర్‌గా రిటైరైన నేటి దాకా ఎన్నెన్ని చూశావు? అసలు ఇలాంటి సమస్య వస్తుందని ఊహించనే లేదు కదూ, ఎప్పుడూ.

బిందు గుర్తుందా నీకు? ఎలా మరచిపోతావులే. అంత తొందరగా మరచిపోయే మనిషా తను? స్కూల్లో ఎప్పుడూ నీ కంటే చాలా ముందుండేది కదూ. అప్పుడప్పుడూ అబ్బాయిలను దాటి ఫస్ట్ వచ్చేది కూడాను. ఒక రోజు స్త్రీ విద్య గురించి డిబేట్ పెడితే అందరూ 'ఒక పురుషుడు చదువుకుంటే తను మాత్రమే బాగుపడతాడు. అదే స్త్రీ చదువుకుంటే కుటుంబ మంతా బాగుపడుతుంది, కనుక స్త్రీకి విద్య అవసరం.' అంటూ గొప్పగా మాట్లాడారు. ఈ బిందు ఎప్పుడూ ఎడమే కదా. 'ఏం స్త్రీ మాత్రం తన కోసం చదువుకోకూడదా? మగవాళ్ళు తమ చదువును కుటుంబం కోసం ఉపయోగించ కూడదా?' అంటూ వాదనకు దిగింది కదూ. ఇదో పెడసరం అని నీతో పాటు ఇంకా చాలామంది సణుక్కున్నారు కదూ. ఓ రోజెప్పుడో మీ అమ్మ, బిందు వాళ్ళమ్మ కలిసినప్పుడు 'మా భవాని ఇంట్లో పని బాగా చేస్తుంది. ఇంటిని అద్దంలా ఉంచుతుంది.' అని మీ అమ్మ గొప్పగా చెప్పినప్పుడు, బిందు వాళ్ళమ్మ ముఖం చిన్నబోవడం చూసి నువ్వెంత సంబరపడ్డావు, గర్వపడ్డావు కూడా. 'ఆ... ఎంత చదివి ఏం ప్రయోజనం, ఇంటి పని, వంట పని చాత కానప్పుడు' అంటూ ఎద్దేవా చేశావు కదూ. టెంతయ్యాక ఎవరెవరు ఏమేం చేరబోతున్నారని చర్చ వస్తే బిందు ఇంటర్లో ఎమ్పీసీ తీసుకుంటానని చెప్పగానే, అందరూ చప్పట్లు కొట్టారు. అవును మరి, అసలు టెంత్‌లో అమ్మాయిలు కాంపోజిట్ లెక్కలు తీసుకోవడమే ఆశ్చర్యకరమైతే, ఇప్పుడిక ఏకంగా ఎమ్పీసీ తీసుకుంటానంటే గొప్పే కదా. నీ వంతొచ్చి నప్పుడు నువ్వేమన్నావు, 'కుటుంబాన్ని తీర్చిదిద్దుకోదగినంత చదువు చాలు నాకు. నేను ఎక్కువ చదివే కొద్దీ అంతకంటే ఎక్కువ చదివిన వాణ్ని తీసుకురావడం మా వాళ్ళకు కష్టమవు తుంది కనుక నేను ఇంటర్ చేరడం లేదు.'

ఆ మాటయితే అన్నావు కానీ, టెన్త్ చదువు పెళ్ళి కొడుకులకు అస్సలు ఆనకపోవడంతో ఇంటర్ చేరక తప్పలేదు నీకు. అది కూడా సైన్సు, లెక్కలు మనకెందుకులే అని, సియ్యీసీ చేరిపోయావు. పిల్లలకు కాస్త హోమ్ వర్క్ చేయించాడనికైనా పనికొస్తుందిలే అని సమాధానం చెప్పుకున్నావు.

తీరా ఆ ఇంటరయ్యాక సంబంధాలు చూడబోతే అమ్మాయిల పెళ్లి అర్హత డిగ్రీకి పెరిగిపోయింది. రోజులు మారిపోయాయి మరి. ఉద్యోగస్తుడైన పెళ్లికొడుకు కోసం మళ్ళీ బియ్యే చేరిపోయావు. ముప్పుతిప్పలు పడి మూడేళ్ళ డిగ్రీ పూర్తి చేసి, హమ్మయ్య, ఇక డిగ్రీ అయిపోయింది, ఇక గొప్ప సంబంధాలు వస్తాయని ఆశ పెట్టుకుంటే మళ్ళీ అడియాశలే!

తెలుగు సినిమాల్లో హీరోలా ఎర్రగా, పొడుగ్గా ఉన్న, నీకు బాగా నచ్చిన టీచర్ కుర్రాడి నాన్నేమన్నాడు?

'బియ్యీడీ చేసుంటే ఎలాగో ఉద్యోగం వేయించుకునే వాళ్ళం కదా, హాయిగా ఇద్దరూ ఉద్యోగాలు చేసుకునే వాళ్ళు.'

ఉద్యోగం చేసే పిల్లయితే కట్నం తగ్గించుకోవడానిక్కూడా సిద్ధపడ్డారు కదూ. అవును, ఒకసారి వచ్చే కట్నం కంటే నెలనెలా వచ్చిపడే జీతం లెక్క ఎక్కువ కదా! వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడు. అందులోనూ ఇద్దరూ ఉద్యోగస్తులైతే బదిలీలతో సహా అనేక సౌకర్యాలు కూడా. టీచర్ సంబంధం తప్పిపోయాక ఇక తప్పదని బియ్యీడీ చేశావు.

మొత్తం మీద ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అన్న నానుడి భలే నిజమైంది. ఇంట్లో దీపం లాగే ఇల్లాలి చదువు ఎన్ని మార్పులకు నోచుకుంది? బుడ్డి దీపం పోయి, గుడ్డి బల్బు, అదీ పోయి ఫ్లోరెసెంట్ ట్యూబ్ లైట్, చివరికి ఎల్యీడీ లైట్లు వచ్చినట్లు, ఇంటి కోసం నీ చదువూ మారుతూ వచ్చె. ఆడవాళ్లకు సరుకుల పద్దులు, మొగుడు రాసిన ఉత్తరం చదువుకునే చదువు చాలు అనుకునే రోజుల నుంచీ, పిల్లలకు నాలుగక్షరమ్ముక్కలు నేర్పించుకొనే చదువు కావాలి అనే దశకు, అక్కడి నుంచీ కాన్వెంటు చదువుల కోసం ఇంగ్లీషు మీడియం పాఠాలు చెప్పుకోగలిగిన చదువు ఆడవాళ్లు నేర్చుకోవాలి అనే సరికి మళ్ళీ రూటు మారిపాయె. ఎలాగో అగచాట్లు పడి మీ నాయన నీ తెలుగు మీడియం డిగ్రీ, ఇంకా బియ్యీడీకి తగిన టీచరు సంబంధం తెచ్చి ముడేసే. ఆ పైన ఖర్చులు పెరిగి, కొత్త కొత్త వస్తువులన్నీ ఊరిస్తూ మంట పెడుతూ ఉంటే, ఆ వేడి తగ్గించడానికి నీ చన్నీళ్ళ జీతం కావాల్సొచ్చె. మొత్తం మీద ఉద్యోగానికి బయల్దేరాల్సిన సమయం ఆసన్నమైపోయె.

టీచరు ఉద్యోగానికి ఇంటర్వ్యూకు పోయిన్రోజు గుర్తుందా నీకు? ఇంటర్వ్యూ బోర్డులో సియ్యీవో స్థానంలో ఠీవిగా దర్శనమిచ్చిన బిందును చూసి అవాక్కై నోరెళ్ళబెట్టావ్. గ్రూప్ వన్ ఆఫీసరుగా నిన్ను ఇంటర్వ్యూ చేయడానికి కూచున్న నీ పాత స్నేహితురాలిని చూసి సూర్యుని తాకిడికి వాడిపోయిన జాజిపువ్వులా ఎంత ముడుచుకుపోయావు? 'ఏం టెన్షన్ పడొద్దు, ఫ్రీగా కూర్చోండి.' అంటూ బిందు అధికారి హోదాలో నీ భయం పోగొట్టాలని ప్రయత్నిస్తే, గుర్తుపట్టనట్టు ఫోజు కొడు తోందనుకున్నావు. నీ టెన్షన్ పోగొట్టి, స్వేచ్ఛగా ప్రశ్నలకు సమాధానం చెప్పే వాతావరణాన్ని కలిగించినా కూడా, నీకు ఉద్యోగం రాకుండా బిందు అడ్డు పడుతుందేమోనని అనుమాన పడ్డావు. తీరా ఉద్యోగం వచ్చి, చేరితే ఆమె పెట్టిన భిక్షవుతుందే మోనని గింజుకున్నావు. బిందు నిన్ను వెతుక్కుంటూ ఇంటికొచ్చి, ఇంటర్వ్యూలో నీ ప్రతిభను గుర్తు చేస్తూ, దాని కారణంగానే నీకుద్యోగం వచ్చిందని గొప్పగా చెప్పింది కదా! అప్పటిగ్గానీ నువ్వు స్థిమితపడలేదు. మొత్తంగా నీ చన్నీళ్ళు నీ కుటుంబానికి బాగానే ఉపయోగపడ్డాయి. సిటీలో ఆధునికంగా ఇల్లు కట్టించుకోవడానికి, అధునాతన ఫర్నిచర్ సమకూర్చు కోవడానికి, పిల్లలను ఖరీదైన చదువులు చదివించుకోవడానికి ఈ చన్నీళ్ళ వాటా లేకపోతే అయ్యేదేనా?

అవును గానీ, నువ్వు వొద్దనుకున్న లెక్కలు నీ కూతురికి అవసరమయ్యాయి కదూ. ఇంటి దీపం రూపం మారుతోంది కదా, ఇక ఇంజనీర్ ఇల్లాళ్ళు కావాలంటున్నారని ఇంజనీరుని చేస్తివి. సాఫ్ట్వేర్ ఇంజనీర్లయి భర్తలతో పాటు, అమెరికన్ డాలర్లు పోగేసుకుంటున్న అమ్మాయిలను చూశాక, ఇక చన్నీళ్ళ రూపం మారిపోయి కూతుర్ని మెట్రో సిటీకి పంపిస్తివి. తీరా అమ్మాయికి సంబంధం కుదిరాక అబ్బాయేమన్నాడు?

'నా హోదాకు తగినట్లు పెద్ద చదువులు చదివి వుండాలి కానీ, ఉద్యోగం చేయకూడదు. నేను ఇంటికొచ్చేసరికి చక్కగా వండి పెట్టేట్టు ఉండాలి. ఇంటినీ, పిల్లల్ని చూసుకుంటే చాలు. కనక ఉద్యోగం మానేయాలి.'

వాళ్ళేం ఖర్మ, నువ్వూ అలాగే అనుకున్నావు, 'ఇంటా బయటా కష్టపడి నేనేం ఉద్ధరించాను, నా కూతురన్నా సుఖపడనీ ఇంటి పట్టునుండి.' అలాగని నీ కూతుర్ని వొప్పించావు. అంతకన్నా ఆలోచన లేని నీ కూతురూ అంత చదువూ చదివి, నీ అల్లుడి పక్కన హోదాగా అమరిపోయె. అవును మరి, ఇంటి దీపం ఎల్యీడీ బల్బు స్థాయి దాటి, సీలింగ్లో పీవోపీ చాటున దాగిన అలంకరణ దీపపు స్థాయిని చేరిపోయె. బీటెక్కు చదువంతా ఇంట్లో ఇంటీరియర్ డెకరేషన్‌కు, వోవెన్ వంటలకు సమర్పణం చేసేసింది హాయిగా. ఇంతకూ ఇప్పుడు చన్నీళ్ళు అక్కరలేదా? ఎందుకు ఉద్యోగం అక్కర లేకుండా పోయింది? సంపాదన ఉంటే ప్రశ్నిస్తారని భయం కదూ. ధిక్కార స్వరాలు వినిపిస్తాయని కదూ. అంతే మరి, చన్నీళ్ళు చన్నీళ్ళుగానే ఉండాలి, సెగ పుట్టించకూడదు. దీపం దీపంగా వెలుగులు మాత్రమే ఇవ్వాలి,

మంటలు రేపకూడదు. ఇదీ మీ చదువు, దాని ప్రయోజనం. అంతకు దాటితే చన్నీళ్ళు వద్దు, అసలు చదువే వద్దు. ఆ రోజులు కూడా రాబోతాయేమో అనుకుంటున్నావు కదూ.. ఇప్పుడు నీ మనవరాలి వ్యవహారం చూసి.

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు సిద్ధాంతాన్ని ధిక్కరించి, నీ మనవరాలు జర్నలిజం చదవాలని ఆరాటపడటం నీకు మింగుడు పడటం లేదు కదూ. ఏమన్నదా పిల్ల?

'నేను ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టును కావాలనుకుంటున్నాను. దానికి తగిన చదువు చదువుతా.'

గొంతులో ఎంత ధీమా!

అది టెన్ థౌజండ్ వాలా లాగా పేలి ఇల్లంతా దద్దరిల్లి పోయింది. 'అసలీ జర్నలిజం.. అందులోనూ పరిశోధనాత్మక జర్నలిజమేంటి? అంత రిస్క్ తీసుకోవడం ఆడవాళ్లకు అవసరమా? అందులోనూ ఇప్పుడు రోజులెట్లున్నాయి? బయటికి పోయిన ఆడపిల్లలు క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చే వరకు గుండెల్లో గుబులు. అలాంటిది ఏకంగా ప్రమాదం నోట్లో తల పెట్టి, ప్రమాదంలోనే బతుకుతానంటే ఒప్పుకోవాలా? అంతగా ఉద్యోగం చేయాలని ఉబలాటం ఉంటే, ఏ బ్యాంకు లోనో, టీచింగ్‌లోనో చేరిపోక. పెళ్లి చేసుకుని హాయిగా పిల్లా పాపలతో గడపడం పోయి ఆపదలతో ఆడుకుంటానంటావు. జర్నలిస్టు అంటే ఎక్కడెక్కడో తిరగాలి, ఎన్నెన్ని ప్రమాదాలో ఎదుర్కోవాలి. అవన్నీ నీకవసరమా?' అంటూ అందరూ బుద్ధి చెప్పబోతే చెవులు మూసుకుందని 'ఎంత మకురు ఈ పిల్లకు?' అనుకున్నావు కదూ. ఆ పిల్ల ఎంత స్పష్టంగా చెప్పింది 'నాకు జర్నలిజమంటే ప్యాషన్. అందులోనూ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజ మంటే ఇంకా ఇష్టం. ఆడవాళ్ళు 'ఇల్లు', 'పెళ్లి', 'పిల్లలు', 'బరువులూ', 'బాధ్యతలూ', తొక్కా తోలూ అంటూ నన్నాపొద్దు.' అని కుండ బద్దలు కొట్టేసింది.

బిందు గుర్తొస్తోందా మళ్ళీ? తన చదువు గురించి మొదట్నుంచీ అంతే కచ్చితంగా ఉండేది కదూ. అధికారిగా ఎంత ఆత్మవిశ్వాసంతో, మిగిలిన మగ ఉద్యోగులతో పాటు ఎంత దర్పంగా కూర్చుంది! నీ చదువు ప్రతి అడుగులో ఇంటి అవసరాలు తీర్చడానికేగా ఉపయోగపడింది. అసలు నీకంటూ ఏ చదువు చదవాలనే ధ్యాసెక్కడుంది? ఎప్పుడన్నా నీకంటూ ఒక ఇష్టమన్నా ఉందా? మొదట్నుంచీ ఏం చదవాలో ఎంత చదవాలో నీ ప్రమేయం లేకుండానే నిర్ణయింపబడింది. పాత్ర మారిన ప్రతిసారీ అందులో చేరుతున్న పాలలా నీ రూపమూ మారిపోయింది. నీదంటూ ఓ రూపమేది? చివరికి నీ కూతుర్నీ నీలాగే చేస్తివి. మారింది చదువే కానీ, ప్రయోజనం మాత్రం అదే. ఇంటికి, కుటుంబానికి ఏం అవసరమో అదే మీది.



ఒక్కసారి నువ్వూ, నీ కూతురూ అనే సంగతి పక్కన పెట్టి చూడు. నీ దగ్గర చదువుకున్న ఆడపిల్లలు రెక్కలు విప్పుకున్న విహంగాల్లా కోరిన తీరాలకు చేరడం లేదూ. అంతెందుకు? బిందుకు, నీకూ ఎంత తేడా! ఎంత ఆత్మవిశ్వాసం బిందులో. ఇల్లాలి చదువు ఇంటికి దీపమైతే, ఇంటాయన చదువు ఊరిని వెలిగించాలా? ఏం నువ్వు నింగిలో సూర్యబింబమై ప్రకాశిస్తే వెలుగులు చిమ్మవా? సరే నీ కథ, నీ కూతురు కథ ఎలాగో గడచిపోయాయి. ఇక నీ మనవరాలు స్వయంప్రకాశమై వెలగాలనుకుంటోంది. తప్పేముంది? ఆ వెలుగులో లోకాని కెన్ని అద్భుతాలు చూపించబోతోందో! చూపించనీ. ఎన్ని చీకట్లు తొలగించబోతోందో! తొలగించనీ.

ఏంటాలోచిస్తున్నావు? రెక్కలు విప్పుకొని స్వేచ్ఛగా విహరిస్తున్న విహంగాలు కళ్ళ ముందు కదులుతున్నాయా? ఎక్కడికిలేస్తున్నావు? అరె, మనవరాలి దగ్గరికా? కొంపదీసి హాయిగా నిద్రపోతున్న నీ మనవరాలిని నిద్ర లేపుతావా ఏమిటి? మంచం పైనా, చుట్టూ అడ్డదిడ్డంగా పుస్తకాలేసుకొని ఎలా నిద్రపోతోందో చూడు. ఓహో, పుస్తకాలు సర్దిపెడుతున్నావా? పెట్టు పెట్టు, నీ పని అదే కదా. ఏంటంత తదేకంగా చూస్తున్నావు?

ఓ మనవరాలేసిన బొమ్మా?

రెక్కలు విప్పుకొని మేఘాల పైన ఎగురుతున్న పక్షి..

కిందేదో రాసుందే.

Freedom lies in being bold

- Robert Frost

**'స్వేచ్ఛ, భయం ఒకే ఒరలో ఒదగవు.'**

**– స్వేచ్ఛ**

స్వేచ్ఛ గురించి ఒక్క మాటలో ఎంత గొప్పగా చెప్పింది కదూ, నీ మనవరాలు స్వేచ్ఛ. ఇంకా తన స్వేచ్ఛకు సంకెల వేయాలనే ఉందా నీకు? లేకపోతే తనకు తోడుగా కుటుంబానికి ఎదురు నిలుస్తావా? ■

## కల్లోల యుగాల మీదుగా ...

అంతిమ శ్వాస దాకా
ఆరిపోని ఈ జీవనజ్వాలను
ఈ పెనుగాలుల హోరులో
ముంచెత్తే ఉప్పెన ముప్పులో
నిలువెత్తు అజేయ శక్తితో
శతాబ్దాలుగా నిశ్చలంగా
నిలబడుతూ తలపడుతున్న
మానవ వారసత్వమంతా
నాలో నీలో నిబడీకృతమై
అవిశ్రాంత శ్రామిక శక్తిలో
కల్లోల యుగాల మీదుగా
కలలను సాకారం చేసుకునే సంకల్పం
ప్రజ్వలించే నూతన తరాల
ఉత్తేజిత జీవన సమరం!

- నిఖిలేశ్వర్
91778 81201



## వాక్యాంతాన్ని నేనే!

ఇప్పుడే
ఓ రెండు వాక్యాలకు పురుడు పోశాను
పూట పూటకీ రెండేసి వాక్యాలైనా సృష్టిస్తాను
రాత్రికి పహారా కాస్తూ
భద్రంగా చీకటి దీపాలను ఆర్పే వేళకు
ఉదయ భాస్కరుడి చేతికి
కాసిన్ని కొత్త రూపకాలను కానుకిస్తాను!

నా గుండెకు, నీ గుండెకూ నడుమ
రస దండమొకటి నిర్మిస్తాను
నా ఊహల సాగరంలో పులిమిన
పదాల పట్టు పోగులతో కవితా కన్యక కోసం జరీ చీరలల్లి
ఆ దండెం మీద ఆరేస్తాను!

బతుకు భాష తెలిసిందే కనుక
బతకాల్సిన బాట కూడా ఎరుకైందే కనుక
నిజాన్ని, నిక్కచ్చి మాటల్లో వెలిగించాలని తప్ప
వ్యాకరణ సూత్రాల పట్ల పెద్దగా వ్యామోహం లేదు
జీవితానుభాలను గాలించి జల్లెడ పట్టాలని తప్ప
అనుకరణల పట్ల అనురక్తి లేదు
శైలీ, శిల్ప నిర్మాణ రీతుల్లో
అనుసరణ అస్సలు సరిపడదు!

ఎప్పటికప్పుడు వాక్యాలు వొదులైపోకుండా
అందమైన కవిత్వంలో
అనంతాకాశాన్ని ముంచి
చుక్కల్ని పొదిగి జరీలల్లుకుంటాను
ఆగ్రహ జ్వాలల్లాంటి అక్షరాలతో
అవనీ తలాన్ని స్పృశించి
పద్యాంతాల్లో నిలువుటద్దాలు పేర్చుకుంటాను!

కవిత్వంతోనే
నా ఊపిరి వెలిగించుకుంటాను
కవిత్వంలోనే
నా ఆయువు పొడిగించుకుంటాను
నా కవిత్వానికి
నేనే వాక్యాంతాన్నవుతాను!

- కంచరాన భుజంగరావు
9441589602.




# విద్యావ్యవస్థ కేంద్రంగా చందు నవలలు

- కెపి అశోక్ కుమార్
97000 00948

ప్రముఖ విమర్శకుడిగా పేరుగాంచిన చందు సుబ్బారావు కవి, కథకుడు, నవలాకారుడు కూడా. చదివింది సైన్స్ అయినప్పటికీ, మొదటినుండి చందు సుబ్బారావు సాహిత్యం పట్ల ఎక్కువ ఆసక్తి కనబరిచేవారు. క్రమంగా అతనిలో సాహిత్యాభిలాష పెరగడంతో చివరకు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు తన క్లాసు పుస్తకాలు పక్కనబెట్టి, అక్కడి గ్రంథాలయంలో వున్న తెలుగు సాహిత్యాన్ని అంతా క్షుణ్ణంగా మథించి శోధించాడు. తనపై గురజాడ, శ్రీశ్రీ, గుర్రం జాషువాల ప్రభావం వుందని చెప్పుకునే చందు సుబ్బారావు దాదాపుగా అన్ని సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశాడు. కవిత్వం రాశాడు. నలభైకి పైగా కథలు, ఎనిమిది నవలలు, అయిదు విమర్శా గ్రంథాలు వెలువరించారు. విషయ నిపుణుడిగా అతను రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

ముప్పయి, నలభై ఏళ్లుగా ఆంధ్రా యూనివర్శిటీతో గల సంబంధం – విద్యార్థిగా, హాస్టరుగా, రీసెర్చి స్కాలర్‌గా, లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, డిపార్టుమెంట్ హెడ్డుగా చందు సుబ్బారావు అనుభవాలు, అనుభూతులను తమ నవలా రచనలో ఇమిడ్చి, వాటికి శాశ్వతత్త్వం కలిగించారు. ముఖ్యంగా యూనివర్శిటీ విద్యార్థుల కాలేజీ జీవితాన్ని, హాస్టల్ జీవితాన్ని, వాళ్ళ ప్రవర్తనలను, మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించిన నవలలున్నాయి. హైడ్రాలజీ ప్రొఫెసర్‌గా నేపాల్, హంగేరి దేశాల పర్యటనలను చక్కటి యాత్రా నవలలుగా మలచడం విశేషం. పత్రికా రంగంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ధోరణులను అందులో 'ఎడిటర్' పాత్రను విశ్లేషిస్తూ రాసిన నవల కూడా వుంది.

ప్రాథమిక విద్యావిధానాన్ని నేపథ్యంగా తీసుకుని చందు సుబ్బారావు రాసిన నవలే 'ఇండియన్'. ఇందుకు ప్రభుత్వ పాఠశాలను కేంద్రంగా తీసుకోవడానికి బదులుగా పట్టణంలో పేరుపొందిన ఒక కాన్వెంటు స్కూలును నేపథ్యంగా తీసుకోవడం వల్లనే ఈ నవల వైవిధ్యంగా తయారైంది. అన్ని విషయాల్లో క్రైస్తవులను దూరంగా ఉంచే మనుషులు తమ పిల్లల చదువుల కోసం, మంచి భవిష్యత్తు కోసం కాన్వెంటు చదువులనే కోరుకుంటారు. మంచి బోధన, క్రమశిక్షణ అలవడుతుందని వారి నమ్మకం. వాళ్ళు వసూలు చేసే ఫీజులు, డ్రెస్సులు ఇతర హంగులన్నీ ఉన్నవాళ్ళ కోసమే తప్ప పేదవాళ్ళకు ఇందులో చోటులేదు. ఛైర్మన్ కూతురిననే అహంకారంతో పదవ తరగతిలోని శైలజ, పొగరుమోతుతనంతో శరత్ క్రమశిక్షణను ఉల్లంఘించడానికి ప్రయత్నిస్తారు. ఆ కాన్వెంటులో క్రమశిక్షణకు మారుపేరైన పి.డి. మైకెల్, శైలజను నిలదీయడంతో ఆమె అవమానంగా భావించి ఛైర్మన్‌కు చెప్పగా, అతను వచ్చి స్కూల్లో మైకెల్‌పై చేయి చేసుకుంటాడు. దాంతో శైలజకు టి.సి. ఇచ్చి పంపించారని తెలిసి మైకెల్, శైలజను తీసుకువచ్చి ప్రిన్సిపల్‌ను బతిమాలి తిరిగి సీటు ఇప్పిస్తాడు. ఫీజు కట్టలేక శరత్ బడికి రావడం లేదని తెలిసి తన సొంత డబ్బు ఇచ్చి ఆదుకుంటాడు. ఆడపిల్లలను అల్లరి చేసే రౌడీలకు మైకెల్ తగిన బుద్ధి చెప్పడంతో వారు సమయం కోసం ఎదురుచూసి రిపబ్లిక్ డే సంబరాల్లో కరెంట్ తీసేసి నానా గలాటా సృష్టిస్తారు. కలెక్టర్ క్రమశిక్షణా చర్యగా మైకెల్‌ను సస్పెండ్ చేస్తాడు. శరత్ తండ్రి హెడ్ కానిస్టేబుల్ సహాయంతో ఆ గూండాలను పట్టుకుంటారు. ప్రిన్సిపల్ మైకెల్‌ను బెంగుళూరు బ్రాంచికి పంపుతూ, మైకెల్‌ను గాఢంగా ప్రేమించే దేవిని అతనికిచ్చి పెళ్ళి చేయడానికి

నిశ్చయిస్తారు. అందరూ వీడ్కోలు చెబుతుండగా మైకెల్ బెంగళూరు వెళ్ళడంతో నవల ముగుస్తుంది. అమాయకుడు, అందగాడు, వృత్తికే అంకితమైన పి.డి. మాష్టారు మైకెల్ – అతడ్ని అమితంగా ఆరాధించే దేవీ టీచరు, గాసిప్స్ ప్రచారం చేసే వెంకట్రావు, మేరీ టీచర్ వెనకాల పడుతుంటాడు. శ్రీనివాసాచారి మాష్టారు అక్రమ సంతానమే మేరీ అని ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడతాడు. విద్యార్థులను, సిబ్బందిని ఆత్మీయంగా చూసుకునే ప్రిన్సిపల్ మిరండా, స్టాఫ్‌కు, ప్రిన్సిపల్‌కు మధ్య వారధిగా నిలిచిన వైస్ ప్రిన్సిపల్ జార్జిరెడ్డి కలిసి ఆ స్కూల్‌ను బాధ్యతాయుతంగా నిర్వహిస్తుంటారు. ప్రతి స్కూల్లో బోధనా సిబ్బంది మధ్య వుండే అపార్థాలు, అనుమానాలు, ఆప్యాయతలు వేధింపులు ఈ కాన్వెంట్ స్టాఫ్‌లో కూడా కనిపిస్తాయి. చివర్లో వెంకట్రావు దుర్మార్గం బయటపడి అతను మారిపోవడం, శ్రీనివాసాచారి తన కూతురు రహస్యాన్ని ప్రిన్సిపల్‌కు తెలియజేసి క్షమార్పణ కోరడం, దేవి మనసెరిగి ప్రిన్సిపల్ ఆమెకు మైకెల్‌తో పెళ్ళి నిశ్చయించడం ఇందులో చూడవచ్చు. ఇందులో విద్యార్థినీ విద్యార్థులు కౌమార ప్రాయంలో వారిలో పొడచూపే ఆకర్షణలు, ఆసక్తులు థ్రిల్లింగ్‌గా వుండి వాటిని ఎంజాయ్ చేయాలనే మనస్తత్వం వున్నా, స్కూల్ డిసిప్లిన్‌కు లంగి, బుద్ధిగా వుండడాన్ని చాలా చక్కగా చూపించారు. ఈరోజు అంతా కాన్వెంటు చదువులకోసం ఎగబడటానికి కారణం ప్రభుత్వ పాఠశాలలన్నీ రోజురోజుకు నాసిరకంగా తయారు కావడమేనని తేల్చడం, చదువుకోవడంలో, విజ్ఞానం ఆర్జించడంలో మీడియం ప్రసక్తి అవసరమని వివరించిన విధానం బాగుంది.

యూనివర్శిటీ జీవితం ఎంత అందంగా, ఆకర్షణీయంగా వుంటుందో "అచంచలం" నవలలో వివరించారు. మగపిల్లల హాస్టల్లో, ఆడపిల్లల హాస్టల్లో వారు ఎలా ప్రవర్తిస్తారో ఎలా ఆలోచిస్తారో చెబుతారు. కాలేజికి కాలక్షేపానికి వచ్చేవారు వుంటారు. చదువుల కోసమే వచ్చేవారు వుంటారు. అసూయతో ఆత్మన్యూనతతో బాధపడేవారుంటారు. నిబద్ధతతో, ఒక ఆశయంతో చదువులు కొనసాగించే వారుంటారు. మరికొంతమంది అవకాశవాదులుగా, అనుచరులుగా మారిపోవడానికి సిద్ధంగా వుంటారు. అమ్మాయిల్ని ఆకర్షించడానికి, అందర్నీ హడలగొట్టడానికి తమ హీరోయిజాన్ని ప్రదర్శించే వాళ్ళుంటారు. రకరకాల మనస్తత్వాలు గల విద్యార్థులను, వారి వారి డిపార్ట్‌మెంట్ల నేపథ్యంలో వారి ఆలోచనా విధానాన్ని వివరిస్తారు. ఇవే కాకుండా యువతీ యువకుల మధ్య ఏర్పడే ఆకర్షణ, ప్రేమలు, విరోధాలు, ఎగ్జిబిషనిజం, హిపోక్రసీని చాలా చక్కగా పట్టుకున్నారు. క్యాంపస్, క్యాంటీన్, లైబ్రరీ, హాస్టల్, బీచ్, థియేటర్లు వారు నిరంతరం సందర్శించే ప్రాంతాలు. ఎన్నికలు విద్యార్థులను వైరి వర్గాలుగా చీలుస్తాయి. ఈ నవలలో ప్రధాన పాత్రధారిణి 'ఏడు వారాల నగలు' అనే నిక్‌నేమ్ గల అరుణ నిర్భయంగా తిరగడం, అబ్బాయిలతో చనువుగా చొరవగా కలిసి వుండటం, తన భావాలను, అభిప్రాయాలను నిష్కర్షగా వెల్లడించడం.. ఇవన్నీ ఆడవాళ్ళలో అసూయను, మగవాళ్ళలో ఆరాధనా భావాన్ని కలుగజేస్తాయి. కాలేజిలో తన హోదాను ప్రదర్శించే సుందరం, కమల, మహేష్, సుల్తానా, సురేష్, అరుణ మావయ్య కార్మిక నాయకుడైన చక్రవర్తి, వార్డెన్ సూర్యకుమారి, సుబ్బారావు, భాస్కరం లాంటి ఆలోచనాపరులు – వీళ్ళందరి జీవితాల్ని, వాళ్ళ మనస్తత్వాల్ని, ప్రవర్తలను వివరంగా ఆసక్తికరంగా ఇందులో చిత్రీకరించారు. ఇందులో ఫ్యాక్టరీ క్లబ్ పేరిట వున్న స్టాఫ్‌రూంలో అధ్యాపకుల ధోరణి, ప్రవర్తన, వారి రాజకీయాలు, విద్యార్థుల పట్ల వారి అభిప్రాయాలను, సంకుచిత ధోరణులను కూడా ఇందులో తెలియజేశారు. క్లాసులు, పరీక్షలు తప్ప మొత్తం యూనివర్శిటీ జీవితాన్ని యథాతథంగా ఇందులో చూపగలగడంలో రచయిత చక్కని ప్రతిభ కనబరిచారు.

హాస్టల్ విద్యార్థుల జీవనాన్ని, వారి ఆలోచనా విధానాన్ని, వారి సరదాలు – సరాగాలను అత్యంత సహజంగా చిత్రీకరించిన నవల "అగ్గిపుల్లలు". చదువు మీదకంటే ఎంజాయ్ చేయడం కోసమే యూనివర్శిటీలో చేరే శేఖరం లాంటి విద్యార్థులు వున్నారు. ఇక పాలిటిక్స్ చదివే శాస్త్రికి అంతా రాజకీయమే. 'లా' చదివే వెంకట్రావు మంచి చదువరి. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చర్చించిగాని వదలడు. ఇంకా సంగీతం పిచ్చి వున్న బుచ్చిబాబు, బాడీ బిల్డర్ రామం, క్రికెట్ ఆడే కిరణ్‌కుమార్ లాంటి విద్యార్థులు వున్నారు. ఏదో ఒక దాంట్లో ప్రవేశం వున్న విద్యార్థులు ఇటు హాస్టల్లో అటు యూనివర్శిటీల్లో ముఖ్యంగా విద్యార్థినుల్లో ప్రత్యేక గుర్తింపునకు నోచుకుంటారు. వారితోపాటు ఏ ప్రత్యేకతలూ లేని ప్రసాదం లాంటి యావరేజ్ స్టూడెంట్స్ కూడా వుంటారు. డబ్బు, పర్సనాల్టీ, చొరవ లేని ప్రసాద్‌లాంటి వాళ్లు శేఖర్ విచ్చలవిడితనాన్ని, నిర్లక్ష్యాన్ని చూసి ఆత్మన్యూనతకు లోనవుతారు. అమ్మాయిల గురించి మాట్లాడుకోవడం, అమ్మాయిలతో మాట్లాడాలనుకోవడం, పరిచయాన్ని స్నేహంగా మార్చుకొని లేడీస్ హాస్టళ్ళకు వెళ్ళడం, వాళ్ళతో సినిమాలు, షికార్లు అంతా ఒక రంగుల కలలా తయారవుతుంది. సెమిస్టర్

సిస్టమ్‌ను తీసేయాలని విద్యార్థులంతా నిరవధిక సమ్మెకు పిలుపునిస్తారు. సమ్మె పేరుతో చదువులకు ఆటంకం కలుగుతుందనో, క్లాసుల బాయ్‌కాట్ అనవసరమనడంతో వివాదం చెలరేగుతుంది. విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటారు. శేఖర్, శాస్త్రి తరపున నిలిచి వెంకట్రావు, డేవిడ్‌ను కొడతాడు. క్యాంపస్‌లో శాంతిభద్రతల దృష్ట్యా 15 రోజులపాటు కాలేజీలను మూసివేస్తారు. మెస్ కూడా మూసివేయడంతో విద్యార్థులంతా తమ స్వస్థలాలకు వెళ్ళిపోతారు. రైలులో లలిత, ప్రసాదం కలుసుకున్నప్పుడు శేఖర్, సుధ అక్కడే వుండిపోయారని తెలుస్తుంది. శేఖర్, సుధను బాయ్స్ హాస్టల్‌కు తీసుకురావడం, ఆమెతో గడపడం అందరికీ తెలిసిపోతుంది. సుధ, శేఖరంతో రెండు రోజులు సింహాచలం వెళ్ళడం హాస్టల్ అంతా గుప్పుమంటుంది. వార్డెన్ నిలదీయడంతో ఆత్మాభిమానంతో సుధారాణి ఆత్మాహత్యా ప్రయత్నం చేస్తుంది. దాంతో ఆమె తల్లిదండ్రులు వచ్చి, చదువు మాన్పించి ఇంటికి తీసుకెళతారు. దాంతో క్రుంగిపోయిన శేఖరం పరీక్షలకు ప్రిపేర్ కూడా కాలేకపోవడంతో, పరీక్షలు రాయలేక ఇంటికి వెళ్ళిపోతాడు. వాళ్ళ సంగతి తెలిసిన పెద్దవాళ్లు సుధ, శేఖరం పెళ్ళి నిశ్చయం చేస్తారు. వాళ్ళ మేనమామ ఫ్యాక్టరీలో మేనేజర్‌గా పనిచేయడానికి ఒప్పుకుంటాడు. ప్రసాదం పరీక్షలు బాగా రాయాలని, క్లాసు తెచ్చుకుంటే తమ కాలేజీలోనే హిస్టరీ లెక్చరర్‌గా వేయిస్తానని మాటిస్తాడు. లలితను పెండ్లి చేసుకుంటే బాగుంటుందని సూచిస్తాడు. శేఖరం – వెంకట్రావు, డేవిడ్‌కు క్షమాపణలు అందజేయడంతో ఇప్పుడంతా కాలేజ్, హాస్టల్‌లో గడపిన రోజులన్నీ జ్ఞాపకం వస్తున్నాయని బెంగటిల్లుతారు. పరీక్షలు రాసిన విద్యార్థులు అన్నింటినీ వదిలేసి తమ మధురానుభూతులను నెమరువేసుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోతారు.

యూనివర్శిటి కాలేజీలు వేసవి సెలవులనంతరం తెరిచిన తర్వాత పట్టుమని పదిహేను రోజులు కూడా పనిచేయలేదు. అంతలో యూనియన్ ఎలక్షన్లు. వాటి తర్వాత హాస్టల్ యూనియన్ ఎన్నికలు. ఆ తర్వాత ఆటల పోటీలు. ఆపైన వారం రోజులకు రీ సెమిస్టర్ గొడవలు, కొట్లాటలు. ఇందులో విద్యార్థులకు చదువులు తప్ప రాజకీయాలు, వినోదాలతోనే కాలం గడిచిపోతుంది.

యూనివర్శిటీల్లో రిసెర్చి పేరిట జరిగే తతంగం, రిసెర్చి స్కాలర్ల అగచాట్లు, డిపార్ట్‌మెంట్ రాజకీయాలను రచయిత 'శాస్త్రీయం'గా తెలియజేశారు. 'రీసెర్చి అంటే బానిసత్వం. రీసెర్చి చెయ్యడమంటే మనసు చంపుకోవడమే. వాడికి రీసెర్చి పూర్తయిందంటే, పూర్తిగా జీవచ్ఛవం అయ్యాడన్నమాట. డాక్టరేట్ డిగ్రీ వచ్చిందంటే కట్టు బానిసత్వంలోకి ఈడ్చివేయ బడ్డాడన్నమాట' అనే భావనలు, భయాలు విద్యార్థిలోకంలో ప్రచారంలో ఉంటూనే ఉంటాయి. ఇందులోని నిజానిజాలను నిగ్గుతేల్చడానికి చేసిన మంచి ప్రయత్నమే ఈ నవల. టాపిక్ ఎంపిక, సమాచార సేకరణ, పరిశోధనా పద్ధతులు, చివరకు ఏం చేయాలో, ఏం రాయాలో కూడా గైడ్, హెడ్‌లే నిర్దేశిస్తారు. వాళ్ళ అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని రీసెర్చి స్కాలర్ల మీద రుద్దుతారు. వాళ్ళ పాట వినకపోయినా, ఎదిరించినా రీసెర్చి పూర్తి కాదు. పూర్తయినా ఓకే కాదు. వాడ్ని ముప్పుతిప్పలు పెట్టి ఎందుకూ పనికిరాకుండా చేస్తారు. తమ తెలివితేటలను మరుగు పరుచుకుని, వారికి బానిసలా పడివున్న వాళ్ళకే పట్టాలు, ఉద్యోగాలు దొరుకుతాయి. తెలివైన రీసెర్చి స్కాలర్లను అస్సలు భరించలేరు. వాడ్ని ఎలాగైనా తరిమేయాలని కంకణం కట్టుకుంటారు. కుల, మత, ప్రాంత జెండర్ల పరంగా ఆలోచించి తమ వారిని పైకెత్తడం, వాళ్ళకు అవకాశాలు కలిగించడం మామూలైపోయింది. ముఖ్యంగా ఈ నవలలో తెలుగు విభాగాన్ని కేంద్రంగా తీసుకుని, రీసెర్చి పేరిట జరిగే భాగోతాన్ని బట్టబయలు చేశారు. డిపార్టుమెంట్‌లో బాగా చదివిన పండితులు, పరిశోధకులు అన్నమాటే గాని వెన్నెముక లేని జీవుల్లా ప్రవర్తిస్తారు. ప్రజలకందని ఎత్తున ఏదో పలవరిస్తుంటారు. ఉపాధ్యాయులు పుస్తకాల్లో పుట్టి, పుస్తకాల్లో పెరిగి, పుస్తకాల్లోనే వుండిపోతారనిపిస్తుంది. అంతా కృత్రిమ ప్రపంచంలా వుంటుంది. ఇందులో పాండిత్యం కలిగి సంప్రదాయవాదిగా, లౌక్యం తెలియకుండా ముక్కుసూటిగా పోయిన పార్వతీశ్వర శాస్త్రి అనే రీసెర్చి స్కాలర్ ఎదుర్కొన్న సంఘటనలు, అనుభవాలు అతని జీవితంలో, వ్యక్తిత్వంలో తెచ్చిన మార్పులను ఇందులో ఆసక్తిగా మలిచారు. సాంప్రదాయ వాదులు, అభ్యుదయవాదులు విద్యార్థుల్లో వున్నప్పటికీ, వారు కొట్టుకోకుండా కలిసి వుండటం విశేషం.

'హిమపుత్రి' ఒక భగ్న ప్రేమికుడి కథ. ఆంధ్ర యూనివర్శిటీలో జియాలజీ చదవడానికి వచ్చిన నేపాల్ యువతి కృష్ణసుధ ఆకర్షణకు పడిపోతాడు ప్రకాశరావు. ఎల్లవేళలా ఆమెకు తోడుగా వుంటూ, ఆమె ఒంటరితనాన్ని పోగొడుతూ తన ఆరాధనా భావాన్ని వ్యక్తపరిచే ప్రకాశరావు పట్ల ఆమెకున్నది అభిమానం, కృతజ్ఞత తప్ప ఇంకేమీ లేదు. నిలదీసిన ప్రకాశరావుతో తాను నేపాల్ రాజవంశీకురాలినని, సామాన్యులతో ఎలాంటి సంబంధాలు పెంచుకోకూడదని, ప్రేమలాంటి



భావనలను దగ్గరికి రానివ్వ కూడదని ఖరాఖండిగా చెబుతుంది. ప్రకాశరావు ప్రేమను గుర్తించి తనను తను అర్పించుకోవడానికి సిద్ధపడినా, ఆమెపట్ల తనకున్నది పవిత్ర ప్రేమయనే దేహవాంఛ కాదని ఆమెను తృణీకరిస్తాడు. కోర్సు అయిపోయిన తర్వాత ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. ప్రకాశరావు తండ్రి చెప్పిన సంబంధం చేసుకుని, యూనివర్శిటీలో రీసెర్చి పూర్తిచేసుకుని ప్రొఫెసర్‌గా చేరతాడు.

కాలం గడుస్తున్నా ప్రకాశరావు మనసులోంచి కృష్ణసుధ చెరిగిపోలేదు. అతను ఎన్ని ఉత్తరాలు రాసినా సమాధానం ఉండదు. ఒకసారి అనుకోకుండా ప్రకాశరావును మిగతా ఇద్దరు ప్రొఫెసర్లతో కలిపి, ఖాట్మండులో జరిగే అంతర్జాతీయ సెమినార్‌కు పంపిస్తారు. ముగ్గురు ప్రొఫెసర్లు తమ భార్యలతో ఖాట్మండుకు బయల్దేరతారు. ప్రకాశరావుకు ఎలాగైనా కృష్ణసుధను కలవాలనే కోరిక అతడ్ని స్థిమితంగా వుండకుండా చేస్తుంది. కృష్ణసుధ నేపాల్ రాజు గారి ప్రత్యేక రక్షణాధికారి, పోలీసు డైరెక్టర్ జనరల్ నారాయణ ఖరేల్ భార్య అని, వాళు ్ళ రాజాంతపురంలోనే వుంటారని, వారిద్దరి పిల్లలు అమెరికాలో చదువుతున్నారని, ప్రస్తుతం కృష్ణసుధ, భర్తతో జపాన్ యువ రాజు పట్టాభిషేకానికి టోక్యో వెళ్ళారనే సంగతి తెలుస్తుంది. ప్రకాశరావు ఖాట్మండుకు వచ్చిన సంగతి తెలుసుకుని కృష్ణసుధ టోక్యో నుంచి వెంటనే తిరిగివస్తుంది. అతడ్ని ఆప్యాయంగా కలుసుకుని కాలేజి ముచ్చట్లు, తమ ప్రేమ సంగతులను నెమరేసుకుంటారు. ఆమె జీవితం ఏమంత సుఖంగా లేదని ప్రకాశరావు గుర్తిస్తాడు. ఆమె ఇచ్చిన వీడ్కోలు విందులో, ఆమె హృదయంలో తనకు ఒక స్థానముందనే విషయాన్ని గమనించినా, ఎవరి కుటుంబ బంధనాల్లో వారు చిక్కుకుపోవడం వల్ల ఒక విధమైన నిస్సహాయత, దాని వెనుక తొణికిసలాడే వారి ప్రేమ మన మనసులను కదలిస్తాయి. 'ఈ స్వప్నం కొద్ది నిముషాల్లో కరిగిపోతుంది. కృష్ణమాయ విడి పోతుంది. శాశ్వత ఏకాంతంలోకి హృదయం మరలిపోతుంది. ఇది అనిత్యం. ఈ కలయిక అశాశ్వతం. నిరక్షణే సత్యం. ఆరాధనే మనిషికి స్థిర సౌందర్యం. బాధే సౌఖ్యమయం' అన్న ప్రకాశరావు ఆలోచనలతో, వారి తిరుగు ప్రయాణంతో ఈ నవల ముగుస్తుంది. ప్రేమ అంటే ఏమిటి? ప్రేమికుల మనస్తత్వాలను, ఒక భగ్న ప్రేమికుడి అంతరంగాన్ని అద్భుతంగా చిత్రీకరించిన ఈ నవల, ప్రేమ అంటే రెండు దేహాలను సంబంధించినది కాదు. రెండు మనసులకు సంబంధించినదని తెలియజేస్తుంది. దీన్నే పవిత్ర ప్రేమ అనో, అమలిన శృంగారమనో రకరకాలుగా చెప్పుకోవచ్చు. ఈ నవల చదివిన వారికి 'వలపెరుంగక బ్రతికి మురిసే కన్నా, వలచి విఫలమొంది విలపించుటయే మేలురా' అనే బసవరాజు అప్పారావు కవిత జ్ఞాపకం రావడంలో ఆశ్చర్యమేమున్నది?

'ఎరికా' ఒక మంచి యాత్రా నవల. హైడ్రాలజీ డిపార్ట్‌మెంటులో పనిచేసే ప్రకాశరావు విదేశీయాత్రలు చేయాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. అదే డిపార్ట్‌మెంటల్ ట్రైనింగ్ కింద సహోద్యోగులు అన్ని విదేశాల పట్ల మక్కువ చూపితే, ప్రకాశరావు మాత్రం సోషలిస్టు దేశాలనే ఎంపిక చేసుకోవడం వల్ల అతనికి ఓ పట్టాన విదేశీ ప్రయాణ అవకాశం దొరకదు. చివరకు హంగేరీ వెళ్ళటానికి అనుమతి రాగా ఎగిరి గంతేసి ప్రయాణం కడతాడు. అదొక చలి దేశమని తెలియక, సరియైన దుస్తులు తీసుకురాకపోవడంతో, అక్కడి వాతావరణ పరిస్థితులకు అడ్జస్టు కాలేక దెబ్బతింటాడు. ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకున్న ఇంటర్‌ప్రిటర్ ఎరికా, అతనికి వసతి కల్పించిన లాండ్‌లేడీ మార్గరెట్ సాహచర్యంతో కోలుకుంటాడు. హంగేరీలోని భారతీయుల్ని కలుసుకుంటాడు. అక్కడి మనుషులతో పరిచయాలు, వాళ్ళ మనస్తత్వాలు, ప్రవర్తన, వాళ్ళతో స్నేహాలు, ప్రేమలు, ఆప్యాయతలు, విందులు, విలాసాలు అన్నీ కలిపి జీవితంలో మరిచిపోలేని విధంగా కొన్ని మధురానుభూతుల్ని మిగులుస్తాయి. కల్లాకపటం లేకుండా ఓపెన్‌గా హాస్యంగా మాట్లాడే మార్గరెట్, గైడ్‌గా వ్యవహరించిన ఎరికా చెరగని ముద్ర వేస్తారు. ఏదైనా కొత్త ప్రదేశంలో కొత్తవాళ్ళు చేసిన సహాయాలు, వారి పరిచయాలను ఆత్మీయతగా మలచుకుని ప్రేమభావన ఏర్పరచుకునే ప్రకాశరావు లాంటివాళ్ళు, సెంటిమెంటల్ ఫూల్‌గా కనిపిస్తారు వాళ్ళ దృష్టికి. ఈ నవల చదువుతుంటే ప్రకాశరావుతో కలిసి మనమంతా హంగేరీ తిరిగి వచ్చినట్లుగా అనుభూతి చెందుతాం. నిజానికి ఈ ట్రావెలింగ్‌ను యాత్రా నవలగా తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది.

పత్రికారంగంలో వస్తున్న మార్పులు, పెడధోరణులను 'ఎడిటర్' నవల చిత్రీకరించింది. ఒకప్పుడు సామాజిక సేవలో భాగంగా పత్రికలు నెలకొల్పిన వారున్నారు. తాము నమ్మిన ఆశయాలు, విలువలకు అంకితమైన సంపాదకులున్నారు. కాలం మారింది. డబ్బు సంపాదనే ముఖ్యంగా పత్రిక సర్క్యులేషనే విజయంగా భావించే పత్రికా యజమానుల దృష్టిలో

సంపాదకులకు విలువే లేదు. పత్రిక సర్క్యులేషన్ పెంచడానికి నీచాభిరుచులను రేకెత్తించే సాహిత్యాన్ని ప్రచురించడానికి పత్రికలన్నీ పోటాపోటీగా తయారవుతుంటే, విలువలు అంటూ పాకులాడేవాళ్ళకు పత్రికా రంగంలో స్థానం లేకుండా పోతున్నది. మారిన కాలంలో మారుతున్న పాఠకుల అభిరుచులు, పత్రికల మధ్య పోటీ, రచయితల దిగజారుడు తనం, కవుల అసూయ, పత్రిక నిర్వహణలో యజమానుల జోక్యం, సర్క్యులేషన్ పెంచమని సంపాదకులపై ఒత్తిడి, కాపీ రచయితలు, పరిశోధనాత్మకమైన జర్నలిజం, ఆశ్రిత పక్షపాతం వల్ల అసమర్థుల చేరిక.. ఇలాంటి పరిస్థితులను వివరించాలను కునే నిబద్ధత గల సంపాదకులు – వీటన్నింటినీ చిత్రీకరించడం ద్వారా రచయిత నేటి పత్రికా రంగంలో చోటు చేసుకుంటున్న అవాంఛనీయ ధోరణులను పాఠకులకు తెలియజేయగలిగారు. ఇందులో సంపాదకుడైన భాస్కర్ వివాహ వైఫల్యం, అతని ఒంటరి జీవితం, అతని పట్ల ఆకర్షితురాలైన ఉప సంపాదకు రాలు జ్యోతి ప్రేమ చివరకు ఫలించి వివాహంతో ఈ 'ఎడిటర్' నవల సుఖాంతమవుతోంది.

ఒక విషయాన్ని సమస్యగా మార్చి, ఆ సమస్య పరిష్కారం కోసం చేసిన అన్వేషణ 'రెండు ప్రశ్నలు' నవలగా పరిణమిం చింది. ఆహార నిద్రా భయ మైథునాలు ప్రాణికి సహజ ధర్మాలు. ఎటచ్చి మనిషికున్న ఆలోచనాశక్తి మనిషిని, జంతువు నుంచి వేరుచేస్తున్నది. సామాజిక కట్టుబాట్ల వెలుగులు ఈ సహజ ధర్మాలను మనిషి తనను తానుగా నియత్రించుకున్నాడు. అలాగే చతుర్విధ పురుషార్థాల్లో కామం ఒకటిగా వర్గీకరించిన పూర్వులు 'కామిగాని వాడు మోక్షగామి గాడు' అని నిర్ధారించిన సంగతి మనకు తెలిసిందే.

అన్నం ప్రాణాధారం నిజమే అన్నం కోసం నానా అగచాట్లు పడ్డట్లే, అబద్దాలాడినట్లే, అష్టకష్టాలు భరించినట్లే 'దాని' కోసం కూడా ప్రతి మనిషి తాపత్రయపడతాడు. క్షుణ్ణంగా ఇదే భాస్కరం కథల్లో ఇతివృత్తం. ఈ కాలంలోనైనా, ఏ కాలంలోనైనా శృంగారానికి నీతులు, పరిమితులు విధిస్తూనే ఉన్నారు. ఈ నియమాల్ని త్రోసిరాజని హాయిగా బతికేస్తున్న వాళ్ళు ఎందరో వున్నారని భాస్కరం వాదన. సిద్ధాంతరీత్యా తన కాలనీలో ఉ త్తమ మేధావిగా, రచయితగా చెలామణి అవుతున్న భాస్కరం తన భార్యతో, పొరుగువాళ్ళతో, ఆఫీసులో తాను రాసిన బూతు కథల మీద చర్చ జరిపి, వాళ్ళ ప్రతిస్పందనలు తెలుసు కోవడానికి, వారిని ఇబ్బంది పెట్టడానికి కూడా వెనుదీయడు. శృంగార జీవితంలో పవిత్రమూ, రహస్యమూ ఏమీలేవు అని వాదించే భాస్కరం ఆలోచనలు, వెంపర్లాటను చూసి అతని భార్య, సెక్స్ మానియాక్ అని ఈసడించుకున్నా పట్టించుకోడు సరికదా.. చలంతో పోల్చుకుని సంతృప్తి పడతాడు. భాస్కరానికి ఫ్రాయిడ్ థియరీని పరీక్షించాలని, శృంగారం పట్ల మానవ మనస్తత్వాలను అధ్యయనం చేయాలని ఒకటే తపన. నిజానికి భాస్కరం ఆలోచనల వెనుక ఉన్నదేమిటి? భాస్కరం భార్య వేసిన 'రెండు ప్రశ్నలు' ద్వారా భాస్కరం కథావస్తువు కోసం ప్రయత్నా లు చేస్తున్నాడా? లేక తెలివిగా ఎదుటి వాళ్ళను లొంగదీసు కోవాలనుకుంటున్నాడా? అనే విషయాన్ని పాఠకుడే తేల్చు కోవాలి.

తెలుగులో విద్యా విధానం మీద వచ్చిన నవలలు చాలా తక్కువ. చందు సుబ్బారావు రాసిన 'ఇండియన్' నవల సెకండరీ విద్యా విధానం మీద వచ్చినప్పటికీ, ప్రతేక్యంగా ప్రైవేట్ స్కూలును నేపథ్యంగా తీసుకుని వివరించడం బాగా వచ్చింది. యూనివర్శిటీ జీవితం మీద నవీన్ 'అంపశయ్య', కేశవరెడ్డి 'సిటీ బ్యూటిఫుల్', సురేశ్ 'ది యూనివర్శిటీ' లాంటి నవలలు వచ్చాయి. వీటన్నింటికంటే మొదట ఆంధ్రా యూనివర్శిటీని నేపథ్యంగా తీసుకొని రాసిన నవల వినుకొండ నాగరాజు గారి 'ఎంత దూరం'. దాని తర్వాత ఆంధ్రా యూనివర్శిటీని నేపథ్యంగా కేంద్రంగా తీసుకుని చందు సుబ్బారావు 'అచంచలం', 'అగ్గిపుల్లలు', 'శాస్త్రీయం' అనే నవలలు రాయడం అభినందించదగ్గ విషయం. ఒక విద్యార్థిగా, హాస్టలర్‌గా, రీసెర్చి స్కాలర్‌గా తన అనుభావాలు, జ్ఞాపకాలను ఈ నవలల ద్వారా తెలియజేశారు. అదే విద్యార్థి లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా, డిపార్టు మెంట్ హెడ్‌గా ఎదిగిన క్రమాన్ని, వారి అనుభావాలను 'ఎరికా', 'హిమపుత్రి' నవలలు వివరిస్తాయి. ఈ నవలలన్నీ ఒకవిధంగా చందు సుబ్బారావు ఆత్మ కథాత్మాక నవలలే. అందుకే ఈ నవలలు అత్యంత సహజంగా తయారయ్యాయి. ప్రొఫెసర్‌గా తాను చేసిన విదేశీ ప్రయాణాలను ట్రావెలింగ్‌లో రాయకుండా, వాటికి నవలా రూపాన్ని కల్పించడం ద్వారా వాటిని మరింత ప్రయోజనకరంగా, ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. సర్క్యులేషన్ పెంచుకోవాలనే యావతో విలువలకు తిలోదకాలిచ్చి, చౌకబారు ధోరణులను పెంచి పోషించిన ప్రతికాధిపతులు, 'ఎడిటర్'ల బండారాన్ని బయటపెట్టారు. సెక్స్ చుట్టూ తిరిగే దాగుడుమూతలాటను 'రెండు ప్రశ్నలు' బయటపెడుతుంది. చలం సిద్ధాంతాలను మళ్ళీ పరీక్షకు పెట్టిన ఈ నవల మనల్ని ఆలోచింపచేస్తుంది. ఏ నవలను రాసినా వాటికి సరిపడా సరైన విషయాన్ని సేకరించి, విశ్లేషించి ఆ నవలలను అత్యంత సహజంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంలో చందు సుబ్బారావు చూపిన నేర్పు ప్రశంసనీయం. ■

# తిరుగు ప్రయాణం

- ఎస్.హనుమంతరావు
88978 15656

**భా**గ్య నగరం నించి
తిరుగు ప్రయాణం...
జుమ్మేరాత్ బజార్‌లో
ఏంటిక్స్ పేరుతో దొంగ సొమ్ము సేకరించలేదు
ఘనీభవించిన పబ్లిక్ గార్డెన్స్ పచ్చిక మీది
మంచుబిందువుల్లాంటి
మంచి ముత్యాలు కొనుగోలు చెయ్యలేదు
మొజాంజాహీ మార్కెట్ రాతి పందిరికి అల్లుకున్న
పరిమళపు తీగెకి పూచిన
అత్తరు సీసాల జాజిమల్లెల్ని తెచ్చుకోవడం లేదు
మందు సంగతేమో గాని మంత్రంలా అనిపించే
సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్‌ని
వెంట వుంచుకోలేదు
పెద్దల్ని పిల్లల్ని చేసే చాక్‌లెట్ టీని కొనలేదు
కరాచీ బిస్కట్లు, పుల్లారెడ్డి స్వీట్లు, దమ్ బిర్యానీ
...
ఫ్చ్!... వాటిపై ధ్యాసే పోలేదు



పిల్లల కోసం ఎగ్జిబిషన్‌లో
అంగార గ్రహపు మబ్బు లాంటి పీచు మిఠాయిని
తీసుకోలేదు
సెక్యులరిస్టునే గాని 'రామ్ ప్యారీ' పాన్ ఇష్టం'
దాన్ని కట్టించుకోలేదు...
తేనెటీగ తోట తోట తిరిగి
పూ తేనియని సేకరించినట్టు
పుస్తకాల సూపర్ మార్కెట్ ఆదివారం అబిడ్స్
ఫుట్‌పాత్ వరుసల్ని
చిక్కడపల్లి సుధా హెూటల్ పరిసరాల్ని
టెలిఫోన్ భవన్ బస్టాపుల్ని గాలించి గాలించి
కవితా సంపుటుల్ని కొనుక్కున్నాను
నా బ్యాక్ ప్యాక్‌లో సర్దుకున్నాను
ఇదే నా లగేజి
లెస్ లగేజి మోర్ కంఫర్ట్ అనుకుంటున్నారేమో
ఇది ఎంత తేలికో అంత బరువు
బతుకంత బరువు
గోదావరిలో బెర్త్ కన్ఫర్మ్
కాని కవిత్వముంటే ఇక నిద్రెలా పడుతుంది? ■



# రావిశాస్త్రి డైరీలో వ్యావహారిక పదాలు

- గార సీత

ఏ నేలనైనా తవ్వి బెడ్డల్ని పెకలించడం ప్రారంభిస్తే.. ఆ మట్టి పరిమళాలు ముక్కు పుటాలకు తాకుతుంటాయి. అవి ఆ నేల అస్తిత్వ గుబాళింపులన్నమాట. ఇంకా లోతుకు పోయేకొద్దీ ఆ నేల స్వాభావికత బైట పడుతుంది. అలాగే ఒక వ్యక్తి రచించిన సాహిత్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించగలిగితే అతని ఆత్మీయత, అస్తిత్వాలను వెదికి పట్టుకోవచ్చు. అతడి ప్రాంతపు మాండలిక పదాలను ఇట్టే పట్టేయవచ్చు. అతడు జీవించిన కాలంలో, అతడి ప్రాంతంలో, ఆ ప్రాంతీయులు వాడుతున్న పదాలు ఎలా అయినా అతడి రచనల్లో చొచ్చుకు పోతాయి. అలాంటివారికి దినచర్య రాసుకొనే అలవాటు ఉంటే, ఆయా మాండలిక పదాలు ఆ డైరీలలో మరింత స్వభావసిద్ధంగా దర్శనమిస్తాయి. అదే వ్యక్తి కవిగా, రచయితగా స్థిరపడక ముందు, తన విద్యాభ్యాసపు రోజుల్లోనే రాసి ఉంటే, అలాంటి దినచర్యలను విశ్లేషిస్తే, ఏ కాలుష్యమూ అంటని ఆయా ప్రాంతీయ సహజమైన పదాలు పచ్చి వాసనను వెద జల్లుతూ కళ్ళ పడతాయి. అదే ఉద్దేశంతో రాచకొండ విశ్వనాథశాస్త్రి దినచర్యలోని ఉత్తరాంధ్ర పదాలను, కొండొకచో ఆయన తన బ్రాహ్మణ భాషలో వాడిన పదాలను ఉత్తరాంధ్రలోని సామాన్యులు ఎలా వాడుతారో ఆయా వాడుక వివరాలను పరిశీలిద్దాము.

మనసు ఫౌండేషన్ వారు రావిశాస్త్రి మీద 'రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనా సాగరం' ముద్రించారు. మధ్య మధ్యలో కొంత అలభ్యమైనా 05 సెప్టెంబర్ 1935 నుంచి 09 జూలై 1941 వరకు ఆరేళ్ళ దినచర్యను ఆ గ్రంథం ప్రారంభంలోనే ముద్రించారు. రావిశాస్త్రి విశాఖలోని ఏ.వి.ఎన్ కళాశాల, ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలల్లో బిఏ వరకు చదువుకొన్న రోజులవి. అతని తల్లి తరపు వారిది ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం కాగా, తండ్రి తరపు వారిది అనకాపల్లికి చెందిన తుమ్మపాల. ఆయన చదువు, పెరుగుదల విశాఖపట్నం. ఆ ప్రాంతానికి చెందిన రావిశాస్త్రి దినచర్యలోని ఉత్తరాంధ్ర మాండలిక పదాలను వెలికి తీసి విశ్లేషించి పెట్టగలిగితే అటు రావిశాస్త్రికి నివాళిగా ఉంటుంది. ఇటు భావి పరిశోధకులకు కొంత సహాయంగానూ ఉంటుంది. స్వతహాగా సాహిత్య కృషీవలుడనైనప్పటికీ సాహిత్య చరిత్ర, భాషాచరిత్ర అనగానే అసంకల్పితంగా అటుకొంత ఒరుగుతుంటాను. ఇది కూడా ఈ విషయాన్ని ఎంచుకోడానికి మరో కారణం.

రావిశాస్త్రి డైరీలో అత్యంతమూ నన్నాకర్షించిన రెండు పదాలు 'తాట్రాజు, చయనులు'. ఉత్తరాంధ్రలోనే అరుదుగా కనిపిస్తుంటాయి. చయనయాగం చేసినవాడు చయనులు అని బేతవోలు రామబ్రహ్మం చెప్పారు. సోమయాగం చేసినవాడు సోమయాజి అన్నట్టు. 'క్రికెట్‌లో చయన్లుకి ఒక మోస్తరు దెబ్బ తగిలింది'. (50) తాటి చెట్టును దేవుడిగా భావించి పెట్టుకొనే పేరు తాట్రాజు అని జనశ్రుతి. అలాగే మా గ్రామాల్లో థాట్రాజు అని పగటి వేషం వేసేవారు. ఒక బలశాలి తాగిన మత్తులో ఉంటే అతడిని బంధించి పోలీసులు పట్టుకెళుతున్నట్టు కొందరి చేత వేషాలు వేయిస్తారు. గతంలో ఎవడో తాటికల్లు తాగడం అలవాటు గల వ్యక్తి బ్రిటిషువారి మీద పితూరీ చేస్తే బంధించిన దృశ్యమది. మొత్తం మీద తాటికల్లు సంబంధం గల గిరిజన వీరుడే తాట్రాజు, థాట్రాజు అని చెప్పవచ్చు. 'తాట్రాజు కలరా వచ్చి చచ్చిపోయేడుట'. (42 పుట)

ఉత్తరాంధ్రకే ప్రత్యేకమైన కొన్ని పదాలను ఈ

దినచర్యలో పరిశీలిద్దాం.

1. బక్కిరీశాడు : గోళ్ళతో రక్తం కారేటట్టు గీరేయడాన్ని బక్కరడం అంటాం. 'సింహానికీ నాకూ దెబ్బలాటొచ్చింది. ఓళ్ళంతా బక్కిరీసేడు. (16పుట)

2. మసాబు : మసాబు అన్నా మసుబు అన్నా మబ్బు. మబ్బేసి ఏక్షణమైనా చినుకులు రాలవచ్చునన్న అభిప్రాయం కలిగించే స్థితిని మసాబు అంటారు. 'ఇంకా మసాబుగా ఉంది' (49పుట)

3. దూడూ ఆట : కబడ్డీ ఆట. 'దూడూ ఆడడం, చింతచెట్లెక్కడం' (57పుట)

4.చచ్చుడి పేట, చచ్చుడివాడు : పాయఖానాలు శుభ్రం చేసేవారు. సాధారణ ప్రజానీకం వారిని చచ్చరోళ్ళు అంటారు. చచ్చురి, గాసీ, పాకీవారు. 'చచ్చుడి పేటలో ఎవడో తాగేసి అల్లరి చేస్తూ ఉంటే అందరూ పట్టుకున్నారు'. (18పుట)

5. తీరా మోసి : పనంతా ఒకవిధంగా పూర్తి చేసి ఒకసారి వెనక్కి చూసుకుంటే ఫలితం వేరేలా వచ్చినప్పుడు ఈ 'తీరామోసి'ని వాడుతారు. 'బుల్లిపాపని చెవులు కుట్టిస్తానని తీసికెళ్ళింది. తీరామోసి అక్కడకెళ్ళేసరికి ఇప్పుడు ఎవడు కుట్టిస్తాడు. అనీసింది' (14పుట)

6.దొబ్బీసేం : వెళిపోయాం. ఎగదొబ్బీశాం = ఎగ్గొటీశాం అని కూడా అంటారు. అది క్లాసు కావచ్చు, డబ్బు కావచ్చు. 'మధ్యాహ్నం సేన్స్క్రీట్ క్లాసు, నేనూ పెండలీ, శివుడూ, దూర్వాసుల వాడూ కలసి దొబ్బీసేం. (17పుట)

7.నాను : స్త్రీ మెడ చుట్టూ రెండు సెంటీమీటర్ల వెడల్పుతో ఉత్త బంగారు తీగతో చేసిన నగ. దానికి మెడ కిందన ఒక బిళ్ళ ఉంటుంది. దానిని 'నాను మోరు' అంటారు. 'అక్కడ ఎవళదో నాను పది తులాలది ఎవళో దొంగిలించేరు.' (33పుట)

8. బరి : బడి, పాఠశాల. బడిలో అనడానికి బదులు ఉచ్ఛారణ సౌలభ్యం కోసం 'బర్లో' అని అంటారు. 'ఇవాళ బరికి వెళ్ళాను'. (16పుట)

9.గరువు : మెరకపొలం, గుడ్డి. వేరుశనగ గుడ్డి అని వాడుతారు. గరప నేలలు అందరికీ పరిచయమే! 'మేష్టరు గరువు పంచీసుకున్నాం'. (36 పుట)

విశాఖను ఆనుకొనే ఉన్న సింహాచలం దేవుడైన సింహాద్రి అప్పన్న పేర్లు ఈ ప్రాంతంలో అధికంగా నేటికీ వినిపిస్తుంటాయి. 'సింహానికీమధ్య పెంకితనం మహా లావయింది' (34 పుట), 'నేను అప్పలస్వామీ సైకిల్స్ మీద వెళ్ళేం'. (41). 'సుబ్బారావు వస్తాడని అప్పలకొండ స్టేషన్‌కి వెళ్ళాడు కాని వాడు రాలేదు. (35 పుట), 'అప్పయ్య చిన్న కొడుకుకి అప్పిలునిచ్చి ఇవాళ పెళ్ళి చేసేరు'. (57పుట). ఈ వాక్యాల్లో ఆ దేవుడికి సంబంధించిన సింహం, అప్పలస్వామి, అప్పలకొండ, అప్పయ్య, అప్పిలు అనే పేర్లను గమనించవచ్చు.

**గ్రామదేవతల పేర్లు కొన్ని :** ఎల్లమ్మ, గ్రామపు ఎల్లలో రక్షణగా ఉండే అమ్మ ఎల్లమ్మ. ఎల్లమ్మ జాతర– 'రేపు ఎల్లమ్మ జాతర', 'అందుచేత ఇవాళ రాత్రి ఎల్లమ్మ తోటలో భాగోతం ఉందని అప్పలస్వామి అన్నాడు. (69 పుట). నూకాలమ్మ– 'నూకాలమ్మ గుడిలోకి వెళ్ళాం' (33). అనకాపల్లిలో ప్రఖ్యాతమైన అమ్మవారు నూకాలమ్మ. అంకమ్మ (21పుట) మరో గ్రామ దేవత.

రావిశాస్త్రి వెలనాటి బ్రాహ్మణుడు. మధ్య తరగతికి చెందినవాడు. వారి ఇళ్ళల్లో వాడుకొనే పదాలు చాలవరకు ప్రత్యేకమైనవి, ఇతర ప్రాంతాల్లో లేనివీను.

**1. గూభ్యం :** గాలీ వెలుతురు తగలని గుహలాంటి గది. 'అది గూభ్యం లాగుంది. ఒక అరగంట కాని అలాగ అందులో ఉన్నామంటే ఊపిరాడక ఏదో తప్పకుండా అయిపోతుంది.' (33పుట)

**2. టైరు పోయడం :** పొగడడం. టైరు కొట్టాడు అనేది సామాన్యంగా ఈ ప్రాంతపు వాడుక. 'బేటామెన్ కనపడి తైరుకొట్టి నా దగ్గర నుండి బేడ పట్టుకు పోయాడు'. (58పుట)

**3. చెత్కారీ :** చెత్త. 'కానీ ఏదో చెత్కారీ హిందీ ఫిల్ము ఉండడం చేత వెళ్ళలేదు' (33 పుట)

4. సోదెమ్మత్త : సోమయాజి భార్య సోమిదమ్మ. సోమిదమ్మ పేరుగల అత్త సోదెమ్మత్త. 'శివుడి ఉత్తరం సోదెమ్మత్త ఇవాళ పడీసిందట'. (34 పుట)

**5. డబ్బా కట్టడం :** వెధవాయిని చేయడం. (63 పుట)

**6. డబ్బా కొట్టు :** తెలుసుకోదగ్గ విషయం లేనిది, డబడబా వాగుట. 'చిట్టి బాబొచ్చేడు. డబ్బా రాసేడు.' (24 పుట)

**7. పమ్మించింది :** పంపించింది. 'బాబ్జీకి పమ్మించడానికి మైసూర్ పాక్, జంతికలు చేసింది.' (22 పుట)

**8. ఊష్ణం :** ఉష్ణం – జ్వరం. 'సాయంత్రం నాకు ఊష్ణం వచ్చింది' (16 పుట) సాదా జనం అంతా ఉత్తరాంధ్రలో 'ఊష్టం' అనే అంటారు.

**9. చించు బుడ్లు :** 'ఓ చించు బుడ్డీ పాప బద్దలు కొట్టీసేడు'. (17 పుట) చిచ్చు వెదజల్లే బుడ్డీ. సాదా జనం 'సుంచీ బుడ్డీ 'అంటారు ఈ నేలలో.

**10.కందా కొట్టీయడం :** పీకలనిండా తినడం.' గురునాధం రాత్రి ఇక్కడే కందా కొట్టీసేడు'. (21 పుట)

ఉత్తరాంధ్రలో బ్రాహ్మణులతో పాటు అందరూ వాడుకొనే

## సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2022 పురస్కారాలు

**చిన్న తోక - పెద్ద లోపం**
**కవితకు రూ.500**
**కవి : చందలూరి నారాయణ రావు**

**జంఝూటం**
**కథకు రూ.500**
**రచయిత: శ్రీను కుడుపూడి**

■■■

***కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం***

***కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

***- ఎడిటర్***

పదాలు. 1.తాటేక్కాయల కట్టలు' – తాటిరేకు మడిచి కట్టిన కాయల కట్టలు. దీపావళి టపాకాయలు. (16పుట) 2. కాలిరుకట్టింది : కాలు ఇరుకు పట్టింది. బెణికింది అనే అర్థంలో. (14 పుట) 3. కోతి పిల్లని కఱ్ఱ : కోతి కొమ్మచ్చి. (20 పుట) 4. జెల్ల కొట్టడం : లెంపకాయ కొట్టడం, మోసగించడం. 'పాపగాడు వాణ్ణి జెల్ల కొడుతున్నాడు'. (22 పుట) 5. ఉడుకు బోత్తనం : ఎదుటివారు చేసే హేళనను భరించలేక పోవడం. 'పట్టాభికి వాళ్ళకి ఉడుకుబోత్తనంగా ఉంది'. (16 పుట)

తెలుగు నేలలో చాలా ప్రాంతాల్లో వాడే సాదా పదాలు. 1. కుచ్చి టప్పాలు : కాలక్షేపం మాటలు.(60 పుట)

2.అప్ప : అక్క (14 పుట) 3. భాగోతం : వీధిభాగవతాన్ని భాగోతంగా తెలుగునేలలో చాలా చోట్ల పలుకుతారు. భాగవతుల్ని భాగోతులు అంటారు. కోమటిపల్లి భాగోతం, బొద్దూరు భాగోతం అని ఆయా గ్రామాల బృందాలను బట్టి వ్యవహరిస్తారు. వీరు భామాకలాపాన్ని భాగోతంగా ప్రదర్శిస్తారు. (71 పుట) 4. జతకట్టడం : ఆవులు, గేదెలు మగవాటితో చేసే సంపర్కాన్ని జతకట్టడం అంటారు. మైధునం అన్నమాట. ఇతర ప్రాంతాల్లో ఎదకు రావడం అంటారు. 'అప్పయ్య ఆవు జత కట్టింది'. (65 పుట) 5. ఉరుస్తూంది : ఇల్లు కారిపోవడం. 'పాకంతా అక్కడక్కడా కాకుండా ఇల్లంతా ఉరుస్తూంది'. (49 పుట) 6. పాక : (47పుట) ఒంటి పెడకగాని, రెండు పెడకలుగాని కలిగి, గడ్డి లేదా తాటికమ్మలతో నేసిన చిన్నఇల్లు. 7. కులాసా : (44 పుట) కుశలం. 8. దొడ్డమ్మ : పెద్దమ్మ, దొడ్డ అని కూడ పిలుస్తారు. 'దంతం పెట్టె దొడ్డమ్మకి పట్టికెళ్ళి ఇచ్చేసేను'. (28 పుట) 9. పీనారి : పిసినారి. పీనాసి, పిసినాసి అని కూడ అంటారు. (60 పుట) 10. లావు : ఎక్కువ అనే అర్థంలో శాస్త్రి వాడారు. 'ఎండలు లావుగా ఉన్నాయి' (13 పుట) ఇతర ప్రాంతాలవారు లావుగా అనే మాటను మనుషుల, చెట్ల పరిమాణాన్ని చెప్పడానికే వాడుతారు. అలాంటి అర్థంలో ఉత్తరాంధ్రలో 'వలంగా' అని వాడుతారు. 11.లోలక్కులు : చెవికి వేలాడే ఆభరణాలు. (53 పుట) 12. వాటం : వ్యహరించే తీరు. ఇతర ప్రాంతాల్లో వాటమైనవాడు, చక్కనివాడు. ఉత్తరాంధ్రలో కూడ మంచివాటంగా ఉన్నాడు అంటే సౌష్టవంగా ఉన్నాడు అని. 'ఇతని వాటం ఒక మాదిరి'. (59 పుట) 13. గుంటడు (పుట 32 పుట) : ఉత్తరాంధ్ర పల్లెల్లో సామాన్యులు నేటికీ వాడుతున్న పదం. యౌవనం ఇంకా దరిచేరని చిన్నవాళ్ళను తిట్టేటప్పుడు గుంటడు, గుంట అని తిడతారు. ఓరె సెడుగొట్ల గుంటడా!.. ఇలా వాడుతారు. 14. హిందూస్థానీ పదం మాదర్చోద్ అంటే తల్లితో రమించేవాడా అనే తీవ్రమైన తిట్టు. 'చిన్ని సురేంద్రనాథ్‌తో అప్పలస్వామి మాదర్చోదని చెప్పేడుట'. (70 పుట) 15. అలాంటిదే బంచోత్. 16. జాగా అంటే స్థలం ఉర్దూ పదం.

ఈ విధంగా ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కథా, నవలా రచయిత రా.వి శాస్త్రి దినచర్యను తవ్వినకొద్దీ ఎన్నో ఆ ప్రాంత వాడుక పదాలు బైటపడుతూనే ఉంటాయి. ఈ దినచర్య ఆధారంగా 80 ఏళ్ళ కిందటి (ప్రభుత్వ) కళాశాల చదువులు, విద్యార్థుల ఆలోచన స్థాయి, నాటి సమాజం, సమాజాన్ని వారు అంచనా వేసే విధానం, నాటి స్వాతంత్ర్యోద్యమంలో వారి పాత్ర, బ్రాహ్మణుల్లోని మధ్య తరగతి ఉమ్మడి కుటుంబ జీవనం, రావి శాస్త్రి రచయితగా ఎలా రూపుదిద్దుకున్నారో ఆ తీరు వగైరా ఎన్నో విషయాలను అంచనా వేయవచ్చు. ■



# ఎరుక

- గార రంగనాథం
98857 58123

**వి**జయనగరంలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ దిగి స్టేషన్ బైటకి వచ్చి గబగబా రిక్షాఎక్కి , బస్టాండ్‌కి చేరుకున్నాను. మా అప్పారావు చెప్పినట్టే మా ఊరికి ఫస్టు బస్సు సిద్ధంగా ఉంది. రాత్రంతా ట్రైను ప్రయాణం కావడంతో బస్సులో విశ్రాంతి తీసుకుంటూ వెనక్కి జారబడ్డాను. నలభై ఏళ్ళ కిందట మా ఊరు వదిలేశాను. మొదట్లో ఒకటి రెండుసార్లు వచ్చినా ఇటీవల చాలా ఏళ్ళుగా రావడం పడలేదు. ఇన్నాళ్ళ తరువాత చూడ గలుగుతున్నానన్న ఉత్కంఠ, ఆనందంతో కళ్ళు మూసుకొని ఆలోచిస్తున్నాను.

నా చిన్నప్పుడు ఐదెకరాల భూమితో అమ్మానాన్నా నేనూ పాడి పంటలతో నలుగురిని ఆదరించే స్థితిలో ఉండే వాళ్ళమని మా ఇరుగు పొరుగుల వాళ్ళు చెబుతుండేవారు. అనారోగ్యాల వల్ల, పంటలు సరిగా పండకపోవడం వల్ల నాకు జ్ఞానం వచ్చేనాటికి మా ఆర్థిక పరిస్థితి దిగజారింది. నా చదువులకు, ఇతర ఖర్చులకు మా భూమి చాలా వరకు అమ్ముకోవలసి వచ్చింది. చదువుకు ఇప్పటిలా ప్రభుత్వ సహాయాలు ఆనాడు లేవు. పాతికేళ్ళు నిండకముందే నాకు హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో పెళ్ళి చేసుకొని మాతల్లిదండ్రులతో పాటు హైదరాబాద్ చేరిపోయాను. ఆ తరువాత మాకున్న కొద్దిపాటి భూమిని, ఇంటిని నాకిష్టమైన మిత్రుడు, దగ్గరి బంధువు అయిన అప్పారావుకు అప్పగించాం. ఇన్నాళ్ళుగా వాటిని వాడే చూస్తున్నాడు.

కొన్నాళ్ళకి మా అమ్మా నాన్న చనిపోయారు. మా పిల్లలకి మా ఊరిలో కొంత ఆస్తి ఉందని తెలుసు గాని అది ఎక్కడుందో, ఎలా ఉందో తెలియదు. నాకు కూడా ఇన్నాళ్ళూ దానిని చూసుకోవాల్సిన అవసరం కాని, అవకాశం కాని రాలేదు. ఐతే నా భార్య, పిల్లలు ఆ మిగులు ఆస్తిని అమ్మేయండి అని అప్పుడప్పుడు నా చెవిలో రొదపెడుతున్నారు. మా అప్పారావుకు అది కొంత ఆసరాగా ఉందని ఇన్నాళ్ళూ తాత్సారం చేస్తూ వచ్చాను. తప్పనిసరి పరిస్థితిలో ఆ పొలాన్ని అమ్మకానికి పెట్టమని అప్పారావుకు ఫోన్ చేసి చెప్పాను. వాడూ ఉదారుడే. నా పొలం తన జీవితానికి కొంతవరకు ఆసరా అయిందని, ఇద్దరు పిల్లల్ని చదివించి, ఉద్యోగాలు చేయించి, పెళ్ళిళ్ళు చెయ్యగలిగానని అన్నాడు. పిల్లలు గ్రామానికి చుట్టుపక్కలే ఉపాధ్యాయులుగా పని చేస్తుండడం వల్ల జీవితం సాఫీగా సాగిపోతోందని, తన భూమి కూడా తాను చెయ్యలేక పోతున్నానని, అమ్మాలనుకుంటే భూమికొనే వాళ్ళను చూస్తానని అన్నాడు. అమ్మేయడమే మంచిదని సూచించాడు..

నిజమే! నా చిన్నప్పుడు భూముల్ని రైతులు కౌలుకి తీసుకొనేవారు. ఆ పద్ధతిలో భూస్వామి, రైతు చెరిసగం మదుపు పెట్టుకోవడం, కౌలురైతు శ్రమచెయ్యడం, భూస్వామికి చెందిన కళ్ళంలోనే పంట నూర్చి చెరి సగం పంచుకోవడం జరిగేది. పాలుకివ్వడం అనేవారు. ఎరువులు, పురుగు మందులు అక్కరలేని రోజులవి. మదుపు తక్కువ ఉండేది. ఆ తరువాత అప్పనం పద్ధతి వచ్చింది. పండితే ఇంతిస్తామనే ఒప్పందం మీద పొలాన్ని తీసుకొని పంట వచ్చింతరువాత డబ్బు రూపంలోనో, పంట రూపంలోనో రైతు భూస్వామికి ఇచ్చేవాడు. మరి కొన్నాళ్లకు ముందప్పనం వచ్చింది. పొలానికి కొంత సొమ్ము ముందే ఇచ్చి రైతు పండించుకోవడం ఆ పద్ధతి. రాను రానూ కౌలురైతులు ఎగబడి అప్పనాలు ఇచ్చి సాగు చేసిన రోజులు పోయాయి. పురుగు మందులు, ఎరువుల ఖర్చు పెరిగి పోవడం, భూమి సారం కోల్పోవడం, కరువు, వరదల వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అందుచేతనే ఎవరూ ముందుకు రాక భూస్వామే రైతుల్ని బతిమాలుకొని భూమిని

అప్పగించాల్సి వస్తుందని అప్పారావు గతంలో ఒకటి రెండుసార్లు చెప్పాడు. ఎలాగూ వాడు భూమిమీద ఆసక్తి చూపించక పోవడంతో భూమి, ఇల్లు అమ్మీమని చెప్పాను. ఇల్లు వాడే ఎంతోకొంత ఇచ్చి తీసుకుంటానన్నాడు. భూమికి బేరం కుదిర్చి రిజిస్ట్రేషన్‌కి రమ్మని ఫోన్ చేస్తే ఇలా బయలుదేరాను.

అలా ఆలోచనలతో కునుకు పాట్లు పడుతూనే ఉన్నాను. బస్సెప్పుడు బయలు దేరిందో, ఎప్పుడు మా ఊరు చేరిందో గాని కండక్టర్ లేవండి.. మీ ఊరొచ్చిందని చెప్పగానే గతుక్కుమని లేచాను. కిందికి దిగుతుండగానే మా అప్పారావు 'ఏరా! బాగున్నావా?' అంటూ చేతిలోని బేగ్ అందుకున్నాడు. కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఇంటివైపు నడుస్తున్నాం.

వీధిలో ఎవరెవరో మావాడిని నన్ను గురించి అడుగుతున్నారు. నేను తెలిసినవారు, తెలియనివారు కూడా పలకరిస్తున్నారు. కొత్త వ్యక్తులనైనా తెలిసినట్టు పలకరించడం మా ప్రాంతం గొప్పతనం. నేను మావాడి వెంట నడుస్తున్నానే గాని మారిన ఊరిని పరిశీలిస్తూనే ఉన్నాను. గోర్జి సిమెంటు రోడ్డయింది. చిన్నప్పుడు ఆ గోర్జిలో వర్షం పడితే వాన నీటికి గట్లు కట్టి, ఆ నీటిలో కాగితం పడవలు వదలడం ఇంకా గుర్తుంది. పూరిళ్ళన్నీ డాబా ఇళ్ళయ్యాయి. ఎక్కడో ఒకటో రెండో పెంకుటిళ్లు, పురిళ్ళు అలాగే ఉండి పోయాయి.

ఇలా నడుస్తుండగా రెండు డాబా ఇళ్ళమధ్య ఓ దిబ్బను చూసి గతుక్కుమని ఆగి పోయాను. మావాడు వెనక్కి చూచి 'ఏంటలా నిలబడి పోయావు? రారా.. ఎండెక్కి పోయింది.ఇంటికి పోతే కాస్తా కుదుట పడొచ్చు' అని తొందర చేశాడు. ఆ మాటకు తేరుకొని వాడి వెంట ఇంటికి చేరాను. ఇంతకీ విశేషమేంటంటే ..

ఆ దిబ్బ ఉన్న చోట ఓ పురిల్లు ఉండేది. అందులో అసిరమ్మ అనే వ్యవసాయ కూలీ ఉండేది. ఆమెను తలచుకోగానే నుదుటున ఇచ్చు రూపాయంత కుంకుంబొట్టు ముందుగా గుర్తొస్తుంది ఈనాటికీ. తలకి స్నానం చేసుకొని చెరువునుండి వచ్చేలోగానే జుత్తు ఆరబెట్టుకొనేది. బొత్తంచు నేత చీరకట్టుకొని కుడి వైపు మెట్ట పెట్టుకునేది. ఎత్తుగా, సౌష్టవంగా ఉండేది. స్నానానికి ముందర రాసుకున్న పసుపు ఇంకా ముఖంపై మిగిలే ఉండి, నుదిటి మధ్య గుండ్రని బొట్టుతో చూస్తుంటే అమ్మోరు విగ్రహంలా ఉండేది. ఆమెకు వృద్ధాప్యం నీడలా ఆవరిస్తుండడం వల్లనేమో నాకు కాస్తా నల్లగా కనిపించేది. ఇంత ముస్తాబూ శనివారం నాడే. మిగిలిన ఆరురోజులూ చింకి పాతా, చింపిరి జుత్తే ఆమె వాలకం. ఆ పురిల్లు, శరీర కష్టం తప్ప వేరే ఆస్తులు లేని నిరుపేద.

ప్రతి శనివారం రాత్రి చీకటి పడిన కాసేపటికి ఆమె ఇంట్లోనుండి కూని రాగాలు మొదలయ్యేవి. శోకాలు లాటి అరుపులు వినిపించేవి. ఆ దగ్గిరలోనే మా ఇల్లు కావడం వల్ల 'ఏంటవి?' అనే ఉత్కంఠ నాలో కలిగేది. పదేళ్ళ వయసులో అది సహజమే కదా! అలా రాగాలు వినగానే ఒకరోజు ఇంట్లోంచి మెల్లగా జారుకొని నిక్కరు ఎగలాక్కుంటూ ముంజూరులోకి దూరి గడపదాటి అయినింటిలో అడుగు పెట్టాను. మాంత్రికుడి గుహలోకి ప్రవేశించినట్టయింది. మాతో సమానమైన ఆర్థిక స్థాయి కాకపోవడంవల్ల కావచ్చు అతి దగ్గరే అయినప్పటికీ ఎపుడూ ఆ ఇంట్లోకి వెళ్లాల్సిన అవసరం రాలేదు.

ఇల్లంతా అలికి ఉంది. మట్టిగోడలకు కూడ కిందనుండి పైకి కొంత ఎత్తువరకూ జేగురుతో అలికి, దానిపై సున్నంతో వేసిన ముగ్గులున్నాయి. ఇంట్లో సామాన్లు ఎక్కువగా లేకపోవడంవల్ల అన్ని వైపులా ఆ ముగ్గులు చక్కగా కనిపిస్తున్నాయి. ఒక మూలన కర్ర. బొరిగె, కొడవలి వంటి వ్యవసాయ పనిముట్లు నిలబెట్టి ఉన్నాయి. ఇంకోమూల కర్ర దండెం మీద అలుగ్గుడ్డల్లాంటి పాత బట్టలు వేలాడుతున్నాయి. అలా ఒకరకమైన వింత అనుభూతిని పొందుతూ పైకి చూశాను. తూర్పు, పడమర గోడల్ని కలుపుతూ అడ్డుగా ఓ తాటిదూలం ఉంది. దానిపైన నిలబెట్టిన రెండు కర్రలపై తాటివాసాలు. వెదురుకర్రలతో ఓ తాటాకు పంజరం ఉంది. అక్కడి పరిసరాలను స్పష్టాస్పష్టంగా చూపిస్తూ, అయినింటిలో కిరసనాయిలు బుడ్డీ వెలుగుతోంది. ముందు వరండా ఉన్నట్టే వెనుక వంటగది మసగ్గా కనిపిస్తోంది. తూర్పుగోడను ఆనుకొని ఒక చాప పరిచిఉంది. ఆ చాప మీద అసిరమ్మ జుత్తు విరబోసుకొని కూర్చొని ఉంది. కూనిరాగాలు తీస్తూ తల అటు ఇటు తిప్పుతూ, కిందికీ మీదికీ ఊపుతూ పతి వేస్తోంది. అలబొద్దు తిని ఆటకెల్లిన సింహాచలం ఇంకా ఇంటికి రాలేదు. అసిరమ్మకు వాడొకడే సంతానం. మొగుడు పోయినప్పటి నుండి అన్నీ తానే అయి వాడిని పెంచుతోంది.

నేను వెళ్ళిన కాసేపటికి ఒకావిడ ప్రవేశించింది. ఆవిడ పేరు నీలమ్మ. మధ్య వయసులో ఉన్న నిరుపేద. తెల్లని తాను వెనక్కుచ్చు గుండార కట్టింది. జుత్తు సిగచుట్టింది. చేత్తో అంటిపండు పట్టుకుంది. నోట్లోని అడ్డపొగ చుట్టను ఇంకొక చేత్తో బైటకు తీసి, నేలకు రాసి ఆర్పింది. రొంటిన దోపుకుంది.

మొలలో ఇంకోవైపున ఉన్న జాలి విప్పింది. అందులో ఉన్న చిల్లర డబ్బులనుండి ఒక పావలా తీసింది. జాలిని మళ్ళీ అక్కడే దోపుకుంది. అంటిపండు, పావలా అసిరమ్మ ముందరపెట్టి చేతులు జోడించి, భక్తితో 'అమ్మా! తల్లీ! పొద్దున్న సెప్పాను కదా! నా బాధ. అదెలా తీరుతాదో సెప్పు తల్లీ!' అని గొంతుకూర్చుంది. ఇవేవీ అసిరమ్మ విననట్టే తన పని తాను కానిస్తోంది. ఐతే పావలా బిళ్ళను మాత్రం కళ్ళతో ఫోటో తీసింది. వెంటనే చాపపై పడుకొని ఇటు అటూ దొర్లుతూ రాగాల మధ్య అస్పష్టమైన మాటల్ని వదలుతోంది. కాసేపటికి అసిరమ్మ ఇంతకు ముందరికంటే మరింత స్పష్టంగా కొన్ని మాటలు పలికింది. నీలమ్మ దండం పెడుతూనే ఆ మాటలు మంత్రాల్లా వింటూ, తన సంసారంలోని సమస్యకు ఏదో సమాధానం దొరికిందన్నట్టు తన్మయురాలై తలూపింది. ఇచ్చిన పావలాకి ఈపాటి శ్రమ చాలులే అనుకుందో ఏమో రాగాలు తగ్గించింది. మూలుగులతో లేచి కూర్చుంది. 'పతి' పూర్తయిందనుకొని నీలమ్మ అసిరమ్మకు దండం పెడుతూ కొంత సంతృప్తితో బైటకు నడిచింది. ఆవిడ వెళ్ళగానే పావలా కళ్ళకద్దుకొని 'ఎన్ని పావలాలు ఇలా కూడబెట్టాలో? రేపొడొస్తాడో? లేదో? ఆ ముండని వదలగొడతాడో లేదో? మమ్మల్ని పీడించి పిప్పి చేస్తంది'. అని కొంచెం వినిపించినట్టే అసిరమ్మ గొణుక్కుంది. అక్కడే నేనున్నా నా వయసుకి అది అర్థం కాదని ఆమె ధీమా. ఇంతట్లో మా ఇంటి నుండి కేక వినిపించేసరికి తుర్రున పారిపోయాను. అసిరమ్మకు పెళ్ళై ఈ వూరొచ్చిన కొత్తలో పరాయి మగాడి దృష్టి తన మీద పడగూడదని ఈ పతి వెయ్యడం ప్రారంభించిందని ఊర్లో పెద్దలు అనుకోవడం విన్నాను. వాస్తవం ఏదైనా దీనివల్ల తనలాంటి వాళ్ళ మధ్య కొంత గౌరవాన్ని పొందింది. రూపాయో రెండో సంపాదించడం ప్రారంభించింది.

మరునాడు ఆదివారం. మిట్టమధ్యాహ్నం. అదే ఇంట్లో గడప మీద ఆడవాళ్ల మాటలు వినిపిస్తున్నాయి. అదేంటోనని నేనూ వెళ్ళాను. అక్కడ అసిరమ్మతో పాటు నలుగురైదుగురు అమ్మలక్కలు నిలబడి ఉన్నారు. నేలమీద పసుపు, కుంకుమ, బొగ్గులు, నల్ల కోడిపెట్ట, ఒక కోడిగుడ్డు, మరికొన్ని సామానులు సర్ది ఉన్నాయి. సింహాచలాన్ని ఇద్దరు ఆడవాళ్ళు పట్టుకున్నారు. అతనికి ఎదురుగా ఒక మధ్య వయస్కుడు నిలబడి ఉన్నాడు. వాడి పేరు సిద్ధాంతి అని పక్క ఊరులోనే ఉంటాడని, అక్కడి అమ్మలక్కలు చెప్పుకుంటున్నారు. భుజాలకు తగులుతున్న గిరజాల జుత్తుతో నుదుటున నిలువునా పెద్ద కుంకుమ బొట్టు, మెడలో పూసలదండలు ధరించాడు. కాషాయం పంచె చిలకట్టు కట్టి, పైన పసుపులాల్చీ తొడుక్కున్నాడు. కళ్ళు ఎర్రగా, మందేసినట్టున్నాడు. సన్నగా ఉండి, పెద్ద పెద్ద అరుపులు అరుస్తున్నాడు, వీటికి భయపడ్డాడో ఏంటోగాని, సింహాచలం గజగజ వణుకుతూ, చొంగలు కారుస్తూ ఊగిపోతున్నాడు. ఆడవాళ్ళు వాడిని ఆపలేక పోతున్నారు. దారిన పోయే ఒకరిద్దరు మగాళ్ళను సిద్ధాంతి పిలిచాడు. వాడిని గట్టిగా పట్టుకోమన్నాడు. తన కాళ్ళకున్న రెండుచెప్పులూ తీసి వారికిచ్చి ఈ లెంప ఆ లెంప వాయించమన్నాడు. వాళ్ళు గట్టిగా పట్టుకొని వాయిస్తున్నారు. ధూపం దట్టంగా వెయ్యమన్నాడు. ఏవో మంత్రాలు చదువుతూ, రెండు చేతుల్తో వేపకొమ్మల్ని ఊపుతూ, సింహాచలం ముఖంపై కొడుతూ బీభత్సం సృష్టిస్తున్నాడు. కాసేపటికి ఆ చెప్పుదెబ్బల బాధ వలనో, శరీరంలో కలిగిన మార్పువలనో 'నన్నొదిలియ్యండ్రో ' అని వాడు అరవడం మొదలు పెట్టాడు.

సిద్ధాంతి సింహాచలం జుత్తు పట్టుకొని 'నంజా వదిలేస్తాను. మరెప్పుడూ రావు కదా?' అన్నాడు.

ఉఁ..ఉఁ..అంటూ స్పృహ కోల్పోయాడు సింహాచలం.

సిద్ధాంతి వాడిని పడుకోబెట్టమని చెప్పాడు. ఇద్దరు ఆడవాళ్ళు వాడిని పడుకోబెట్టి, విసనకర్రలతో విసురుతున్నారు.

'ఆ దెయ్యం ముండ ఈ ఛాయలకు కూడా రాదు. దాని పస తీశ్నాను'. అంటూ కోడిపెట్టతో పాటు తనకు పనికొచ్చిన సామాను సర్దుకొని, చంకన పెట్టుకొని, సిద్ధాంతి చెయ్యి చాపాడు. అసిరమ్మ రొంటినుండి సున్నబు గాయ తీసింది. దాంట్లోనుండి రెండు ఐదు రూపాయల బిళ్ళలు తీసి, తిరిగి సున్నబుగాయను గైనాన పెట్టుకుంది. 'నాయనా! ఆముండ మరిరాదు కదా!' అంటూ దండంపెట్టి, రూపాయలు అతని చేతిలో పెట్టింది. 'దెయ్యమా? దాన్ని అష్టదిగ్బంధనం చేశాను. ఇకనుండి నువ్వు గుండెల మీద చెయ్యేసుకొని హాయిగా పడుకోవచ్చు. మళ్ళీ వస్తే నన్ను పిలువు. దాని అంతు తేలుస్తాను' అని డబ్బులు తీసుకొని, జేబులో పెట్టుకొని సిద్ధాంతి ఉడాయించాడు. సింహాచలాన్ని ఇంట్లో పడుకోబెట్టి, అక్కడ చేరిన ఆడవాళ్ళు ఎవరింటికి వారు వెళ్లిపోయారు.

ఇలా దెయ్యం వదిలినట్టు సంతోషించిన కొద్ది రోజులకో, నెలకో మళ్ళీ వాడి మీద పడడం, నెత్తీ నోరూ కొట్టుకొని అసిరమ్మ మంత్రగాడి దగ్గరకి పరిగెత్తడం, సిద్ధాంతి వచ్చి సింహాచలం గుండె మీద కోడిగుడ్డు చిదగ్గొట్టడం, ద్వారబంధం పై కమ్మికి ఇరువైపులా మేకులు దిగ్గొట్టడం, వాడి జుత్తు

కత్తిరించి సీసాలో బంధించడం .. ఇలా ఏదో ఒక తంత్రవిద్య ప్రదర్శించి పదో పరకో, వందో ఏభైయ్యో డబ్బు పట్టుకు పోతున్నాడు. చదువుకున్న ఒకరిద్దరు అది మూర్ఛవ్యాధి అని చెప్పారు. ఆ విషయం అర్థమయ్యేంత జ్ఞానం ఆమెకు లేదు.

దిబ్బ నుండి తవ్వితీసిన విక్రమార్క సింహాసనం చెప్పిన కథల్లా ఉదయం ఆ దిబ్బ ను చూసినప్పటి నుండీ ఈ కథ నాలో మెదులుతూనే ఉంది. చిన్నతనంలో నేనూ, మా అప్పారావూ ఒక మంచం మీదే పడుకునేవాళ్ళం. ఆ అలవాటుతో ఆ రాత్రి మా ఇద్దరికీ వరండాలో పక్కపక్కనే రెండు మంచాలేశారు. పగటి పనులన్నీ సజావుగా అయిపోవడం చేత, చిన్ననాటి ముచ్చట్ల మధ్య అసిరమ్మ ఇంటి గురించి అడిగాను.

దానికి మావాడు ఇలా చెప్పాడు. 'సింహాచలాన్ని ఎలా అయినా ఆరోగ్యవంతుణ్ణి చెయ్యాలని అసిరమ్మకు తాపత్రయం పట్టుకుంది. దాని బలహీనత గుర్తించి సిద్ధాంతి గాడు దాన్దగ్గర డబ్బులు బాగా గుంజాడు. ఇంటి పనులు చూసుకుంటూ వీలైతే కూలికెళ్ళేది. వాడి ఆరోగ్యం బాగులేని రోజుల్లో ఇంటి పట్టునే ఉండి పోయేది. ఖర్చులెక్కువై రాబడి తగ్గిపోవడంతో ఊరిలో మోతుబరికి వెయ్యి రూపాయలు అప్పుపడింది అసిరమ్మ.

కొన్నాళ్ళకు ఎలా అయితేనేం సింహాచలం ఆరోగ్యం కుదుట పడింది. దెయ్యం పడ్డం లేదు. కనిపించినా ఇలా కనిపించి అలా మాయమౌతోంది. వాడికి ఊరిలో వరసైన పిల్లతో పరిచయం పెరిగింది. ఒకరినొకరు హాస్యాలాడుకోవడం కూడ అసిరమ్మ కంట పడింది. ఆమె తల్లిదండ్రులు వీరికంటే పేదలు. ఇద్దరూ ఇష్టపడుతున్నారు. అంతకంటే అవకాశం ఉన్న సంబంధం తాను తేలేనని అసిరమ్మ నిశ్చయించి వారింటికెళ్ళి పిల్లనిమ్మని అడిగింది. పిల్లనిస్తాంగానీ, అంతకంటే ఏమీ ఇవ్వవలేమని వారు తేల్చి చెప్పారు. తన కొడుకు అందరిలాగా ఆరోగ్యంగా తిరుగుతున్నాడన్న సంతోషంతో ఇరుగు పొరుగువాళ్ళ సలహా మేరకు పంతులు గారి దగ్గరికి వెళ్ళి ముహూర్తం పెట్టమంది. లగ్న పత్రిక చేతికిచ్చి, 'కోడలు సౌభాగ్యవతియై, 'వంశవృద్ధి జరుగుతుంద'ని ఆయన దీవించాడు.

ఊర్లో సంబంధం కావడం, వియ్యంకులు తన కంటే పేదవారు కావడంతో పెళ్ళి బాధ్యత తన మీదేసుకుంది. ఊరందరికీ భోజనాలు, బట్టలు, ఇతర ఖర్చులు అంచనా వెయ్యి రూపాయలు తేలింది. పాత అప్పువి వెయ్యి రూపాయిలకు తోడు, కొత్తగా వెయ్యి రూపాయలు అప్పు ఇమ్మని ఊరిలో మోతుబరిని అడిగింది. పాలేరుతనం చేసైనా వాడు, వాడి పెళ్ళాం తీర్చుకుంటారని అంది. అందాకా ఇల్లు హామీ రాసుకోమంది. ఎటెల్లి పోతుందిలే అనే ధైర్యంతో మరో వెయ్యి ఇచ్చాడతడు. ఊరందరికీ భోజనాలు, బాజా భజంత్రీలతో పెళ్ళి బాగా జరిపించిందనిపించుకొంది.

పెళ్ళయిన తెల్లారి కాస్తా పొద్దెక్కింది. పెళ్ళికూతురితో పాటు ఒకరిద్దరు బంధువులు తప్ప అందరూ ఎటు వాళ్ళు అటు వెళిపోయారు. అసిరమ్మ పెళ్ళికి జరిగిన ఖర్చు వెచ్చాలు సరిచూసుకుంటుంది. ఇంతట్లో పెద్ద చెరువు వైపునుండి పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి. అసిరమ్మ చెవి అటుపెట్టింది. 'ఓ లసిరమ్మా! సింహాచలం గాడు చెరువులో పడిపోనాడే!' అని వినిపించింది. ఒక్కసారిగా గుండాగి నట్టు అనిపించి అసిరమ్మ అటు పరిగెత్తడం ప్రారంభించింది. నలుగురైదుగురు మనుషులు తడి బట్టలతో నీరుకారుతున్న సింహాచలాన్ని మోసుకొచ్చి ఇంటిముందు పడుకో బెట్టారు. అసిరమ్మ కొడుకు మీద పడి 'నెగురా! నాయనా!' అంటూ ఇటు అటు కదిపి లేపుతోంది. 'ఆడు సచ్చిపోనాడే! నా కూతురు గొంతు కోసేసినాడే!' అంటూ వియ్యపురాలు కూతుర్ని పట్టుకొని రోదిస్తోంది. చచ్చిపోయాడన్న మాట వినగానే అసిరమ్మ కిందపడి బోరుబోరున విలపించడం అక్కడున్నవారందర్నీ కలచి వేసింది. 'నీ కోసం ఎన్ని పత్రాకులు పడ్డానురా నాయనా! నన్నొదిలీసి పోయావు. దేవుడు నిన్నుంచి నన్నైనా తీసుకు పోయుంటే బాగుండేది కదరా! ఇంకెవరికోసం బతకాలిరా! నాయనా!' అంటూ గోలగోల పెడుతోంది. కళ్ళముందే ప్రమాదానికి గురై చనిపోయిన దూడను చూచి విలపిస్తున్న ఆవులా ఉంది అసిరమ్మ పరిస్థితి.

'అయ్యో! సింహాచలం చనిపోయాడా? మన ఈడువాడే! ఇంతకీ ఏం జరిగింది?' అని ప్రశ్నించాను.

'తెల్లారి స్నానానికని పెద్ద చెరువుకి వెళ్ళాడు. ఎప్పుడు బైటకు వెళ్ళినా ఎవరినో ఒకరిని తోడిచ్చి అసిరమ్మ పంపేది. ఆరోజు ఒక్కడే వెళ్ళాడు. ఒడ్డునున్న రాయి మీద కూర్చుని పళ్ళు తోముకుంటున్నాడు. ఇంతలో దెయ్యం పడి వాడిని నీటిలోకి తోస్సింది. చుట్టుపక్కల ఎవరూ లేరు. దూరాన్నుండి ఎవరో చూచి పరిగెత్తుకొచ్చేసరికే అంతా అయిపోయింది'. అని చెప్పాడు అప్పారావు. మరి అసిరమ్మ పరిస్థితేంటి? అని మళ్ళీ ప్రశ్నించాను.

'అసిరమ్మను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఆవిడ రెండు మూడు రోజులు మనిషి కాలేదు. బంధువులే దహన


సంస్కారాలు చేశారు. అంతిమ సంస్కారాలు కూడా మూడురోజుల్లో తేల్చేశారు. నాల్గోరోజు తెల్లారి లేస్తూనే విపరీతమైన దుఃఖం, కోపం ఆవహించి జుత్తు విరబూసుకొని పడమటి దిక్కు గబగబ నడుస్తూ 'ఆ సిద్ధాంతి పనీ, ఈ పంతులు పనీ ఈరోజు పట్టేస్తాను' అనుకుంటూ బయలుదేరింది. పక్క ఊరిలో ఉన్న సిద్ధాంతి ఇంటికివెళ్ళి 'ఓరేయ్ సిద్ధాంతీ అని పిలిచింది'. ఇంట్లో చల్దన్నం తింటున్న సిద్ధాంతి ఏదో బేరమనుకొని చెయ్యి కడుక్కొని గబగబా బైటకు వచ్చాడు. రావడం రావడమే వాడి జుత్తు పట్టుకొని 'దెయ్యాన్ని ఒదిలించావా? నిన్ను చూస్తే దెయ్యం పారిపోతాదా? చూడురా నేనిప్పుడు నీ దయ్యాన్ని ఒదిలిస్తాను' అంటూ ముందుకు వంచి, వీపు మీద పిడిగుద్దులు గుద్దింది. వాడు బోర్లా పడిపోయాడు. ఒక్కటి తన్నింది. ఇక 'నీ చావు నువ్వు చావు' అని, 'ఆ పంతులైనా నాగతి ఇలా ఔద్ది అని సెప్పనేదు. వంశివృద్ధి అన్నాడు. వంశినాశినిం అయింది. ఇంకేటి మిగిలింది' అంటూ ఊరిలోని పంతులు ఇంటికి బయలుదేరింది. ఈ ఘర్షణకు పోగైన గ్రామస్థులు సిద్ధాంతి చనిపోయాడని గ్రహించి, అసిరమ్మను పట్టుకొని, పోలీసులకు అప్పగించారు.

'ఔను! లేకపోతే మన పురోహితుడికీ సిద్ధాంతి గతే పట్టేది.' అని మనసులో అనుకొని 'అయ్యో! ఐతే అసిరమ్మకు శిక్షవేశారా ఏంటి?' అని అడిగాను. 'ఔను. కోర్టులో ఆవిడ గోడు అరణ్య రోదనే అయింది. యావజ్జీవ కారాగార శిక్ష వేశారు' అన్నాడు మావాడు. 'అలాగా! అయ్యో! అసిరమ్మ జీవితం దుఃఖమయమైంది' అన్నాను. 'చిన్నప్పుడు ఏమాత్రం ఖాళీ ఉన్నా మా అమ్మకు ఇంటి పనిలో సాయం చేసేది. నన్ను ఓ కొడుకులా పలకరించేది నోరారా. ఆత్మీయతకు ఏ అంతస్తూ అడ్డురాదు మా పల్లెల్లో'. అనుకోకుండా కళ్ళు చెమ్మగిల్లాయి.

'అంతేకాదు. జైల్లోనే కొడుకు కోసం ఏడ్చిఏడ్చి చనిపోయింది. కోడలికి కన్నవారు వేరే మనువుకు ఇచ్చేశారు. అప్పటి నుండీ ఆ ఇల్లు ఆలనా పాలనా లేక దిబ్బై పోయింది.' అని ముగించాడు అప్పారావు.

'ఇంత జరిగిందా! నిజంగా హృదయ విదారకమే! సమాజంలో అజ్ఞానం ఉన్నంత వరకూ చిన్న పామును పెద్ద పాము మింగుతూనే ఉంటుంది. పేదోడు బలైపోతూనే ఉంటాడు.' అని బాధపడుతూ నిద్రలోకి జారి పోయాను.

■



## అస్తిత్వపు ప్రశ్న


**ము**క్కలైన అస్తిత్వాన్ని
మోసుకుంటూ మూడో మనిషి
లోకమంతా ఉమ్మేసినా
దీవించే అతను కానీ ఆమె చేతులు
ఆకలికి, అవకాశానికి
నడుమ ఉగిసలాడుతూ కూడా
నరకంలో నవ్వుతూ ... చప్పట్ల నిరసన
బతుకును పట్టించుకోమని గొంతెత్తుతావు

కల్తీ కల్లోలంలో
తన అస్తిత్వం కూడా ఒకటైనప్పుడు
కన్నీళ్లు ఆగవు
కాలే కడుపు పడుపులో
ఆకలిని వెతుక్కుంటే తిట్ల దండకం
పైశాచికత్వం వొళ్ళు విరిస్తే
దేహం ముక్కలై విసరబడుతుంది

పుట్టుక నీది చావు నీది
ప్రకృతి ఇచ్చిన రూపాన్ని
రొప్పుతూ, కనుమూసే వరకూ
మోయాల్సిందే ...
ద్వేషం నింపుకున్న లోకంలో
నీకన్నా ప్రేమని ఎవరు పంచి ఇవ్వగలరు
ఓ 'మూడో మనిషి'...!

**- పుష్యమీ సాగర్**

**90103 50317**






# కంచె దాటొచ్చిన ధిక్కార స్వరం

- కెంగార మోహన్
90007 30403

**మ**నిషి మనుగడే ప్రశ్నార్థకమైన పరిస్థితి నేడు కొనసాగు తోంది. కొన్నేళ్ళుగా అంటే కేంద్రంలో మతోన్మాద పాలకులు అధికారంలోకి వచ్చాక దేశంలో అసహనం పెరిగిపోయింది. ప్రతీది కార్పొరేట్లకు ధారాదత్తం చేసిన దుస్థితి దేశం ఎదుర్కొంటున్నది. మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవడంలో హిందుత్వ అజెండాతో సాగుతున్న పార్టీలు ముందుంటున్నాయి. దేశమేమైపోయినా ఫర్వాలేదు. ఎన్ని విధ్వంసాలు జరిగినా తమకు మాత్రం అధికారం వస్తే చాలు, పాలనాపగ్గాలు చేతికొస్తే చాలు, దేశప్రజల సెంటిమెంట్లతో ఆడుకోవచ్చునే కాంక్ష ఇటీవల కాలంలో ఎక్కువైంది. కులం, మతం పునాదుల మీద ఒక జాతిని నీతిని నిర్మించలేమన్న అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి నిరంతరం తూట్లు పొడుస్తూనే ఉన్నారు. రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని అమలు చేయ ప్రయత్నాలు ఇప్పటికే ఆరంభించేశారు. భారతీయులు ఎవరి మతాన్ని వాళ్ళు అవలంబించవచ్చు. కానీ ఇది లౌకికతత్వం కలిగిన విశాల భారతదేశం. ఆ ప్రాథమిక జ్ఞానం లేని వాళ్ల ఉన్మాద చేష్టలకు దేశం నిత్యకల్లోలాలూ ఉద్రిక్తతలూ చూస్తున్నది. జి.వెంకటకృష్ణ రాసిన ఈ కంచెదాటే పాట కంచెదాటొచ్చిన ధిక్కార స్వరంగా ఈ సాంస్కృతిక ఆర్థిక కోణాలను మనముందు ఇలా వినిపిస్తున్నది.

**నోట్ల రద్దు :** 2016 నవంబర్ 8న జాతినుద్దేశించి ప్రసంగించిన మోడి 500, 1000 నోట్లను రద్దు ప్రకటించారు. దేశం మొత్తం యావత్తు దిగ్భ్రాంతికి గురైంది. దాని పర్యవసానమిలా చెబుతాడు ఈ కవిత్వంలో..

**మూలిగే నక్కమీద తాటికాయలా/ సన్నాబన్నా బతుకుల మీద నోట్లరద్దు/ పుండు మీద కారం జల్లినట్టు/ దినవారీ జీవితాల మీద క్యాషులెస్సు... మోడిత్వాన్ని తుద ముట్టించక తప్పదు (గాయ దృశ్యాలు).** నోట్ల రద్దులో లాభపడింది కార్పొరేట్లు. క్యూలైన్లో ప్రాణాలు పోగొట్టుకున్నదేమో పేద మధ్య తరగతి ప్రజలు. మరి కవి ఈ మోడిత్వాన్ని తుద ముట్టించాలను కోవడం రాజ్యంపై చేసిన తిరుగుబాటు.

**మోడీధ్యానం :** రైతులు ఆకలి చావులు చస్తున్నా, పేదలు బతుకు సమరంలో బండబారుతున్నా దేశ ప్రధాని మాత్రం చాలా పద్ధతిగా ధ్యానం చేస్తున్నారు. కరోనా పోవాలంటే చప్పట్లు కొట్టిస్తారు. ఆయన అనుచరులు ఆవుపేడ పూసుకొని గోమూత్రం తాగమంటారు. మోడీ ధ్యానం వెంకటకృష్ణ మాటల్లో..

**ధ్యానమంటే కళ్ళుమూసి కుట్రలు రచించడం/ ధ్యానమంటే చేతులు చాచి వంచెనలు కట్టడం/ అజ్ఞాన తిమింగలాన్ని సాకి సర్వాన్ని గుటకేయడం.. (ఒంటికంటి ధ్యానం)**

**మానవహక్కులపై నిర్బంధాలు :** మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రశ్నించే గొంతుకల్ని నిర్బంధించడమొక్కటే కాదు. హతమార్చిన ఘటనలూ చూశాం. రాజ్యం చేస్తున్న కుట్రలో ఎందరో బలయ్యారు. బలవుతున్నారు. ఎక్కడ మానవ హక్కులకు విఘాతం కలుగుతుందో, ఎక్కడ ఆదివాసీలుపై దమనకాండ జరుగుతుందో, ఎక్కడ దళిత హక్కుల హరింపబడతాయో, అణగారిన ప్రజలు అణచివేతకు గురయ్యారో అక్కడే నిరసన ధ్వనులు వినిపిస్తాయి. తొంభైశాతం వికలాంగులాంగుడైన ప్రొ.సాయిబాబా పైనా రాజద్రోహం కేసు

నమోదు చేయబడింది. ఇది అందుకే వెంకటకృష్ణ అంటాడు..

**అతని కలలో ఆయుధాలున్నాయని/ అతనింటిని సోదాచేసి/ అవి మనసున భద్రపరిచాడని నిర్ధారించింది/ మూడు తలల సింహం (వీల్ చైర్ ఫోక్స్).** అలాగే గత మన్మోహన్ ప్రభుత్వ హయాంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట ఆదివాసులపై సాగిన దాడికి వ్యతిరేకంగా పోరాడిన గిరిజన హక్కుల కార్యకర్త, తమిళనాడుకు చెందిన క్రైస్తవ మతాచార్యుడు స్టాన్‌స్వామిని భీమ్ కొరగావ్ కేసులో అరెస్టు చేసిన పాలకులు అనారోగ్యం లోనూ ఉపశమనం కలిగించకుండా బలిగొన్నారు. ఆయనను గుర్తుచేసుకుంటూ వెంకటకృష్ణ ఇలా అంటాడు ..

**ఆశయం సత్యబద్ధమైనపుడు/ దాన్ని ఆచరించే స్థానం దూరమైనప్పుడు/ నువ్వు జీవించింది జైలు/ స్వభావాలు, ఇరికించే దృక్పథాలు/ బరితెగించిన నిర్బంధాలు విడుదల కానీయ్యని ఖైదులు (స్టాన్ స్వామి).**

ఈ కవితకు ఏం శీర్షిక పెట్టాలో అర్థంకాక స్టాన్ స్వామీ అనేసినట్లుంది.

**మతోన్మాదం :** పంజాబీ సూఫీకవి బుల్లేషా అంటాడు : *మసీదుని, దేవాలయాన్ని నేలమట్టం చేయండి. నేలమట్టం చేయవీలైన దానినంతా నేలమట్టం చేయండి. అయితే ఎప్పుడూ ఎవరి హృదయాన్ని ముక్కలు చేయవద్దు. ఎందుచేతనంటే భగవంతుడు అక్కడే వుంటాడు.* మరి దేశంలో ఈ రోజు మతోన్మాదం పురివిప్పి హిజాబ్ ఘటనతో కన్నడ రాజ్యం అట్టుడుకుతున్నది. అదే కర్నాటకలోని బాగేవాడకు చెందిన బసవేశ్వరుడు (1134-1196) ఆనాడే మనుషులంతా ఒక్కటేనని ప్రబోధించి లక్షల ప్రవచనాలతో అసమానతలు లేని సమాజంకోసం తన కోణంలో కృషిచేశారు. తన అనుభవ మంటపంలో లక్షల మందికి పేద దళిత బహుజనులు, అన్నీ కులాలవాళ్ళు సహపంక్తిగా కూర్చుని భోజనం చేశాక తను భుజించాడు. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. శ్రమలో దైవత్వముందని, దేహమే దేవాలయమని ప్రబోధించాడు. హిందూమతం మానవత్వం వైపు పయనించడం లేదని అన్నాడు. ఇప్పుడు అదే గడ్డపై ఇప్పుడు మత విద్వేషాలు కుల దురహంకారాలు ప్రకోపిస్తున్నాయి. వెంకటకృష్ణ బసవేశ్వరుడిని స్మరించాడు తన కవిత్వంలో..

**హిందుత్వ రాజకీయుల గుండెల్లో/ నువ్వు మోగించిన తిరుగుబాటు ఢంకా/ హేతువు విసిరిన సవాళ్ళు/ మింగుడు పడని నిప్పుకణికలు/ కమండల దళాల కళ్ళలో/ నీ రాతలు రగిలే కారం రేణువులు/ మండే నిప్పుకణికలు/ అవి చెన్న బసవడి ధిక్కార వచనాలు..( ధిక్కార వచనం)**

**శంభూకుని వారసులు రామదండుని/ ప్రశ్నించక మానరు/ శూర్పణక సంతానానిదే న్యాయం/ నీ దురాక్రమణ యాగాలను ఆపక మానరు/ ఆదివాసీ అడుగులన్నీ/ మూలవాసుల ఆకాంక్షల్ని రగిలించకపోవు/ నిన్నెదిరించే వాళ్ళంతా బీమాకోరెగావ్లో/ మొలిచిన గడ్డిపోచలే/ నువ్వు బిగించిన చేతికి చుట్టుకునే తాళ్ళే/ అవి నీకు రుచించని చేదు నిజాలే..**

తపస్సు చేసినందుకే శంభూక వధ చేసిన రాముడు ..శూర్పణక ముక్కు కోసిన లక్ష్మణుడు, బీమా కోరేగావ్‌లో నెత్తుటి కల్లాపి జల్లిన పేష్వాలు ... ఇవన్నీ ఒక్క కవితాపాదంలో చెప్పేస్తాడు.

**నువ్వు విడమరచిన కలలెన్నో/ ఎదురు చూస్తున్నవి/ నువ్వు గొంతు విప్పిన పాటలెన్నో/ మూగబోయి వున్నవి/ నువ్వు అనువదించాల్సిన గాథలెన్నో/ గొల్లుమంటున్నవి/ నువ్వు కనులు తెరిచే నిద్ర చాటున/ రెప్పలు వేచి వున్నవి.. (ఒక శ్రవణుడి మరణం)**

ఈ కవిత గాథతగా రాశాడు వెంకటకృష్ణ. ఈ కవి స్పష్టంగా ఈ కవిత్వం ద్వారా లాల్ నీల్ ఐక్యతను కలగంటాడు.

**స్మృతి కవిత్వం :** కవిత్వంలో స్మృతి అన్నది ప్రధాన పాత్ర పోషిస్తున్నది. చాలా మంది కవులు ఎక్కువగా స్మృతి మీద, కాలం మీద అమ్మ మీద కవిత్వం రాసి ఉంటారు. ఈ కవి కవిత్వం స్మృతి అనకానేక సామాజిక ఉద్యమాల్లోనూ, ప్రజాతంత్ర ప్రగతిశీల ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయిన వాళ్ళను స్మృతి కవిత్వంగా రాస్తూ పోయాడు. అలా మాట్లాడటం కూడా అనేక ఘటనలతో పోలుస్తాడు. కత్తి మహేష్ గుర్తుకు తెచ్చుకుంటూ..

**నువ్వు సత్యం మాట్లాడితే/ అసత్యాల బరువు కింద/ ముంచేయడమొక విద్య/ నువ్వు న్యాయం అడిగితే/ అన్యాయాల చెలామణిలో/ నిను తోసేయడమొక కళ/ ఇది ధర్మమా అని అడిగావంటే/ తరతరాల సాంప్రదాయాన్నే ప్రశ్నిస్తావా? అని నిను తుంచేయడమొక వ్యూహం** (తెల్లటి చీకటి).. ఈ కవిత చదివాక కత్తి మహేష్ మరణం మీద కూడా నాకు అనుమానం కలుగుతుంది. ఈ కవితల్లో రాయలసీమకు జరిగిన అన్యాయం, కరోనా, అనేకానేకంశాలు కవిత్వమయ్యాయి.

■

# స్వాతంత్ర్య భారతం!

మురికివాడల్లోని జనం మూలుగుతూనే వున్నారు
తాడిత పీడిత ప్రజను చూడ
తరాలైన కూడ మార్పు లేదు!
బానిస బతుకులకు చిప్పెడు మెతుకుల్లేవు!
రాజకీయ నాయకులవి కూడా... అంతే
బానిస బతుకులైనా సకల సుఖవంతమైన
జీవిత రసాస్వాదనలే!


ఎవరి కడుపు కిందికి వాళ్ళే
నిధులను నీళ్ళను మలుపుకుంటునే వున్నారు!
రాచరిక రాజకీయంలో బీదల కగచాట్లే ...!
మత రాజకీయాలకు మంగళం పాడేవారు లేరు!

పేదల గుడిసెల్లో వెన్నెల విరబూసి
ఎదలో వేదనను ఎక్కిరిస్తుంది!
దేవళ ముందరి దీన జనులాక్రందనలు...
ఏమాత్రం ఊరట లేదు!

ఇకనైనా పాలకులు ఏలికలు నాయకులు
ఒక చూపు చూసి వారికాశ్రయాన్నికల్పించండి!
ఇదీ దురాశవుతుందేమో!
అయినా ఎదురు చూద్దాం
అప్పుడే డెబ్బై ఐదేళ్ళ స్వేచ్ఛకు సార్థకత అవుతుందని
ఏదో మనసు పొరల్లో
మిణుకు మిణుకుమంటున్న చిరు ఆశ...!

– డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
85558 99493





# నిన్నపాట వైపు

ఎవరు విసిరిన బాణమిది?
గాయం యుగాలుగా రేగుతూనే వుంది
ఎవరు మోపిన శాపమిది?
భారం తరాలుగా పెరుగుతూనే వుంది
ఎదగడానికి ఎగబాకుతున్నప్పుడల్లా
కులం బండరాయి మెడకి తగిలించబడి
వెయ్యి నిలువుల లోతుకి లాగిపడేస్తునే వుంది

మెత్తటి కోరలతో నెమరేస్తూ
అంటరానితనానికి అర్థం అర్థమయ్యేలా
ఒక పురుగు గ్రాండ్ ఫినాలే నిర్వహించి మరీ
చెప్పాక కూడా
లోకం నిన్నపాట వైపు మొగ్గు చూపుతూనే వుంది

నన్ను తాకిన గాలి నిన్ను తాకుతుంది
నిన్ను మోసిన నేల నన్ను మోస్తుంది
నేను తిన్నదే నువ్వు తింటున్నావ్
నువ్వొదిలేదే నేనొదులుతున్నాను
తేడా ఏముంది...!?

మనిషన్నవాడే అంటరానివాడని
నిరూపితమయ్యాక
ఈ దేశం అద్దెకొంపకు
నీ కులమేంటని ఇంకా అడుగుతూనే వుంది
ఆ చేతి వంటకు మైలను అంటగడుతూనే వుంది

చెలరేగుతున్న చీకటి ముందు
దీపం తల తెగిపడుతూనే వుంది!

- బంగారాజు
85003 50464



# దళిత కవిత్వం సామాజిక చైతన్యం

ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్
94926 34686

తెలుగు సాహిత్యంలో దళిత ప్రస్తావన మొదటిసారిగా బమ్మెర పోతన రచించిన శ్రీమద్భాగవతంలో కనిపిస్తుంది. అందులోని అష్టమ స్కంధంలోని గజేంద్రమోక్ష ఘట్టంలో 'దళిత' పద ప్రయోగం కన్పిస్తుంది. ఇది దళిత చైతన్య సూచిక కాదు. మహాత్మజ్యోతి బా పూలే దళిత శబ్దాన్ని జాతివాచకంగా ప్రచారంలోకి తెచ్చారు. 1970లో దళిత పాంథర్స్ ఉద్యమం వచ్చిన తర్వాత ఈ పదం బాగా ప్రచారంలోకి వచ్చింది. తెలుగు సాహిత్యంలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'సత్యహరిశ్చంద్రీయం' నాటకంలోనూ, మంగిపూడి వేంకటశర్మ రచించిన దళిత కావ్యం 'నిరుద్ధ భారతము'లోనూ దళిత పద ప్రయోగం కన్పిస్తుంది.

**దళిత నిర్వచనం**

**1.** 'తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి, విద్యా సౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడికి గురైనవాళ్లు'

**2.** 'మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు నోచుకోని నిర్భాగ్యులు. ఊరికి దూరంగా ఉండి ఉనికిని కోల్పోయిన వాళ్లు సభ్య ప్రపంచంతో సరైన సంబంధాలు లేనివాళ్లు, నిత్య పీడితులు, నిత్య తాడితులు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్న వాళ్లు దళితులు' అని ఎండ్లూరి సుధాకర్ నిర్వచించారు.

**3.** 'కుల వ్యవస్థ కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా అణచివేయబడిన శ్రామికులే దళితులు' అని కె.సత్యనారాయణ నిర్వచించారు.

**4.** 'దళితులంటే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మతస్థులు అంతా కలిపి దళితులే' అని గుంటూరు లక్ష్మీ నరసయ్య నిర్వచించారు. అయితే, ఈ దళిత అనే పదాన్ని వాడవొద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఒక తీర్పులో పేర్కొంది.

**దళిత సాహిత్య నిర్వచనాలు**

దళితులు తమ ఆవేదనను, ఆర్తిని యుగయుగాలుగా అనుభవించిన వివక్షతలను తామే స్వానుభవంతో ఆ అనుభవాలను అక్షరీకరించుకోవడమే దళిత సాహిత్యం. దళితుల ద్వారా దళితుల కోసం రాయబడే సాహిత్యమే దళిత సాహిత్యమని చెప్పవచ్చు. ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటు తత్త్వం మార్పుకోసం పోరాట నిర్దేశం చేసేదే దళిత సాహిత్యంగా భావించవచ్చు.

- 'దళితులంటే అంటరానితనం, మాల, మాదిగ కోవకు చెందినవారు. వీరి సాహిత్యమే దళిత సాహిత్యం' అని శివసాగర్ నిర్వచించారు.
- ప్రముఖ మరాఠీ కవి యోగేంద్ర 'దళిత జీవితాన్ని చిత్రించేది దళిత సాహిత్యం' అని నిర్వచించారు.
- మరొక మరాఠా రచయిత వాంఖడే 'ఒక విప్లవాత్మక సంఘటన ఫలితంగా జన్మించి తీవ్రమైన తిరుగుబాటు యొక్క వ్యక్తీకరణ రూపమే దళిత సాహిత్యం' అని నిర్వచించారు.

**దళిత సాహిత్య లక్షణాలు**

దళిత సాహిత్యం అనుభూతి విశిష్టమైంది. జీవితాన్ని, సమాజాన్ని యథాతథంగా ప్రతిబింబించడం దీని లక్షణం. ఇది కుల, మత, వర్గ, ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్య స్వభావం నుంచి మనిషికి స్వేచ్ఛను కల్గించే దిశగా కొనసాగుతుంది. దళిత దృక్పథంలో జీవితమే సాహిత్యం కనుక సాహిత్యానికి ప్రజలకు మధ్య ఉన్న ఖాళీని పూరించే దిశగా

కృషి చేస్తుంది. మనిషి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ, మానవ జీవితంలో చైతన్య స్ఫూర్తిని రగిలించడానికి ప్రయత్ని స్తుంది. ప్రాచీన, సాంప్రదాయిక స్వభావం కలిగిన సామాజిక నిర్మాణాన్ని తిరస్కరిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువల ప్రాతిపదికగా ఏర్పడే సమాజ నిర్మాణాన్ని ఆహ్వానిస్తుంది. హేతువాద దృష్టిని కలిగి, పురాణ భావనలు, మత సిద్ధాంతాలు, అశాస్త్రీయమైన భావనల్ని ఖండిస్తుంది.

సమాజంలో సంస్కరణ భావాలు రేకెత్తించడానికి సాహిత్యం ఒక సాధనం కావాలని దళిత సాహిత్యం భావిస్తుంది. సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కల్గించేదిగా ఉండాలని ఆశిస్తుంది. దళిత సాహిత్యం పీడితుల ఆశలు, ఆశయాలు, అనుభవాలు, అనుభూతులను చిత్రిస్తుంది. అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సామాజిక ఆర్థిక న్యాయం కోసం పోరాడటమే దళిత సాహిత్య ప్రధాన లక్షణం. దళితుల మానసిక దాస్య శృంఖలాలు తెంచడానికి పోరాటస్ఫూర్తి రగిలించడం కూడా మరొక ప్రధాన లక్షణం. ఈ దిశగా చేసే పోరాటంలో ఉన్నత వర్గాలు కూడా దళితుల గురించి ఆలోచించేలా చేసింది దళిత సాహిత్యం.

దళిత దృక్పథాన్ని అర్థం చేసుకోకపోతే దళిత సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం కష్టతరమవుతుంది. అంబేద్కర్, పూలే, మార్క్స్ రచనల్ని, సిద్ధాంతాల్ని అర్థం చేసుకుంటే దళిత దృక్పథం అర్థం చేసుకోవడం సులభతరమవుతుంది. భారత దేశంలో పట్టిపీడిస్తున్న కుల సమస్య, అస్పృశ్యత వంటి నేపథ్యంలో దళితుల బానిసత్వాన్ని ప్రతిఘటిస్తూ దళితులు కవిత్వం రాయడం ఆరంభించారు. మొదటగా గుర్రం జాషువా రచించిన కవిత్వం నేటి దళిత కవిత్వోద్యమానికి భూమికగా నిలిచిందని చెప్పవచ్చు. 90వ దశకంలో జరిగిన చుండూరు, కారంచేడు సంఘటనలు, దళిత స్త్రీలపై అఘాయిత్యాలు, అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతలు, వర్ణ వివక్ష, దళితుల వేదనలు, అగ్రవర్ణ దురహంకారాలు వంటి నేపథ్యాలు దళిత కవిత్వానికి వస్తువులయ్యాయి. దళితవాద నేపథ్యంతో రచించిన కొన్ని కవితల్ని ఈ వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది.

కత్తి పద్మారావు దళితవాదంతో రచించిన కవిత 'అవును ఈ యుగం మాది'లో యుగం మాది అంటే వ్యక్తిది కాదు. సమూహానిది, అదే దళిత సముద్రపు ఘోష అని కవి తెలియజేశాడు.

"అవును
నా గాయాలన్నీ గర్వపడేవే
నేల కన్నీటి బొట్లతో/ తడిసినప్పుడల్లా
నేనొక నాగాస్త్రం ధరించాను
వెలుగు బక్కచిక్కినపుడల్లా
నేనొక వెన్నెల తుంపరలా వ్యాపిస్తాను
భూమిని ఎంత లోతుగా తవ్వినా
నా చరిత్ర సాక్షాత్కారం అవుతోంది
మనిషి అంతరంగం ఎంత వెదికినా
వేదనే దొరుకుతుంది...." అని కత్తి పద్మారావు దళిత వేదనని ఈ కవితలో చిత్రించాడు. తమ జీవితాల్లో వెలుగు కోల్పోయి చీకటి పరచుకున్నపుడల్లా తాను ఒక వెన్నెల తుంపరలా వ్యాపిస్తానని చెప్పాడు. చరిత్ర పుటల్ని ఎంత లోతుగా తవ్వి వెలికి తీసినా దళిత వేదనాభరిత చరిత్ర సాక్షాత్కరిస్తుందని, మానవ అంతరంగాల్ని ఎంత శోధించినా దళిత వేదనే దొరుకుతుందని తెలిపాడు. తమ అభివ్యక్తిలో కన్పించే శిల్ప సౌందర్యాలు అంతర్మథనం నుంచే జన్మిస్తాయని స్పష్టం చేశాడు.

రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చినపుడు, అంబేద్కర్ విగ్రహం శిరస్సును ఖండించినపుడు చలించిపోయిన ఎండ్లూరి సుధాకర్ 'ఒక విగ్రహం – ఒక నిగ్రహం' అనే కవిత రాశారు. దళితుల్ని అవమానించడానికి అంబేద్కర్ విగ్రహ శిరస్సే కన్పించిందా అని ప్రశ్నించాడు. ఈ దేశంలో 33 కోట్ల మంది దేవతలు చేయలేని పనిని, రాజ్యాంగ రూపకల్పనని డా.బి.ఆర్.అంబేద్కర్ చేశారని, అందరికీ ఆత్మగౌరవాన్ని కల్గించిన వ్యక్తి మా దీన బాంధవుడని ఇందులో పేర్కొన్నాడు. అంబేద్కర్‌ని అవమానించడమే పగ తీర్చుకోవడమైతే, ఈ దేశంలో మట్టితో చేసి పూజించే దేవుళ్లకు పుట్టగతులుండవని ఈ కవిత ద్వారా కవి హెచ్చరించాడు. ఎండ్లూరి సుధాకర్ తన ఆవేదనని వ్యక్తం చేస్తూ...

"బాబా సాహెబు లేకపోతే
భావి భారతదేశమే లేదు
విద్వేషం విగ్రహాన్ని కూలుస్తుందేమో కానీ
వివేకాన్ని వికసించనియ్యదు
కూల్చిన అంబేద్కర్ తలకు వెల కట్టడానికి
ఈ భూగోళం మీది ధనం సరిపోదు
ఆయన చూపుడు వేలు కింద
శాశ్వతంగా తల వంచడమే
జరిగిన నష్టానికి పరిహారం
పశ్చాత్తాపమే పూలహారం...' అని తెలిపారు.

మనుషులు మానవత్వాన్ని మరచి ఇనుపరాడ్లతో, గొడ్డళ్లతో దళితులపై దాడి చేసిన లక్ష్మింపేట మారణకాండకి చలించిపోయిన కవయిత్రి జూపాక సుబద్ర 'నెత్తుటి పేట' అనే కవితను రాసింది. ఈ కవితలో బానిసలుగా బతుకుతూ,

మూతికి ముంత, ముడ్డికి తాటాకు కట్టడం వల్ల అస్పృశ్యులుగా జీవితాన్ని అనుభవిస్తున్న దళితుల పక్షాన కవయిత్రి నిలబడింది.

"మొన్న పులులు చంపిన కారంచేడులు
నిన్న సింహాలు వేటాడిన చుండూరులు
ఇయ్యాల తోడేళ్లు పారించిన నెత్తుటిపేట లక్ష్మింపేట"
అంటూ దళితులపై జరిగిన మారణకాండని తెలియజేసింది.
"తొండ ముదురుతున్న దొరతనాల్ని
కండ్లు దెరుస్తున్న వూరి కుక్కలు పులి వుచ్చతొక్కి
కన్నుమిన్ను గానక
కత్తులకు తోడు కారంపొడిగా కదిలిన ఆడ దొరలతో
లక్ష్మింపేటను రక్తం పేటను జేసినయి
నావేలే బరిసైనా కంటికడ్డంబడ్డ చెడ్డకాలం
తిరిగి తిరిగొస్తున్న కారంచేడు, చుండూరు
కైర్లాంజి,లక్ష్మింపేటల మారణకాండలకు మరణమెప్పుడో..."

అని అంటూ జూపాక సుభద్ర దళితులపై దాడులను ఖండించారు. అగ్రవర్ణ మహిళలు కూడా దళిత స్త్రీలపై కారంపొడులతో దాడి చేసిన దృశ్యాలను, అగ్రవర్ణ స్త్రీల దురహంకారాన్ని ఇందులో ఆవిష్కరించారు. దళితులకు పొలం ఉండకూడదనే, సొంత వ్యక్తిత్వం ఉండకూడదనే నీచ మనస్తత్వాన్ని చిత్రించారు. పొలం దున్ని, పంట పండిస్తే దళితులపై దాడిచేసి, వారి ప్రాణాలు తీయడానికీ వెనుకాడని అగ్రవర్ణాల దుర్మార్గాన్ని ఈ కవితలో కళ్లకు కట్టినట్లు చూపించారు.

వెట్టిచాకిరీని వ్యతిరేకిస్తూ అరుణ్‌సాగర్ 'హూ లెట్ ద డాగ్స్ ఔట్' అనే కవిత రాశాడు. ఎడారిని కప్పిన ఆకాశం, మనుషుల మధ్య నుంచి దారి చేసుకుంటూ, సముద్రంలోకి దూకిన మనిషి ఎక్కడికి పారిపోతావంటూ ప్రశ్నించాడు. మనిషిని తన కుల మేంటని ప్రశ్నిస్తూ పక్కనోడు చనిపోతుంటే పట్టించుకోని మనిషి తత్వాన్ని దుయ్యబట్టారు.

"కేపిటలిజమా తొక్కా
చారిత్రక బహు తిక్కవాదమా
ఇది బానిస సమాజము
నాణేనికి కాదు/ ప్రతి కథకూ మరోవైపు
నీకు నువ్వేరా/ కనిపించని నాలుగో సింహం
అందుచేతనే/ నువు కనిపిస్తే కాల్చివేత..." అని అంటూ దళిత చైతన్యాన్ని రగిలించడానికి కవి ప్రయత్నించాడు.

బతుకమ్మ పండుగ వస్తే కుల ప్రస్తావన లేకుండా పండుగ జరపడాన్ని, ఓట్లు అడుక్కునే సమయంలో పావలావడ్డీ, కరెంటు బుడ్డీ, రూపాయి కిలో, ఆపద్బంధు వంటి పథకాల వలల్తో ఓట్ల వేటకొచ్చిన రాజకీయ నాయకుల తీరును కృపాకర్ మాదిగ 'పాదయాత్రలన్నీ దండ యాత్రలే' అనే కవితలో ఎండగట్టాడు.

"కాలువలు కాలువలుగా నీళ్లని దొబ్బుకున్న వాడే
కడివెడు నీళ్లు వాళ్లని
బలిదానాలకు ఉరికిస్తుండు
చిందు మాదిగ పూలపై
నిషేధాలు సాగిస్తున్న ఆడ దొరలు
రోడ్డు మీద రాజకీయ బత్కమ్మలాడుతున్నరు
ఊరి బయటికి నెట్టినోడే
మనమంతా బంధువులం
గంగ సింధు బిందువులమని
నినాదాలు చేస్తుండు...' అని అంటూ ప్రజావంచన ప్రస్థానాల్ని విమర్శించాడు. ఒక పక్క ఖనిజ వనరుల్ని ఇనుప గోళ్లతో దేవుకుంటూ, భూమిని శనగపొట్టులా, డొల్లగా చేస్తున్న రాజకీయ నాయకుల దోపిడీని ఈ కవిత ద్వారా ఎండగట్టారు. చెరువు మట్టి, ఇసుకను తరలిస్తూ, బాక్సైటు కొండల్ని మింగేస్తూ ఆదివాసీల జీవితాల్ని, పర్యావరణాన్ని రంగు రాయిలా దొంగలిస్తూ, తేనెటీగలకు మంటబెట్టి ఆర్థిక మండళ్ల నాగజెముళ్లు పెంచుతున్న రాజకీయ నాయకుల వైఖరిని ఈ కవితలో తేటతెల్లం చేశాడు. కుర్చీల కోసం కాకుండా ప్రజల పక్షం నిలబడే విధంగా పాదయాత్రలు ఉండాలని నిర్దేశం చేశాడు.

చుండూరు మారణకాండపై వచ్చిన తీర్పుని ఖండిస్తూ తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ 'మట్టి పువ్వు సైతం కులం పాటకు పత్రహరితం' అనే కవితను రచించాడు. దళితులు అన్ని రంగాల్లో రాణించడం, అభ్యున్నతిలో పురోగమించడం ఓర్వలేని కళ్ల దాష్టీకానికి ఈ కవిత అద్దం పడుతుంది. దళితులు చదువుకొని పైకి ఎదగడం, సూటు, బూట్లు వేసుకోవడం భరించలేని అగ్రవర్ణాలు దళితుల్ని చంపడానికి, వారి పొలాల్ని రక్తసిక్తంగా మార్చడానికి వెనుకాడరనే సత్యాన్ని ఈ కవిత ద్వారా విల్సన్ సుధాకర్ తెలియజేశాడు. చంపిన వారూ తెలుగువారే. చనిపోయిన వారూ తెలుగు వారే.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ పెటాకులై సమకాలీన తెలుగు సమాజాన్ని ముక్కలు చేస్తూ దళితులపై అగ్రవర్ణాలు వేటకుక్కల్లా దాడి చేసిన తీరుని ఈ కవిత తెలియజేస్తుంది.

*'అతిశీతల శవపేటికలో సత్యాన్వేషణ శాశ్వత సశేషం*
*సాక్ష్యాధారాల ఆకలి తీరని మీనారవిందుల ఖాకీ లలిత సంగీతం*
*మీడియా రథమెక్కి జీవనదిలో ఒక్క పీనుగూ లేదని బొంకుతున్న*
*రేడియోల ప్రత్యక్ష ప్రసారాల అభినయం*
*మీమాంస లేకుండా నరమాంసంపై*
*మనువు తీర్పుల వాద్య సహకారం*

మట్టిపువ్వు సైతం కులంపాటకు పత్ర హరితం..' చుండూరు మారణహోమాన్ని దర్శించిన రాజకీయ నాయ కులు, ప్రసార మాధ్యమాల్ని విమర్శిస్తూ కవి ఈ కవితను ప్రారంభించాడు. అడుగు తవ్వితే ఉబికే మధుర జలాల తెలుగు మాగాణిని, పొగాకు, పత్తి, మిర్చి, చెరుకు పంటల్ని నాశనం చేసి రక్త ప్రవాహంగా మార్చి, శ్మశాన వాటికలా మార్చిన ఔన్నత్యం ఎవరిదని సమాజాన్ని ప్రశ్నించాడు. పోలీసుల పనితనాన్నీ ఎండగట్టాడు. నాయకులు, మీడియా, పోలీసులు ఏకమై శ్మశాన వాటికలో ఒక్క శవం కూడా దొరకలేదని పేర్కొనడం అవినీతికి పరాకాష్టగా కవి తెలిపాడు. చుండూరు దళితులకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటిస్తూ,

*"జ్ఞాన దంతం పెరగనివాడు*
*జనం ఓట్లతో గెలిచి జనమేజయ మహారాజైన వాడు*
*జీపీఆరెస్‌తో నరమేధపు పటాల్ని*
*దేశమంతా వీక్షించాల్సిన వాడు*
*రైసినా హిల్స్ నిస్తంత్ర శేషతల్పంపై హాయిగా కొలువు దీరి.."*

అని అంటూ రాజకీయ నాయకుల్ని కవి విమర్శించాడు.

కుల వివక్షపై ఎండ్లూరి సుధాకర్ దళితవాదంతో రాసిన మరో కవిత 'తూటాబండి'

*'నేను రైలెక్కినప్పుడల్లా*
*మూడో తరగతి రైలు డబ్బాలనే గమనిస్తుంటాను*
*అందరూ నా బంధువుల్లాగా అనిపిస్తుంటారు*
*మా బతుకు పట్టాల మీదకి*
*రైలు తల్లి రాకపోతే/ మాకో మెతుకు దొరికేది కాదు*
*కుక్కాసులు కడిగే వాళ్లుగా*
*కళాసీలుగా, స్కావెంజర్లుగా*
*పాసింజర్ల సేవ చేస్తూనే వున్నాం*
*మాధవుడి ప్రతిరూపాలం/ మాల మాదిగలం*
*మనిషిలోంచి కులంపోదు*
*మావాళ్లు చీపుళ్లు పట్టకపోతే*
*రైలు పట్టాల మీద మలం పోదు...'*

రైలుబండి ఎక్కితే కవికి మేకల మందీ గుర్తుకొస్తుందట. సుఖంగా ప్రయాణం చేయడమంటే సుఖప్రసవం జరిగినట్టుగా కవి పేర్కొన్నాడు. సీటు ఉన్నవారు, లేనివారు, ప్రాణాలకు తెగించి రైలు ఉపరితలంపై ప్రయాణించేవారు ఏ తరగతి, వర్గం ప్రయాణికులని ప్రశ్నించాడు. మనదేశంలో బుల్లెట్ రైళ్లు, కొత్త రైల్వేలైన్లు ఎవరి కోసమని ప్రశ్నించాడు. జలాలను, పొలాలను చూస్తూ హాయిగా ప్రయాణించే జనతా రైళ్లు కావాలని కవి కాంక్షించాడు. దళిత జీవితాలన్నీ అంటరాని ప్రయాణాలతో ఆదిశంకర అవమానాలతో అతలాకుతలం కాకుండా




ఆదర్శప్రాయంగా ఉండి, దళితుల్ని అందరితో సమానంగా గౌరవించాలని కవి కోరుకున్నాడు.

దళిత కవిత్వ ఉద్యమంతో విడదీయలేని బంధం ఉన్న కవి శిఖామణి. దళిత పేద జీవితాన్ని కళ్లకు కట్టినట్లు చూపే కవిత 'ముత్యాలు గారి నిలువుటద్దం'. ఎవరైనా అద్దం ముందు నిలబడి ప్రతిబింబాన్ని చూస్తే అద్దం కాస్త పెద్దదిగా కన్పిస్తుంది. భాగ్యనగరంలోని ట్యాంక్‌బండ్, నక్లెస్ రోడ్డు వంటివి చూసి, వాళ్ల ఊరి చెరువుతో పోల్చుకుంటూ, దళిత జీవితాల్ని నెమరు వేసుకునే విధంగా ఈ కవిత దర్శనమిస్తుంది.

"నూగారు మీసకట్టు మూతి మీద మొలుస్తుండగా
తొలిసారి చూసి మురిపెంగ మెలేసింది ఈ అద్దం ముందే
మా వాడు పిల్లలందరినీ
ఏడు రంగుల ఇంద్రధనుస్సు ఎక్కించి
కలల ప్రపంచంలో ఊరేగించిన
మాయాదర్పణం ముత్యాలు గారి నిలువుటద్దం'

మట్టి ఇల్లు, కంపదడి గోడలు, అరచేయి అంత అద్దం, పిచ్చుక గూడంత దీపం గూడు, చింపిరి జుత్తు, చీమిడి ముఖంతో ఎగిరెగిరి అద్దంలో చూసుకుంటుంటే, ముక్కు కనపడితే కన్ను కనపడదు. కన్ను కనపడితే ముక్కు కనపడదు. కంటికి పెట్టగా మిగిలిన కాటుక రేఖలు, నుదుట దిద్దగా మిగిలిన కుంకుమ రజనుతో ఉన్న ఇంటి గోడలు వంటివన్నీ దళిత పేద జీవితాన్ని చిత్రిస్తాయి.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వోద్యమం బహుముఖీనంగా కొనసాగుతోంది. ఎందరో దళిత కవులు సామాజిక బాధ్యతగా దళిత స్పృహతో కవిత్వ రచన కొనసాగిస్తూ, దళిత చైతన్యం కోసం శ్రమిస్తున్నారు. సాంఘిక అసమానతల్ని రూపుమాపే దిశగా కవిత్వీకరిస్తున్నారు. ఈ దిశగా సాగుతున్న ఉద్యమంలో దళిత సాహిత్యం మరింత పరిపుష్టమై సామాజిక అసమానతల్ని, రుగ్మతల్ని రూపుమాపి సమసమాజ స్థాపన జరగాలని ఆశిద్దాం. ■






# అరణ్యకృష్ణ కవిత్వంలో ఆమె

- డాక్టర్ సుంకర గోపాల్

94926 38547

**పు**రాణాల్లో, ఇతిహాసాల్లో 'స్త్రీ'లను ఎలా చూశారో కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. స్త్రీ హృదయాన్ని, ఆమె అసలు తత్వాన్ని పట్టుకునే ప్రయత్నం అక్కడ జరగలేదు. కేవలం అందాన్ని చూశారు. వాళ్ళకి కలువలు, పద్మాలు, తీగలు కనిపించాయి. చంద్రబింబాలు, సరస్సులు కనిపించాయి. 'స్త్రీవాదం' పేరుతో తమ బాధల్ని, అస్తిత్వాన్ని తామే రాసుకుని వెలుగులోకి తెచ్చుకునేవరకు 'ఆమె' గురించి, ఆ వేదన గురించి తెలుసుకొనే ప్రయత్నాలు జరగలేదు. వివక్ష గురించి, వెనుకబాటుతనం గురించి 1975 – 85 దశాబ్దంలో గట్టిగా ప్రారంభమైనది.

స్త్రీల దుఃఖం గురించి, అమ్మ గురించి కవితలు వచ్చి వుండొచ్చు. కానీ వాటి వెనుక పితృస్వామ్య ఆలోచనలు ఉన్నాయి. ఒక స్త్రీ స్థానంలో నిలబడి కనీసం దగ్గరగా కవిత్వం రాసిన కవులు ఉన్నారు. కె.శివారెడ్డి ఇలాంటి కవితలను 'ఆమె ఎవరైతే మాత్రం' అనే సంకలనంలో కొన్ని చూడవచ్చు. అలాంటి ప్రయత్నం చేసిన మరో కవి అరణ్యకృష్ణ.

అరణ్యకృష్ణ 1994లో నెత్తురోడుతున్న పదచిత్రం, 2016లో కవిత్వంలో ఉన్నంతసేపూ... అనే రెండు కవితా సంపుటాలు వేశారు. ఈ రెండు సంకలనంలో 27 కవితలు 'ఆమె' కేంద్రంగా, చాలా దగ్గరగా సహానుభూతితో రాసినవి ఒక దగ్గరగా చేర్చి 'మనిద్దరం' అనే సంకలనం తెచ్చారు.

21వ శతాబ్దంలో సైతం మనకు రాతియుగపు ఆలోచనలు, ఆచరణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రెండు లింగాలు ఒక్కటే అనే భావన రావడం కష్టంగా ఉంది. స్త్రీ కంటే పురుషుడు చాలా ఎక్కువ అనే భావన మగపిల్లల్లో చిన్నప్పటి నుంచి పెరుగుతూనే ఉంది. అరణ్యకృష్ణ 'స్త్రీ కేంద్రక కవిత్వం' తెచ్చారు. పాలిచ్చిన రొమ్ముకే నిప్పు పెట్టగల సంస్కృతిని ప్రశ్నిస్తున్నారు.

"అమ్మైనా పెళ్ళామైనా ఆమె రక్తమాంసాల మరమనిషి
మరెవరిదో సుఖదుఃఖాల శీతోష్ణస్థితి
ఆమె హృదయ వాతావరణం
గుమ్మం దగ్గర కాళ్ళు తుడుచుకునే పట్టాని తొక్కినట్లు
అందరూ ఆమె స్వేచ్ఛని తొక్కుకుంటూ తిరుగుతారు
సంసార వధ్యశిల మీద పరాయీకరణ పాశంతో
ఆమె వ్యక్తిత్వం ఉరితీయబడుతుంది"

(సాలెగూడు, పుట–34)

ఎలాంటి వాక్యాలు ఇవి! సాలెగూళ్ళను తగలబెట్టే మాటలు. బందీ అయిన బాధిత సమూహపు గొంతుని కృష్ణ పలుకుతున్నాడు. చీకటి నీడలు, పీడకలలు ఎన్ని వున్నా ఆమె చిగురించడం గురించి కలగంటున్న కవి తపన ఇది.

స్త్రీ అంటే పెళ్ళి చేసుకొని, పిల్లల్ని కనడం, చేసుకున్నవాడికి, పుట్టినవాళ్ళకి సేవ చేసుకుంటూ ఉండడం, రుచికరమైన వంట, ఇల్లు శుభ్రంగా ఉంచడం, బట్టలు శుభ్రం చేయడం, అంట్లు తోముకోవడం... చీపురుకట్ట, అట్లకాడ, ట్రిబుల్ ఎక్స్ సోపు... ఇలాంటి వస్తువులతో ఆ పనులు చేసుకుంటూ ఉండడం. అయినా ఆమెను చాకిరి జంతువుగా చూడటం, మొగుడైనా, నాన్నైనా నియంతలుగా మారడం... ఇలాంటి పరిస్థితుల్ని అరణ్యకృష్ణ ప్రశ్నిస్తున్నాడు.

వయసు ఎంతైనా ఫరవాలేదు, ఆడపిల్ల అయితే చాలు అన్నట్టు, ఈమధ్య జరుగుతున్న లైంగిక దాడులు సభ్య సమాజం తలదించుకునేలా చేస్తున్నాయి. బాబాయి, మామయ్య,

తోడేళ్ళను చూసి గొర్రెలు, మేకలు వణికిపోయినట్టు..ఆడపిల్లల పరిస్థితి గురించి 'క్షమించండి, శీర్షిక లేదు' అనే పేరుతో రాసిన కవితలో –

"అవును! మాంసవాంఛలో మగాడు రగులుతున్నప్పుడు

వాడు మావయ్య కాదు బాబాయి కాదు తాతయ్య కూడా కాదు

బహుశా కొన్నిసార్లు వాడు నాన్న కూడా కాకపోవచ్చు

కొమ్ములు కోరలు పంజాలు మొలిచినవాడు

– – – – – – – – – – – – – – – – – –

పెద్దరికం మారణాంగాలతో వెంటపడుతున్నది

పసిపిల్లల చుట్టూ

కంచెలు వేసుకోవాల్సిన కాలం దాపురించింది"

(మనిద్దరం, పుట76)

ఒక స్త్రీ వెంటపడి వేధించడం, ప్రలోభాలకి గురిచేయడం, ఏదోలా లొంగదీసుకోవడం లాంటి ఆలోచనలున్న మగాళ్ళని మనం చూస్తూనే ఉంటాం. ఒక్కోసారి తన భార్య అలసిపోయి ఉన్నా, తనకు మనసు బాలేకున్నా... కోరిక తీర్చుకోవడమే పరమావధిగా ఉండే వాళ్ళలో మనమూ ఉంటాం. ఈ నేపథ్యంలో కృష్ణ రాసిన గొప్ప కవిత 'ఆమె నిరాకరించినప్పుడు'. ఆమె భార్య కావొచ్చు, ప్రియురాలు కావొచ్చు, ఎవరైనా సరే... 'నో' అంటే నువ్వామె దేహాన్ని తాకే హక్కు లేదంటూ.. కవి ఇలా అంటాడు :

"ఆమె శరీరమంటే నీకు

యాంత్రికంగా ఎక్కి దిగే రైలు బండి కావొచ్చు

లోపలికి బైటకి యథేచ్ఛగా తిరిగే నీ ఇంటి గుమ్మంగా తోచొచ్చు

గొప్ప వేదాంతంగా నవరంధ్రాల తోలుసంచీ అనిపించొచ్చు

లేదా

నీ ఇంట్లో తులసి కోటకి వంటింటికి పడగ్గదికి కట్టేసుకున్న పెంపుడు జంతువులా అనిపించొచ్చు" (మనిద్దరం, పుట62)

అని చెబుతూ, కేవలం ఆడమనిషిని చర్మమాత్రంగా చూడటం, ఆమె శరీరం లోపల ఉన్న వ్యక్తిత్వ వ్యవస్థని పట్టించుకోకపోవడం, అక్కడున్న సంక్షోభాలను, సంరంభాలను, పుష్పించే తోటలను, కోటానుకోట్ల ఆలోచన కణాల అలజడిని గుర్తించకపోవడం ఎంత దారుణమో కవి వాపోతున్నాడు.

కానీ ఆమెలో ఉన్న వ్యక్తిత్వ వ్యవస్థని గుర్తించినపుడు శరీరంగా కాకుండా మనసుకు దగ్గరగా ఆమె కూడా



జరిగినపుడు ఎలా ఉంటుందో కూడా ముగింపులో కవి చెబుతాడు.

"ఐనా స్పర్శలో

నీ గుండెలోపలెక్కడో దాక్కున్న జలపాతాలు

జలజలా రాలి పడాలే కానీ

ముకుళించుకున్న పలకరింపులు విచ్చుకొని

సువాసనలై తాకాలే కానీ/ నిన్నో చెట్టుని చేసి

ఆమె సుడిగాలై చుట్టుముట్టెయ్యదూ !

ఈ సంపుటిలో కృష్ణ 'స్త్రీ'గా మారి రాసిన మరో గొప్ప కవిత 'రుధిర సత్యం'. స్త్రీ అంటే ఏమిటో ఒక సంపూర్ణ ఆవిష్కరణ ఇందులో చూడొచ్చు. నెలకోసారి 'స్త్రీ'లో జరిగే శారీరక మార్పుని కూడా కొందరు అర్థం చేసుకోరు. ప్రపంచీకరణ ప్రతిదీ వ్యాపారం చేసింది.

"ఆమె గర్భం నిండా రక్త సముద్రాలు

మనమంతా ఆ రక్త సముద్రంలోంచి

భూమ్మీదకి కొట్టుకొచ్చిన వాళ్ళమే"

ఇలా 'ఎత్తుగడ'తో కవిత ప్రారంభం అవుతుంది. ఒక స్త్రీ గర్భం నుంచి రక్తం కాలువలై పారితే కానీ మనిషి విత్తనం మొలకెత్తదనే సత్యాన్ని కవి గుర్తుకు తెస్తాడు. మానవ బీజాన్ని మొలకెత్తించే రక్తక్షేత్రం ఆమె దేహం అంటాడు.

"మనిషంటే రక్తమనీ



రక్తమే మనిషి మొదటి అడుగుజాడనీ

ఆమె నెలకోసారి/ తానే రక్తసముద్రికై వివరిస్తుంటుంది"

(మనిద్దరం, పుట-74)

స్త్రీ దేహం పునరుత్పత్తి ప్రక్రియకి ప్రయోగశాల. అసలు ఆమె గర్భద్వారాన్ని మించిన దైవత్వం లేదని కవి జ్ఞప్తికి తెస్తాడు. ఈ కవిత ముగింపులో స్త్రీలు ఋతుస్రావం సమయంలో ఉపయోగించే న్యాప్‌కిన్‌లను కూడా విలాస వస్తువుల జాబితాలో చేర్చడాన్ని తీవ్రంగా నిరసిస్తాడు కవి.

"కోర్కె పండిన తర్వాత

ఎండు గోరింటాకులా దులుపుకుంటాడు

ఆమె ఆకలినీ అవసరాన్ని అలంకరణల్తో కలగలిపి

శరీరాన్ని మళ్ళీ తడి గోరింటాకు చేస్తుంది

(మెహబూబ్‌కి మెహెంది, పుట-30)

నిన్ను మోహించానే తప్ప ప్రేమించిందెప్పుడు ?

అసలు నేను నీ కడుపులో పిండంగా కదలాడినపుడు తప్ప

మనిద్దరం సహజంగా ఏకమైందెప్పుడనీ (పుట-29)

ఇలాంటి వాక్యాల్లో అరణ్యకృష్ణ 'స్త్రీ' హృదయాన్ని గొప్పగా ఆవిష్కరించారు.

సమాజంలో 'స్త్రీ'లను చూసే చూపులో మార్పు రావాలని అతని అక్షరాల్లో అడుగడుగునా కనిపిస్తుంది. 'ఆమె' హృదయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో కృష్ణ మార్గం చూపుతున్నాడు. వ్యక్తిగత స్వేచ్ఛను, మానవత్వాన్ని, పురుషాహంకార భావజాలాన్ని వదులుకోవడం లాంటి భావాలు ఇందులో కనిపిస్తాయి. శైలీ శిల్పాల దృష్ట్యా కూడా ఇవి గొప్ప కవితలు. 'ఆమె' అణచివేత గురించి అరణ్యకృష్ణ ఆవేదన ఇది. స్త్రీ పురుష సమానత్వం కోసం తపన పడుతున్నాడు. 'ఆమె'ను 'ఆమె'గా చూద్దాం. ■

## ప్రవహించే ఆత్మ

త్రయంబకంలో ఊపిరి పోసుకుని
బాసర, భద్రాద్రి దాటుకుంటూ
కోనసీమ వడ్డాణం చుట్టుకుని
అంతర్వేది నరసింహుని సన్నిధిలో
కడలిని ముద్దాడతావు !

చంద్రికలు నీ తరగలపై మెరుస్తుంటే
'విశ్వనాథ' కిన్నెరసాని
వెన్నెలపైట వేసుకున్నట్టుంటుంది
'నండూరి' ఎంకి గలగలమంటూ నవ్వుల్ని
మాపైకి రువ్వుతున్నట్టుంటుంది.
'బాపు' నీ సౌందర్యాన్ని కుంచెకు పట్టించి
బొమ్మలకి సొగసులద్దుకున్నాడు!
నీ నడకల సంగీతం ఆస్వాదిస్తూ
రామదాసు కీర్తనల నైవేద్యం చేశాడు!

నీ అలల అద్దాల్లో జాబిలిని చూసుకుని
మురిసిపోయి మైమరచిన క్షణాలెన్నో!
నీ ఒడిలో ఎగిసిపడే చేపపిల్లలు
వెన్నెల కాంతుల్లో మిలమిల మెరుస్తూంటే
నక్షత్రాలు నిన్ను ముద్దాడినట్టు ఉంటుంది
నీ మేనిపై నావలు సాగుతున్నపుడు
నిశ్శబ్దపు రాత్రిలో నీటిపొరల చప్పుళ్ళు
నా జ్ఞాపకాలపై మధుర సంతకాలు!

తీర ప్రజల ఆత్మవు నీవు
బంధాల చెలియలకట్ట దాటి
కడలి పరమాత్మలో లీనమవుతూ
గొప్ప జీవిత సత్యాన్ని నేర్పుతావు !

ఏర్లూ, సెలయేర్లూ, ఉపనదులనే కాదు
తీర కాలుష్యాలనూ మమేకం చేసుకునే
నీవొక సమైక్యతా ప్రతిరూపానివి
నీ గమనం ... మా జీవనం ఒక్కటే !

**- శ్రీధర్ కొమ్మోజు**

**99894 64467**



# కర్లీ హెయిర్

- ఎం.విప్లవ కుమార్
95152 25658

సెమినార్ పూర్తవగానే అజ్ఞాత్ తన సహచరులతో బస్టాండ్ వచ్చాడు.

"సెమినార్ బాగా జరిగింది. అనుకున్నదాని కంటే ఎక్కువ మంది స్టూడెంట్స్ వచ్చారు. స్టూడెంట్సే కాదు; లెక్చరర్లు కూడా బాగా ఇన్‌స్పైర్ అయ్యారనిపించింది. సెలబ్రిటీ వద్ద తీసుకున్నట్లు మీ దగ్గర విద్యార్థులు సెల్ఫీలు తీసుకోవడం మన క్యాడర్‌కు గొప్ప ఆత్మవిశ్వాసం ఇచ్చింది. నిజంగా అది నాకు కూడా కొత్తగా, గొప్పగా అనిపించింది అజ్ఞాత్." అంటూ సెమినార్‌కు సంబంధించిన ఫీడ్ బ్యాక్ ఇస్తున్నాడు మహేందర్. నవ్వుతూ తలూపాడు అజ్ఞాత్. అప్పుడే తను ఎక్కాల్సిన బస్సు ప్లాట్‌ఫారం మీదికి వచ్చింది.

"వెళ్తా.. మహేందర్" అన్నాడు అజ్ఞాత్.

"సరే.. బై బై" అంటూ సెండాఫ్ ఇచ్చాడు మహి. బస్ ఎక్కి విండో తెరిచి కూర్చున్నాడు అజ్ఞాత్.

"పక్కన ఎవరైనా ఉన్నారా?" అని అడిగి తన పక్కన పెట్టమని కర్చీఫ్ ఇచ్చింది ఓ పెద్దావిడ బయటనుంచి.

తరువాత కొంతసేపటికి ఓ అమ్మాయి ఏదో వెదుకుతూ వచ్చి అజ్ఞాత్ పక్కనే కూర్చుంది కర్చీఫ్ తీసుకుని. ఆ అమ్మాయి కర్లీ హెయిర్ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. తన ముఖంపై మొటిమెల నక్షత్రాలు అందంగా మెరుస్తున్నాయి. చీకట్లో జాబిలి అందం పెరిగినట్టు, వెన్నెల వెలుగు చిక్కనైనట్టుంది, ఆ బ్లాక్ చుడీదార్‌లో తన ఫేస్ గ్లో. ఇంతలోనే ఇంకో ఆవిడ వచ్చి తన పక్కన కూర్చోవడంతో అజ్ఞాత్‌కు మరింత దగ్గరగా జరిగింది ఆ అమ్మాయి. హెయిర్ వదిలి ఉండడంతో వైట్ షర్ట్ వేసుకున్న అజ్ఞాత్ భుజాలపై పరుచుకుంది ఓ నల్లని జలపాతంలా.

'నేనెందుకు నాస్తికున్నయ్యాను' భగత్ సింగ్ పుస్తకం తిరగేస్తున్నాడు అజ్ఞాత్.

ఆ అమ్మాయి పుస్తకంలోకే తొంగి చూస్తుంది.

బస్సు కదిలింది. ఆ కర్లీ హెయిర్ అజ్ఞాత్ మెడకు, చెవికి తాకుతోంది. ఆ అమ్మాయి వైపు తిరిగి చూశాడు.

"హాయ్ ఐయామ్ అజ్ఞాత్. మీ పేరేమిటి?"

"అశ్విని" అన్నది విరబూసిన చెట్టులా నవ్వుతూ.

"ఎక్కడికెళ్తున్నారు?"

"యాదగిరిగుట్టకు వెళ్తొస్తున్నం. మా అమ్మమ్మకు మొక్కు ఉందంటే నేనూ మా అమ్మ వచ్చినం."

పక్కనే ఉన్న వాళ్ళ అమ్మమ్మను, అటువైపు సీట్లో ఉన్న వాళ్ళమ్మను చూపించింది.

"వాళ్ళిద్దరు గుండు చేయించుకున్నారు. మీరు చేయించు కోలేదూ?" అడిగాడు నవ్వుతూ.

"అది వాళ్ళ చాదస్తం. నేనెందుకు చేయించుకోవాలి?"

"మీరు దేవున్ని నమ్మరా?"

"నమ్మను. నాకు అవన్నీ నచ్చవు. నీ చేతిలో ఉన్న హీరో లానే. నాకు భగత్ సింగ్ అంటే చాలా ఇష్టం. బతికితే ఆయనలా బతకాలి. మా నాన్నకు భగత్ అంటే ప్రాణం. ఆయన ద్వారానే నాకు ఈయన గురించి తెలుసు. నాకు భగత్ సింగ్‌ను పరిచయం చేసిన మా నాన్న ఇప్పుడు లేడు. చనిపోయాడు." అంటూ సైలెంట్ అయిపోయింది.

"సారీ అశ్వినీ"

"సరేలే. మీరేం చదువుతున్నరు అజ్ఞాత్?" అంది క్షణంలోనే మామూలైపోతూ.

"ఎమ్మెస్సీ ఫిజిక్స్"

"మరి భగత్‌సింగ్ బుక్స్ మీకెలా?"

"స్టూడెంటు ఆర్గనైజెషన్‌లో పనిచేస్తున్నాను."

"అవునా.. సూపర్"

"మీరేం చేస్తున్నారు?"

"బి ఫార్మసీ ఫైనల్ ఇయర్."

"తర్వాత ..."

"ఎం ఫార్మసీ"

"తర్వాత"

"జాబ్. నిజానికి నాకు డాక్టర్ అయ్యి గ్రామాల్లో ప్రజలకు వైద్యం చేయాలనుండే. కానీ సీటు రాలేదు. లాంగ్ టర్మ్ కోచింగులకు డబ్బులు లేక ఫార్మసీలో జాయిన్ అవ్వాల్సి వచ్చింది. అది సరే అజ్ఞాత్. మీరేం చేయాలనుకుంటున్నారు?"

"ప్రజల్ని చైతన్యం చేసే వృత్తి చేస్తున్నాను. ఇలాగే కొనసాగా లనుకుంటున్నాను."

బస్సు అక్కడక్కడ ఆగుతూ పోతుంది.

"ప్రజల్ని చైతన్యం చేసే వృత్తి అంటే?"

"అంటే.. భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం రావడం కోసం పనిచేయడం."

"ఓ... అయితే దట్స్ గ్రేట్ వర్క్. అందరూ జీతంకోసం పని చేస్తుంటే మీరు మాత్రం ఆ జీవితాలను మార్చడం కోసం పనిచేస్తున్నరు. అసలు ఈ జనరేషన్‌లో మీలాంటి వారు కలవడం చాలా ఆనందంగా ఉంది"

"నువ్వు కలవడం కూడా నాకు చాలా హ్యాపీగా ఉంది. సాధారణ అమ్మాయిలు కూడా ఎంత ప్రోగ్రెసివ్‌గా ఆలోచించ గలరో తెలిసొచ్చింది నాకు."

"లేదు .. ఈ కాలంలో కూడా నీలాంటి వాళ్ళు ఇంకా మిగిలే ఉన్నారనే నమ్మకం నిన్ను కలిశాకనే వచ్చింది. నాకు అది ఇంకా ఎక్కువ ఆనందాన్నిస్తుంది. సరే.. మా కాలేజీలో ఏమన్నా ఇష్యూస్ ఉంటే మీకు చెప్పొచ్చు కదా? ఫోను నెంబరు ఇస్తారా?"

"ఓ .. తప్పకుండా. రాసుకొండి." అని నెంబరు చెప్పాడు అజ్ఞాత్. తను నోట్ చేసుకొంది.

"అవునూ.. సహజంగా అయితే నాపక్కన మీ అమ్మమ్మ కదా కూర్చోవాలి." అడిగాడు నవ్వుతూ.

"అవును. కానీ, అలా జరిగుంటే మన పరిచయం అయ్యుండేది కాదు కదా.. మీ పేరు చాలా కొత్తగా ఉంది."

"ఇది నా పేరు కాదు. భగత్ సింగ్ పేరు. తన మిత్రులకు అజ్ఞాత్ పేరుతోనే లేఖలు రాసేవాడు. ఆయన పేరే నాకొచ్చింది."

"అవునా! ఏమైనా నీ పేరు మాత్రం చాలా బాగుంది"

"నీ కర్లీ హెయిర్ కంటేనా .."

"ఇలాంటి హెయిర్ చాలా మందికి ఉంటుంది అజ్ఞాత్. కానీ నీలాంటి పేరు నీకొక్కడికే ఉంటుంది."

"థాంక్యూ అశ్విని. మీ హెయిర్ ఏ షాంపు రహస్యం?"

"షాంపా పాడా. షాంపు పెడితే గుండే గతి. దట్ సీక్రెట్ ఓన్లీ కుంకుడుకాయ. అంతే.." అని నవ్వింది.

ఇలా సరదా విషయాలనుండి సీరియస్ విషయాల దాకా ఏవేవో మాట్లాడుకుంటున్నారు. రోడ్డుమీద చెట్ల నీడల వల్ల బస్సులో వెలుతురు సాంద్రతలు మారుతున్నాయి. వారు చర్చిస్తున్న అంశాలనుబట్టి వారి ముఖకవళికల్లో కూడా మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"వి.టి కాలనీ స్టాప్ ముందుకు రావాలె" అని కూతేశాడు కండక్టర్. సీట్లోంచి లేచింది అశ్విని. బస్టాప్ వచ్చాక– "బై అజ్ఞాత్." అని చెప్పి, అమ్మ, అమ్మమ్మలతో కలిసి బస్సు దిగిపోయింది.

◆◆◆

టౌన్‌లో అభివృద్ధి పనులు నడుస్తున్నాయి. ఏ దారిలో వెళ్ళినా పనులు జరుగుతున్న గుర్తులు కనిపిస్తున్నాయి. సగం తీసి వదిలేసిన మ్యాన్ హోల్స్ చాలా ప్రమాదకరంగా తయారయ్యాయి. వేర్వేరు సందర్భాల్లో, వేర్వేరు చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం తీసిన గుంటల్లో, మ్యాన్ హోల్స్‌లో పడి 24 మంది గాయపడ్డారు. అందులో విద్యార్థులే ఎక్కువ. పనులు త్వరితగతిన జరగడంలేదు. ఎవరూ పట్టించుకోవడం

లేదని జనాలు మాట్లాడుకుంటున్నారు. దీనిమీద స్పందిస్తే బాగుంటుందని చాలామంది అజ్ఞాత్‌ని కోరారు. దాంతో ఓ

పెద్ద మనిషి ద్వారా వాటి లోతుపాతులు స్టడీ చేసాడు అజ్ఞాత్. యువజన సంఘంతో కలిసి 'సేవ్ టౌన్ – సేఫ్ హెల్త్' నినాదంతో పనిలో పడ్డారు. ఒకపక్క మ్యాన్ హెూల్స్ దగ్గర ఇండికేషన్ బోర్డ్స్ ఏర్పాటు చేస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోపక్క వందల మ్యాన్ హెూల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, రోడ్డు పనుల్లో నాణ్యత లేమితో పాటు ప్రొసీడింగ్స్ కు విరుద్ధంగా జరుగుతున్న పనుల లోపాల్ని ఫొటోలు, వీడియోలు తీశారు. ప్రజల సంతకాలు సేకరించి విజిలెన్సు, ప్రజారోగ్య, మున్సిపల్ శాఖలన్నింటి తోపాటు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. న్యాయపోరాటం కూడా నడిపారు. సంవత్సరం పోరాటం చేసిన ఫలితంగా అప్పటివరకూ లేని విజిలెన్సు ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసును సైతం ఆ జిల్లాకు రప్పించారు. కాంట్రాక్టర్ల నుంచి కోట్ల రూపాయల ప్రజాధనం రికవరీ చేయించారు.

♦ ♦ ♦

"హాయ్ బ్రో గుడ్ న్యూస్. ఎట్టకేలకు సాధించా." అన్నాడు యువరాజు.

"ఏంటో సాధించినది" అన్నాడు సిద్ధు.

"మొత్తానికి అశ్వినీ అడ్రస్ తెలిసింది."

"నిజమా? ఎక్కడ?" అడిగాడు అజ్ఞాత్.

"చెప్పను. జస్ట్ నన్ను ఫాలో అవండి చాలు" అన్నాడు యువరాజ్.

బైక్ స్టార్ట్ అయింది. జుమ్మున దూసుకుపోతుంది.

"కలుసుకొని సంవత్సరం దాటింది అంటున్నావు. అది కూడా బస్సులో. గుర్తు పడుతుందా అజ్ఞాత్ నిన్ను. అసలు ఆరోజే చెప్పేస్తే అయిపోయేది కదా. నువ్వు ఎంత లీడర్ అని ఫీల్ అయినా యంగ్‌స్టర్ వే కదా! అది మరిచిపోతె ఎలా డ్యూడ్." అన్నాడు సిద్ధూ.

"సెటైర్లాపి జరగాల్సింది చూడండి." అన్నాడు అజ్ఞాత్.

"ఆ చూస్తాం చూస్తాం. అమ్మాయిలతో తిరగాలన్న వయస్సు కూడా మర్చిపోయి అక్రమాలు, అవినీతిని వెలికితీస్తాం అని తిరిగి అంతా అయిపోయాక అమ్మాయి కావాలి. పెళ్ళి చేసుకోవాలి. అంటే ఎలా? అసలు ఈ రోజుల్లో ఎవరు ఖాళీగున్నారో తెల్సా! సారొస్తారొస్తారు అని పాటేసుకుని ఎదురుచూస్తుందట నీకోసం. పద వెళ్దాం. సంఘం సంఘం అని నిద్రపోడం. మమ్మల్ని పోనియ్యడం.'' అని గొణుక్కుంటున్నాడు సిద్ధూ.

అశ్విని వాళ్ళింటి ముందాగింది బైక్. యువరాజు ముందు నడుస్తుండగా లోపలికి అడుగుబెట్టారు.

తొలుత తనే కనిపించి, అజ్ఞాత్ కళ్లు మెరిశాయి.

"హాయ్ అశ్విని" అన్నాడు.

"మీరూ.."

"ఆ మీరూ..." అని నవ్వుతూ కూర్చున్నారు.

"హే...రియల్లీ. నేను గుర్తుపట్టలేదు. సారీ ఎవరో చెప్పొచ్చు కదా!" అన్నది అశ్విని.

"ఇతను సిద్ధూ.. అతను యువరాజు, నేను నేనే" అన్నాడు అజ్ఞాత్.

"వాళ్ళనెప్పుడూ చూడలేదు. మిమ్మల్ని మాత్రం దగ్గరగా చూసినట్లు ఉంది. కానీ గుర్తుకు రావడం లేదు. చెప్పొచ్చు కదా!"

"మీకు తనే చెప్తాడు. మాకు పనుంది ఊర్లో. వెళ్ళొస్తాము." అని సిద్ధు, యువరాజు వెళ్ళిపోయారు.

"నన్ను అజ్ఞాత్ అంటారు. అప్పుడప్పుడు బస్ జర్నీ చేస్తుంటాను."

"సారీ సారీ... ఒకసారే కదా చూసింది. అది కూడా చాలా కాలమైంది కదా మర్చిపోయాను.'' అంటూ వాటర్ తెచ్చిచ్చింది.

"ఏంటీ సడన్‌గా మా ఇంట్లో ప్రత్యక్షమయ్యారు?"

"నిన్ను చూసి మాట్లాడి వెళ్దామని వచ్చాను"

"అసలు నన్ను చూడాలనుకోవడమేంటి?"

"నిన్నంటే నిన్ను కాదు. కర్లీ హెయిర్‌ని"

"నా హెయిర్‌ను వదలవా ఇక"

"హెయిర్ అంటే హెయిర్‌ను కాదు, దాని ఓనర్‌ని. సంవత్సరం క్రితం నీ కర్లీ హెయిర్‌లో నా కళ్ళే చిక్కుకున్నాయనుకున్నాను. కానీ కాదు. హృదయం చిక్కుకుని పోయింది. అప్పుడు తీసుకోవడం కుదరలేదు. ఇప్పుడు తీసుకెళదామని వచ్చాను."

"అజ్ఞాత్.. ఏమైంది నీకు. కవిత్వం చెబుతున్నవా? జోక్స్ ఆపి కొంచెం నాకు అర్థమయ్యేలా చెప్పవా?"

"చెప్తా" అని కాసేపాగి గట్టిగా శ్వాస పీల్చి మాట్లాడాడు.

"మనిద్దరం కలిసి బతుకుదామా అశ్విని" షాక్‌కు గురైనట్లు చూస్తోంది తను.

"అదే అశ్వినీ.. నువ్ నా లైఫ్ పార్టనర్ అవగలవా?"

కొద్దిసేపటి వరకు తేరుకోలేదు అశ్విని. తర్వాత మాటలు కలిపింది.

“అజ్ఞాత్ టీ తాగుతావా?” అని అడిగింది.

“నీ చేతితో ఏమిచ్చినా తాగుతాను. కానీ అది ఇప్పటి వరకేనా? లైఫ్ టైమా? అనే క్లారిటీ ముందు ఇచ్చి, ఆ తర్వాత ఏమిచ్చినా పరవాలేదు.”

టీ చేసుకొచ్చింది.

“డియర్ కామ్రేడ్ టీ” అన్నది.

“అడిగినదానికి ఆన్సర్ చేయకుండా ఈ కమ్మటి టీ కలిపావు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో!” అంటూ దీర్ఘం తీశాడు.

“ఎల్లుండి సాయంత్రం 5 గంటలకు లైబ్రరీకి వస్తాను. అక్కడ మాట్లాడుకుందాం అన్ని విషయాలు.” అంది.

“సరే వెళ్ళొస్తా” అని చెప్పి బ్రిడ్జ్ దగ్గర ఉన్న టీ స్టాల్‌లో టీ తాగుతున్న సిద్ధు, యువరాజు ఉన్న దగ్గరకొచ్చాడు అజ్ఞాత్. పక్కన పాలిటెక్నిక్ కాలేజీ స్టూడెంట్స్ సిగరెట్లు కాల్చుతున్నారు. వాళ్ళు వదులుతున్న పొగ రింగులుగా తిరుగుతోంది. అజ్ఞాత్ అటువైపే చూస్తున్నాడు. ఇంతలో యువరాజు కలుగజేసుకున్నాడు.

“అజ్ఞాత్.. ఆ స్టూడెంట్స్‌ని ఏమనకు. సిగరెట్లు చాలా ప్రమాదమైనవని కాబట్టి, అవి ఉండకూడదని కాల్చుతున్నామని చెప్పారు. ఇందాక సిద్ధు అడిగినప్పుడే.” అని నవ్వుతున్నారు.

♦ ♦ ♦

గుండె గడియారం సెకన్ల ముల్లు కంటె స్పీడుగా కొట్టుకుంటుంది. కానీ గోడ గడియారం సెకన్ల ముల్లు మాత్రం గంటల ముల్లు కంటే కూడా స్లోగా కదులుతున్నట్లనిపిస్తుంది. తను ఆలోచించుకోవడానికే ఎల్లుండివరకు అని టైం అడిగి ఉంటుంది. పైగా లైబ్రరీకి వస్తున్నదంటే నీకు తగిన అమ్మాయే. అని ఇంకా ఏవేవో మాట్లాడుతున్నారు సిద్ధు, యువరాజు. అందులో కొన్ని మాత్రమే అజ్ఞాత్‌కు వినిపిస్తున్నాయి. ఎందుకంటే తను తన లోపలి ప్రపంచంలో ఉన్నాడు. అశ్విని సూటిగా మాట్లాడే మనిషి. తన మనస్తత్వం ప్రకారం అప్పటికప్పుడే ఏ నిర్ణయమైనా తేల్చి చెప్పాలి. కానీ అలా జరగలేదంటే ఏదో కారణం ఉండాలి. అశ్వినిని కలిసినప్పుడు కూడా చీకటిని కాటుకలా దిద్దుకున్న తన కళ్ళకి, వెన్నెలకు పూచినట్టుండే తన పెదాలు మాట్లాడే మాటలకు అస్సలు సింక్ అవ్వలేదు. కళ్ళు దగ్గరగా, మాటలు దూరంగా చూసాయని ఆలోచిస్తున్నాడు. అజ్ఞాత్ మనసు లోతు, ప్రేమ గాఢత ... సిద్ధు, యువరాజులకు బాగా తెలుసు. అందుకే అజ్ఞాత్ కంటే వాళ్ళే ఎక్కువ టెన్షన్ పడుతున్నారు.

చెక్స్ షర్ట్ బ్లాక్ ప్యాంట్ వేసుకుని, టక్ చేసుకుని ఓ దేహం నడుస్తుంది. తనని అలా చూసిన ప్రతివారికి తనో సైనికుడిలానో, కమాండర్‌లానో అనిపిస్తాడు. లైబ్రరీలో సైన్ చేసి పేపరు పట్టుకున్నాడు. ఇంతలోనే బ్యాగ్ వేసుకుని అశ్విని వచ్చి సైన్ చేసి అజ్ఞాత్‌ను చూస్తుంది. ఇద్దరూ కలిశారు. నిశ్శబ్దంగా పలకరించుకున్నారో లేదంటే నిశ్శబ్దమే పలకరింపులా ఉన్నదో! కానీ ఇద్దరి మధ్యలో మాత్రం ఓ శతాబ్ద నిశ్శబ్దమేదో దాగి ఉన్నట్లున్నది. ఒకరిననుసరిస్తూ ఒకరు లైబ్రరీ ముందున్న గ్రాస్‌లోకి నడిచి కూర్చున్నారు.

అశ్విని తన ముందు భద్రంగా బ్యాగును పెట్టుకుని కూర్చుంది. అందులో పిన్ లీవ్ చేసిన గ్రెనేడ్ ఏదో ఉన్నట్టు పదే పదే బ్యాగ్ వైపు ప్రత్యేకంగా కనిపెడుతున్నది.

“అశ్వినీ.. నిన్నొకటడగనా?”

“అడుగు అజ్ఞాత్”

“మీ ఇంటికొచ్చి నేను ప్రపోజ్ చేసినప్పుడు నీ కళ్ళకి మాటలకి సింక్ అనిపించలేదు. అవును కదా?”

“అవును”

“ఎందుకు?”

“ఎందుకేంటి అజ్ఞాత్? అసలు నువ్వు నాకోసం వస్తావని, అలా మాట్లాడతావని కలలో కూడా అనుకోలేదు. అలా రావడం, అలాంటి ప్రపోజల్ చేయడం నిజమా కలా! నేను నమ్మలేకపోయాను చాలాసేపటి వరకు. అంతా అయోమయంగా అనిపించింది. చాలా గర్వంగా, ఒకింత ఆనందంగా, మరింత బాధగా ఉంది అజ్ఞాత్. అసలిన్ని రోజులు ఏమైపోయావు? నాకు చాలా కోపమొస్తుంది తెలుసా? ఊపిరి కూడా ఆడట్లేదు. ఇంకొన్ని రోజుల ముందొస్తే నీ సొమ్మేమన్నా పోయేదా? నీతో కలబడాలనిపిస్తుంది. అసలు నువ్వు రాకుంటే ఎంత బాగుండునో. నువ్వు రావడం వల్ల జీవితాంతం నిన్ను తిరస్కరించాననో, కోల్పోయాననో బాధపడేలా చేస్తున్నావు. ఇదంతా జరగలేదని మర్చిపోయే మెడిసిన్ ఏదైనా ఉంటే చెప్పు” అంటూ అజ్ఞాత్ పై ఏదో హక్కుతో కూడిన కోపాన్ని ప్రదర్శిస్తుంది.

‘‘అశ్వినీ... కొంచెం కూల్‌గా మాట్లాడుతావా

అర్థమయ్యేలా..."

"చెప్తాను. చెప్పక చస్తానా. నేను నీకు సంవత్సరం కిందినుంచి మాత్రమే తెలుసు. కానీ నువ్వు మాత్రం నాకు నాలుగు సంవత్సరాల క్రితమే తెలుసు. ప్రొగ్రెసీవ్ కాలేజీలో మీరు మోడల్ ఎంసెట్ ఎగ్జామ్ కండక్ట్ చేసినప్పటి నుంచే. ఆ రోజు నువ్వు పోటీ పరీక్షలనెలా ఎదుర్కోవాలో, మనుషులు తన బ్రెయిన్ ఎంత శాతం వాడుకుంటున్నారో, ఈ విద్యావ్యవస్థ పోటీ పరీక్షల పేరుతో ఎడ్ల పందాలు నిర్వహిస్తుందని సెటైరికల్‌గా మాట్లాడావు గుర్తుందా! ఆ రోజు నుంచే నువ్వు తెలుసు నాకు. ప్రతిరోజు నిన్ను న్యూస్‌లో చూసేదాన్ని. నిన్ను కలవడం ఎలాగో అర్థమయ్యేది కాదు. కానీ, గొప్ప అవకాశంగా బస్సు ప్రయాణం దొరికింది. అందుకే నీ పక్కన కూర్చున్నాను. నువ్వేంటో ఇంకా అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను. అప్పుడు నీ దగ్గర తీసుకున్నది ఆఫీస్ ఫోన్ నంబర్ అనుకుంట. ఎప్పుడూ నువ్వు ఏదో ఊరెళ్ళావని చెప్పేవారు. ఫోన్ చేసీ చేసీ అలసిపోయాక, అంతా అయిపోయాక నువ్వు ఇంటికొచ్చావు. అందుకే కావాలనే కోపంతో మీరెవరని అడిగాను. నీ కోసం నువ్వు బతకడం కాకుండా ప్రజలకోసం బతికేతనం, జనంకోసం జైళ్లకు కూడా పోవడానికి వెనుకాడని గుణం. అన్నింటికి మించి భగత్ సింగ్ మార్గంలో నీ పనితనం. ఇవన్నీ నాకు చాలా ఇష్టం. ఈ సమాజంలో ఏ అమ్మాయి కయినా తన కుటుంబాన్ని వదిలి నీలాంటి వారితో జీవితాంతం నడవడానికి మించిన అవకాశం ఏముంటుంది? కానీ మనం ఒక జీవితకాలం లేటున్నాము అజ్ఞాత్." అన్నది భారంగా.

తన కనురెప్పల హృదయం ధమనులూ సిరల వలె నిశోదయాలను వడబోస్తున్నది. తన మాటల చప్పుడు గతమూ, వర్తమానాల కాలంతో నిరాయుధంగా యుద్ధం చేస్తున్నది. రెండు నిజాల మధ్య ఉన్న ఉచ్వాస నిశ్వాసల ఈక్వేషన్ ఆలోచనల తీరంలో పోటెత్తుతున్నది.

"నీకు తెలుసు కదా మా నాన్న లేదు. మా కుటుంబ పరిస్థితులు కూడా బాగోలేవు. అందువల్ల కలవని నీకోసం సాకులు చెప్తూ ఎక్కువ కాలం మావాళ్ళను ఆపలేకపోయాను. ఇన్నాళ్ళు మమ్మల్ని పట్టించుకోని మా మేనమామల చొరవతో చాలా ప్రత్యేక పరిస్థితుల్లో నా పెళ్ళి కుదిరింది." అంటూ అజ్ఞాత్ చెయ్యిని తన చేతుల్లోకి తీసుకుని గట్టిగా పట్టుకుంది. ఇన్నేళ్ళ తన జ్ఞాపకాలను, కలలను ఒక్కొక్క బొట్టు చేసి కన్నీళ్ళలా కార్చుతుంది. అజ్ఞాత్ కూడా ఏం చేయాలో అర్థం కాక, మాటలు రాక మైనపు ప్రతిమలా ఉన్నాడు. అశ్విని బ్యాగ్‌లో నుంచి పెళ్ళి కార్డు తీసి అజ్ఞాత్ చేతిలో పెట్టి "ఐ మిస్ యూ డియర్ కామ్రేడ్' అంటూ వెళ్ళిపోయింది. ■

## తలంటు

గీకిన ఐస్ మీద రంగు నీళ్ళు పోసి
పుల్లతో ఐస్ ఫ్రూట్ అమ్మిన
తోపుడు బళ్ళు కూడా కనబడడం లేదు
ఓ గుప్పెడు మంచు గడ్డని కరిగించి
దోసిట్లో మంచినీళ్లలా తాగుదామనుకుంటే

ఎగసిపడే రుద్రజ్వాలలు తలంటుతున్నాయి !
ఒక్కో బాంబు ఒక్కో భాషని, ఒక్కో భావాన్ని
ఒక్కో జన సమూహాన్ని ఖననం చేస్తుంది!
క్షీర సాగర మధనంలో అదనపు విలువ అమృతమై కూర్చుంది
నర మేధ యుద్ధ వేదంగా అమలవుతుంది !

దేశాల రహదారులన్నీ రక్షా బంధనాల కోసం,
తాయెత్తుల కోసం ఒకటే పరుగు !
కవీ నిన్నెవరూ పెళ్లాడ్డం లేదు
రహదారి పక్క నిలువు బండ రాయి మీద
అడ్డగా కొలువైన బండ రాయి
అడవి నుంచి ఓ స్త్రీ తల మీద
కట్టెల మోపుతో వస్తున్నట్టు అనిపించిందని నీవు చెప్పినా
ఉదయానికి ఓ మల్లె మొగ్గ విడినా
కాలుష్యాన్ని ఖాతరు చేయనక్కర్లేదనీ నీవు చెప్పినా –
ఈ నగరం గడ్డ కట్టిన కాశ్మీర్ దాల్ సరస్సు అని
పాలపొంగు లక్ష్మి వెంట పరుగెడుతున్నారు యువజనం అని,
కుక్కలు లేని వీధులుంటాయా అని అంటున్నావని
కయ్యాలమారి కాదు కవి, గాయాల మర్రి కవి,
కవిత్వం ఓ ముడి ఖనిజం అని అంటున్నావని –
కవీ నిన్నెవరూ పెళ్లాడ్డం లేదు !

'పుట్టినప్పుడూ యుద్ధమే పెరిగినప్పుడూ సంగ్రామమే
పాటుబడ్డప్పుడూ పోరే
విశ్రాంతి కోరుకునే సమయంలో కూడా
నిరంతర యుద్ధగాన ప్రదర్శనలే' అన్న
జ్ఞాపకాలే గదా తలలో గూడు కట్టుకుంటున్నాయి!
కవీ నిన్నెవరూ పెళ్లాడ్డం లేదు!
అర్జెంట్ ఆపరేషన్ సమయాల్లో
అవయవాలని ఆసుపత్రుల్లో అందజేయడానికి
ఏర్పడ్డ గ్రీన్ చానెల్స్ నడవల నడకలని
నడవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు
కవీ నిన్నెవరూ పెళ్లాడ్డం లేదు!

**- ఒబ్బిని**
**9849558842**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : పిల్లా కుమార స్వామి

**1. శుక సప్తతి కావ్యాన్ని రాసిన కవి**

ఎ. అత్యాలరాజు నారాయణకవి బి. కదిరీపతి సి. ఆనందకవి డి. దిట్టకవి

**2. 'విజయవిలాసం' రచించిన కవి**

ఎ. తెనాలి రామకృష్ణ బి. కృష్ణదేవరాయలు సి. ముద్దుపళని డి. చేమకూర వెంకటకవి

**3. రాయల సభామంటపం పేరు**

ఎ. త్రిభువనం బి. భువన విజయం సి. నవరత్నం డి. సాహితీక్షేత్రం

**4. శ్రీ కృష్ణదేవరాయలు రాసిన కావ్యం**

ఎ. పారిజాతాపహరణం బి. ఆముక్తమాల్యద సి. కళాపూర్ణోదయం డి. వైజయంతీవిలాసం

**5. శ్రీనాథుని క్రీడాభిరామం**

ఎ. వీధినాటకం బి. కావ్యం సి. శృంగారకావ్యం డి. వీరకావ్యం

**6. కాళ హస్తీశ్వర శతకం రాసిన కవి**

ఎ. మారన బి. ధూర్జటి సి. నృసింహకవి డి. బద్దెన

**7. భాస్కర శతకం రాసిన కవి**

ఎ. సూరన బి. గోపన్న సి. మారన వెంకయ్య డి. చౌడప్ప

**8. గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కంలో ప్రసిద్ధి చెందిన వేశ్య పాత్ర పేరు**

ఎ. చింతామణి బి. మధురవాణి సి. మంజులవాణి డి. కలహంస

**9. 'కలకంఠి కన్నీరొలికిన సిరి ఇంట నుండ నొల్లదు' అన్న కవి**

ఎ. బద్దెన బి. వేమన సి. గురజాడ డి. చలం

**10. 'తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియబట్టి" అని నిరసన వ్యక్తం చేసిన కవి**

ఎ. చిలకమర్తి లక్ష్మీనరసింహం బి. సుబ్రహ్మణ్యభారతి సి. దాశరథి డి. గురజాడ

**11. 'ఏనుగు నెక్కినాము, ధరణీంద్రులు మ్రొక్కగా నిక్కినాము" అంటూ సగర్వంగా ప్రకటించిన వారెవరు?**

ఎ. అల్లసాని పెద్దన బి. తిరుపతి వెంకటకవులు సి. వేములవాడ భీమకవి డి. మారన వెంకన

**12. వికటకవి గా పేరొందిన కవి**

ఎ. చౌడప్ప బి. వేమన సి. భర్తృహరి డి. తెనాలి రామకృష్ణ కవి

**13. ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షర రమ్యత నానారుచిరార్థసూక్తి లక్షణాలతో రాసిన కవి**

ఎ. తిక్కన బి. శ్రీకృష్ణదేవరాయలు సి. ఎర్రన డి. నన్నయ

**14. 'కప్పి చెప్పేవాడు కవి విప్పి చెప్పేవాడు విమర్శకుడు' అని చెప్పినదెవరు?**

ఎ. సినారె బి. శ్రీశ్రీ సి. చలం డి. రారా

**15. ప్రకృతి కనుకరణమే కవిత్వమని చెప్పినవారెవరు?**

ఎ. ప్లేటో బి. అరిస్టాటిల్ సి. సోక్రటీస్ డి. మిల్టన్

**16. కళలన్నీ ప్రకృతి నేర్పినవే (నేచర్ టాట్ ఆర్ట్) అని చెప్పినదెవరు?**

ఎ. ప్లేటో బి. అరిస్టాటిల్ సి. మిల్టన్ డి. కట్స్


**17. 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి :' (ప్రపంచానికి అధిపతి కవే) అన్న అలంకారికుడు**

ఎ. ఆనందవర్ధనుడు బి. భామహుడు సి. భాసుడు డి. ముమ్మటుడు

**18. శతకం అనగా**

ఎ. నూరు పద్యాలు బి. యాభై పద్యాలు సి. ఒక పుస్తకం డి. అలంకారికం

జవాబులు : **1. బి 2. డి 3. బి 4. బి 5. ఎ 6. బి 7. సి 8. బి 9. ఎ 10. ఎ 11. బి 12. డి 13. డి 14. ఎ 15. బి 16. సి 17. ఎ 18. ఎ**




# స్వయం ప్రకాశ చిత్రకారుదు రాజా రవివర్మ

- గనారా
99492 28298

ఇది ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ జీవిత చిత్రానికి అద్భుతంగా పట్టం కట్టిన నవల. రచయిత మోహన్ సమర్థతకు, గొప్ప ఊహాశక్తికి నిదర్శనం ఈ రచన. ఈ కథ మొదలయ్యే సమయానికి ఈస్టిండియా కంపెనీ చరిత్ర ముగిసింది. బ్రిటిష్ వారు తమ పాలన స్థిరపరచుకున్నారు. అనేక సంస్థానాలు స్వాధీనం చేసుకున్న కాలం అది. కేరళలో తిరుచానూరు రాజ కుటుంబం అప్పటికింకా మాతృస్వామిక వ్యవస్థలోనే ఉండేది. ఆ వంశంలో ఆడపిల్ల లేకపోతే దత్తత తీసుకునే ఆచారం కూడా ఉంది. దత్తత సోదరి పెదరాణి లక్ష్మిబాయి. రవివర్మ అక్కడే పుట్టాడు. ఆ దివాణానికి రాజు 'అయిర్యం'. రవివర్మ భవిష్యత్తుకు బాటలు పడ్డాయి. కేరళవర్మ రవివర్మని తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర వహించాడు. బాల్యంలో అందరు పిల్లలలాగే కనిపించిన గోడలపై సుద్దముక్కలతో బొగ్గులతో పిచ్చిపిచ్చి గీతలు గీస్తూ తన మార్గాన్ని తానే చూసుకున్నాడు రవి. రంగుల్లో రంగయ్యాడు. చిత్రకళతోపాటు సాహిత్యంపై పట్టు సాధించి చందస్సు నేర్చుకున్నాడు. సంస్కృతం, మలయాళంపై పూర్తి అవగాహన ఏర్పడింది. అతని అభివృద్ధిలో పెద్దరాణి లక్ష్మిబాయి తోడ్పాటు ఎంతో ఉంది.

అతడికి 19 ఏళ్లు రాగానే 13 ఏళ్ళ భాగీరథితో వివాహం అయింది. మానేవికార దివాణానికి అల్లుడయ్యాడు. భాగీరథి, మాధవి బాల్య స్నేహితులు. కలిసిమెలసి పెరిగారు. భాగీరథి అలంకారాలతో కూడిన అందం తప్పితే సహజ సౌందర్యం కాదు. భాగీరథి చిత్రం వేయడానికి ప్రయత్నిస్తే, ఆమె తిరస్కరించింది. అప్పుడు మాధవి చిత్రం వేయడానికి చాలా ప్రయత్నించాడు. విముఖత చూపిస్తూనే అతని ఆకర్షణలో పడింది మాధవి.

'ప్రేమలు, వియోగాలు, అసూయ దాచేస్తే దాగేవి కావు. రవి తనని సహజంగానే కోరుకుంటున్నాడా!'

కొంతకాలం మాధవి తప్పించుకు తిరిగింది.

"తప్పించుకు తిరుగుతున్నావేం? అలకా?"

"నాకెందుకు అలక, నేనేమన్నా మీ భార్యనా?"

చిత్రకారుల్లో ఉండే సహజ సౌందర్య ఆరాధన ఆమె చిత్రాన్ని గీసేందుకు దోహదం చేసింది.

రాజదర్బారులో ఉండే కుట్ర రాజకీయాలు చిన్నప్పటి నుంచీ తెలిసిన మాధవి అనేక జాగ్రత్తలు తీసుకుంది. సౌందర్య ఆరాధన అని, అతనికి ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తను ఎన్ననుకున్నా, ఎవరు ఎన్ని చెప్పినా వాటి పునాది దేహమే అని భావిస్తారు.

మదరాసు టౌనుహాలులో చిత్రకళా ప్రదర్శన జరిగింది. రవి వేసిన మాధవి చిత్రంపై సందర్శకుల దృష్టి పడింది. చిత్రకారుడు ఎవరై ఉంటారా అని తెలుసుకోవాలని అక్కడ ఆతృత. ఆ చిత్రానికి బంగారు పతకం వచ్చింది. పత్రికలు ప్రత్యేక వ్యాసాలు రాశాయి. మదరాసు ప్రెసిడెన్సీ కళా ప్రపంచంలో రవి పేరు మారుమోగింది. ఆ తరువాత రవి జీవితకాలం వెనుదిరిగి చూడలేదు. రాజప్రసాదాల్లో, జమీందార్ల బంగ్లాలోనే కాక ఆంగ్లేయుల భవనాల్లో కూడా రవి చిత్రాలు నిండిపోయాయి. రవి విజయంలో తమ్ముడు రాజవర్మ పాత్ర ఎంతో ఉంది. తను ఎప్పుడూ అన్న వెన్నంటే ఉన్నాడు.

రవి సంతానంలో పెద్దవాడు చెడు వ్యసనాలకు, స్నేహాలకు అలవాటు పడ్డాడు. ఈ విషయమై భార్య భాగీరథికి రవివర్మకు

మధ్య విభేదాలు పొడచూపాయి.

"తిని కూర్చోవడానికా, మనిషి జన్మ ఎత్తింది?" అన్నాడు రవి.

"లేదు. పిచ్చి బొమ్మలు వేసుకుంటూ, ముష్టివాళ్ళలా దేశం పట్టుకుని తిరగడానికి, ముండలతో కులకడానికి"

"నోర్మూయ్. ఎవరు కులికారు?"

"మళ్ళీ ప్రత్యేకంగా చెప్పాలా?"

"నువ్వు చూశావా?"

"నీ బొమ్మలే చెబుతున్నాయి"

రవిలో కళాతృష్ణని గమనించనివారు నిందలు వేయడానికి వెనుకాడలేదు. అయినప్పటికీ రవి తన ప్రయాణం ఆపలేదు.

'కిళిమానూరు'లో రవికి సంగీత సాహిత్యాలతో రోజులు గడుస్తున్నా, మనసులో కొడుకు ప్రవర్తనను తట్టుకోలేక పోయాడు. సువిశాలమైన భారతదేశం తిరగాలని నిశ్చయించు కున్నాడు రవి.

'చరాచర ప్రకృతి మనిషి భౌతికావసరాలను తీర్చడంతో పాటు అతని భావనా ప్రపంచానికి కావలసిన ధాతువులనూ సమకూరుస్తుంది. కల్పనకు పంచభూతాలు ఆసరా ఇస్తాయి. ఒక పువ్వును మనిషి కేవలం ఒక పువ్వుగానే ఊహించలేడు. తనకు తెలిసిన రంగూరూపాలను, పరిమళాలను, కాంతులను అతిశయంతో జత చేశాడు. ఒక వనితను, ఒక భావోద్వేగాన్ని, ఒక పదచిత్రాన్ని బొమ్మ కట్టేటప్పుడూ అంతే! అంతర్నిహిత స్రవంతులు బాహ్యజగత్తులోకి నానా వర్ణాకృతులను, సంరంభా లను జత చేసుకొని సృజనతో సంగమించి సయ్యాటలాడ తాయి.'

హంస అనే పక్షిని మన పురాణాల్లో చెపుతారు కానీ దాని రూపం ఎలా ఉంటుందో ఊహించడానికి లేదు. రవివర్మ దమయంతి చిత్రంలో హంసను చూసినవారికి హంస అంటే ఇదే అనే విధంగా చిత్రం ఊహల్లో నిండిపోయింది. రవివర్మ చిత్రించిన దమయంతి అద్భుతమైన చిత్రం.

రవి బొంబాయి ప్రయాణం సాగించాడు. జోషి అనే మిత్రుడితో పూనా చిత్రశాలకు వెళ్ళాడు. అక్కడ లితోప్రెస్‌కు వెళ్ళి దేవతా చిత్రాలు చూశాడు.

గమ్యం చేరడానికి గమ్యం లేని ప్రయాణం సాగింది. వ్యక్తాన్వేషణలో ఆత్మకాన్వేషణ కూడా కొనసాగింది. బృందా వనం, ఉజ్జయిని, మధుర, హస్తినాపురం చూశాడు. సుమారు నాలుగు నెలల ప్రయాణం. అనేక పుస్తకాలు చదివితే కానీ దేవుళ్ళ రూపాలను ఊహించటం సాధ్యం కాలేదు.

శివపార్వతుల కుటుంబ, యశోదాకృష్ణులు, సీతారామ కల్యాణం, సీతా అపహరణం, శ్రీరామ పట్టాభిషేకం, రాధాకృష్ణులు, గజేంద్రమోక్షం, కాళీమర్ధనం, నానా దేవతలు, అందగత్తెలు అనేకానేక చిత్రాలు రవి వేయడంతో మార్కెట్లో విశేషమైన ఆదరణ లభించింది. ప్రతి ఇంటిలో రవివర్మ వేసిన దేవుళ్ళ చిత్రాలతో నిండిపోయాయి.

రవి యాత్రలో అనేక పట్టణాలు తిరిగాడు. ప్లేగు బారిన పడకుండా జాగ్రత్త పడ్డాడు. అనేకానేక రుగ్మతలు జయించాడు. ఏ ప్రాంతానికి వెళ్ళినా, రాజుల, సంస్థానాధీశుల వ్యాపారుల ఆదరణ పొందాడు. ప్రముఖులు ఆయనతో చిత్రాలు వేయించు కోవడానికి వారు తహతహలాడుతూండేవారు. బ్రిటిష్ పాలకు లు సైతం ఆయన వర్ణచిత్రాల పట్ల ఆసక్తి ప్రదర్శించేవారు. నేడు జమీందారుల ఇళ్ళలో పాత పెయింటింగులు, శిథిలమైనప్పటికీ వారి వైభవాన్ని చూస్తాం. రవి చేత చిత్రపటం గీయించుకొని, వారి పూర్వ స్థితిని మనకు తెలియజేస్తారు.

'స్వీయబుద్ధికి లోకరీతికి పొంతన కుదరదు'. పరమల్ చిత్రాలు గీయలేదు, లాభసాటిగా కూడా కనిపించలేదు.

తమ్ముడు రాజావర్మ నవలలు, చరిత్ర పుస్తకాలతో మల యాళీ సమాజం స్థితిగతులపై ఆంగ్లంలో వ్యాసాలు రాసే పనిలో పడి అన్నకు అందని మరో ప్రపంచంలో గడిపాడు.

'సంచార ప్రాణుల సహజ స్వభావం మనిషే కాదు, తిర్యగ్జంతువులకు కూడా కాలు బయటపెడితేనే మనుగడ. తిండి కోసం, సంపద కోసమే కాదు, సమస్త దాహాలూ తీర్చు కోవడానికీ, భావాల్లో, మాటల్లో, కదలికల్లో... సారాంశంలో జీవితరంగ భూమిపై నిరంతరం, నవ నవోన్వేషంగా పురి విప్పి నర్తించడానికీ సంచారం అనివార్యం.'

రాజావర్మ ప్రయాణంలోనే సుస్తీ చేసింది. రవి అతణ్ని మదరాసు చేర్చి కడుపులో పుండుకు శస్త్రచికిత్స చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. తమ్ముడు రాజావర్మ భౌతికంగా రవికి దూరం అయ్యాడు. రవివర్మ మానసికంగా ఒంటరి వాడయ్యాడు. శారీరక శక్తి క్షీణించింది. బ్రిటిష్ చక్రవర్తి పలు రంగాలకు చెందిన ప్రముఖులకు 'కైజర్-ఇ-హింద్' ప్రకటిం చింది. రవికి 1904లో ఇచ్చారు.

కురాళం జలపాతంలో ఔషధ గుణాలు ఉన్నాయని తెలిసి అక్కడ శాశ్వతంగా ఉండిపోవాలని తలచాడు. అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించాడు. రవివర్మ డయాబెటిక్ అని డాక్టర్లు నిర్ధారణ చేశారు. క్రమంగా శక్తి కోల్పోయాడు. అయినా పెయింటింగ్ మానుకోలేదు. దివాణం లో స్థిరపడ్డాడు. బంధువులు, మిత్రులు అంతా అక్కడే ఉ న్నారు. రవి అనారోగ్యం గురించి దేశం అంతా తెలిసి పోయింది. చుట్టుపక్కల ఊళ్ళ నుంచే కాకుండా డాక్టరు బాలచంద్ర, మతాయ్, శ్రీరామ్ పంత్, కేశవజోషి బొంబాయి,

మద్రాసు నుంచీ వచ్చారు. ప్రాంతీయ, దేశీయ, విదేశీయ పత్రికా లేఖకులు చేరుకున్నారు. శ్వాస అందక ఛాతీ ఎగిసిపడింది. నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు. కొసల్లోంచి రెండు నీటి చుక్కలు రాలాయి. ముఖంలో వేదన తొలగి ప్రశాంతత ఆవరించింది. వాకిట్లోంచి చల్లగాలి రివ్వున లేచింది. ప్రాణదీపం ఆరిపోయింది.

♦ ♦ ♦

రచయిత పి.మోహన్ ఎంతో శ్రమకోర్చి పరిశోధన చేసి అనేక వ్యాసాలు, డైరీలు సేకరించి, అనేకమంది ప్రత్యక్ష పరోక్ష పరిచయస్తులతో ఇంటర్వ్యూలు నిర్వహించి, అసమానమైన ఓర్పుతో రాజా రవివర్మ జీవితానికి నవలారూపం ఇచ్చారు. మోహన్ ఆయన రచనాశైలి కుంచెతో చిత్రించినట్లు కనిపిస్తుంది. కవి కానీ, చిత్రకారుడు, చరిత్రకారుడు కానీ తను చూసే వ్యక్తుల్ని తెలుసుకున్న నాడు ప్రగాఢంగా తనపై ముద్ర వేస్తారు. వారినుంచీ తప్పించుకోవడం సాధ్యం కాదు. వాళ్ళు ఆ రచయితను వెంటాడి విసిగించి తమ సంగతి తేల్చుకుంటారు. అలా మోహన్ పాఠకుల ముందు రవివర్మను తీసుకువచ్చాడు. అందరూ చదవాల్సిన నవల ఇది. ■

## సృజనప్రియ కవితల పోటీ ఫలితాలు

**సృ**జనప్రియ మాస పత్రిక రజతోత్సవ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీ ఫలితాలను ఏప్రిల్ 28వ తేదీన ప్రకటించారు. మొదటి బహుమతిని 'చీకటి ముఖం' – సాంబమూర్తి లండ, ఒంకులూరు; రెండవ బహుమతిని 'వలస దుఃఖం' కలమట దాసుబాబు, శ్రీకాకుళం; మూడవ బహుమతిని 'ఉల్లిపువ్వు–ఊరునవ్వు' వేముగంటి మురళి గెలుపొందినట్టు నిర్వాహకులు తెలిపారు. 'నువ్వు లేవు' – చొక్కాపు లక్ష్మునాయుడు; యుద్ధం ఇంకా ఒడువలేదు– రవీంద్రసూరి నామాల, 'శేష వస్త్రం'– దేశరాజు; 'జన్మించడమే కవిత్వం'–శైలజామిత్ర; 'రంగుల కంబళి'– డాక్టర్ డి వి జి శంకర రావులకు ప్రత్యేక బహుమతులు ప్రకటించారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే పత్రిక రజతోత్సవాల్లో బహుమతి ప్రదానం ఉంటుంది. కవితల ఎంపికలో న్యాయ నిర్ణేతలుగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ కోయి వెంకటేశ్వరరావు, ఎం.నారాయణ శర్మ వ్యవహరించారు.

– **నీలం దయానందరాజు**, సంపాదకులు,
సృజనప్రియ, 93467 90689

## చివరి గది

**ఈ** గది చాలా చిన్నది
ఒక మంచమే దాని ప్రపంచం

ఏ మారుమూలనో పాతికేళ్ళ ఊపిరికి
ఉరితాడు వేలాడినపుడు
వెక్కి వెక్కి ఏడ్చే కలలకి తుళ్ళిపడి లేస్తుంది
'అల్మిహాన్ సెయిటీ' గదిలోకి చొరబడగానే
టైం మిషీన్ లాంటి మంచం మీంచి
వెనక్కి వెళ్ళిన శతాబ్దం కాలానికి
ఆకాశవాణి సంగీతం చాలని తీర్మానించుకుంటుంది
బూరగుపల్లి సీతమ్మ కళ్ళముందు తళుక్కుమనగానే
ఖాళీ చేతుల్ని కిటికీ బయటకు పెట్టి
డిసెంబర్ నెల చలిగాలుల్లోంచి
పచ్చని వెచ్చని మనిషి శ్వాసను ఆహ్వానిస్తోంది

అప్పుడెప్పుడో చెమ్మగిల్లిన కళ్ళు నిమ్మచెట్టు కింద
కార్చిన కన్నీటిని దాచుకున్న పత్రాల్లో వెతుక్కొని
గది నదిలా గంభీరమైపోతుంది

మెంటాడ గైరమ్మ గదిలో మెదిలితే చాలు
ఎనభైల్లోకెళ్లి మగ దౌష్ట్యాన్ని ఒంటరిగా ఛేదించే
ఉక్కు మహిళ రూపమై
నిక్కబొడిచిన రోమాలతో నిలబడుతుంది

ఏ రోజుకారోజు వయసు మంచుకొండ ఢీకొనే గది
ఏ క్యాప్రేస్ సెక్యూరిటీకి సంకేతాలు పంపని
టైటానిక్ షిప్‌లా మారి
నిద్ర సముద్రంలోకి మునిగిపోతుంది

ఎప్పటిలాగే మరసటి రోజు కూడా
రావాల్సింది వస్తుందేమోనని సిద్ధపడుతుంది

ఒక్క రోజు వాయిదా చాలు
మళ్ళీ
ఆ గది గోడ మీద జీవితం
చలన చిత్రంలా పున: ప్రదర్శించబడుతుంది!

**- పాయల మురళీకృష్ణ**
9441026977



# తెలుగు కథలకు ఇంగ్లీషు పేర్లా ?

- మొలకలపల్లి కోటేశ్వరరావు
99892 24280

**కొం**తమంది రచయితలు మంచి భావాలతో మంచి తెలుగు కథలు రాసారు. రాస్తున్నారు. అయితే వాటికి ఇంగ్లీషు శీర్షికలు పెట్టి ఆ కథల విలువ కొంత వరకూ తగ్గించుకుంటున్నారు. ఇంగ్లీషు రచయితలు ఎవరైనా కథలు రాసి వాటికి తెలుగు పేర్లో, తమిళం పేర్లో, మలయాళం పేర్లో పెడితే ఎంత అర్థరహితంగా వుంటుందో ఇదీ అలాగే వుంది.

ఈ నాటికీ మన సమాజంలో నూటికి 40, 50 మంది నిరక్షరాస్యులుగానే వున్నారు. అక్షరాస్యుల్లో కథలు చదివేవాళు ్ళ, అంటే సాహిత్యాభిలాష కలిగిన వాళ్ళు నూటికి ఒకరో, ఇద్దరో వుంటారు. ఇక వాళ్ళలో ఆంగ్లం చదివేవాళ్ళు, ఆ కథల శీర్షికని అర్థం చేసుకునే వాళ్ళు ఎంతమంది? కథకి ఇంగ్లీషు పేరు పెడితే, ఆ భాష బాగా రాని ఎంత మంచి పాఠకుడికైనా ఆ కథ చదవాలని వెంటనే అనిపించదు. కథ పేజీ తిప్పి మరో శీర్షికలోనికి వెళ్ళి పోతాడు. అది ఎంత మంచి కథ అయినా చదవడానికి మొదట్లో ఆసక్తి కలగదు.

వ్యాపార రచయితలు వేరు. వాళ్ళు బడాయికీ, డాంబికానికీ తమ కథలకీ, నవలలకీ ఇంగ్లీషు పేర్లు పెడుతుంటారు. అది ఆకర్షణ కోసమనో, పాఠకాదరణ పొందుతుందనో వాళ్ళ ఉ ద్దేశ్యం కావచ్చు. ప్రజా రచయితలు, ప్రజల పక్షం వహించి ప్రజలకి మేలు కలగాలనే ఒక అంకితభావంతో రచనలు చేసేవాళ్ళు తమ కథలకి ఇంగ్లీషు పేర్లు పెట్టడమే ఇబ్బందికరం.

ఎంతో మంచి కథలు రాసిన పాత తరం రచయితలు ఎవరూ కథలకి ఇంగ్లీషు పేర్లు పెద్దగా పెట్టలేదు. శ్రీ పాద సుబ్రమణ్య శాస్త్రి 76 కథలు రాసారు. ఆ కథలు మొత్తంలో ఆయన ఒక కథకి మాత్రమే ఇంగ్లీషు పేరు పెట్టారు. అది 'లీగల్ అడ్వైస్ '. మరో కథకి పోలీసు అని పేరు పెట్టారు.

పోలీసు, పోస్టు మ్యాను, రైలు, ఇంటర్వ్యూ, స్టేషనూ, మీటింగూ, పంపూ, ఇంటర్నెట్, ఫోనూ లాంటి ఇంగ్లీష్ పదాలకి సమానార్థకమైన తెలుగు పదాలు దాదాపు మరుగునపడి పోయాయి. లేదా లేవు. ఒకవేళ ఎవరైనా వీటి తెలుగు పదాలు మాట్లాడితే కఅతకంగా వుంటుందేమో! పోలీసుని 'రక్షక భటుడు' అని ఎవరైనా అంటారా? అంటే జనం నవ్వుతారు. అలాగే రైలుని పొగబండి అంటే ఎబ్బెట్టుగా వుండదూ? ఇంగ్లీషు అన్య భాషా పదాలని తనలో ఎలా ఇముడ్చుకుందో అలాగే తెలుగులో కూడా ఇంగ్లీషు పదాలు కొన్ని అంతర్భాగమై పోయాయి. అలాంటి పదాల్ని (పై మాటల్ని ) ఈ వ్యాస పరిధి మేరకు నేను తెలుగు మాటలుగానే పరిగణించి లెక్కలోకి తీసుకోలేదు. అందుకే శ్రీ పాద రాసిన పోలీసుని నేను ఇంగ్లీషు శీర్షికగా పేర్కొన లేదు. నిజానికి శ్రీ పాద ఇంగ్లీషుని అంతగా ఇష్టపడక పోగా ద్వేషించాడు కూడా! అయితే ఆయన మీద సంస్కృత ప్రభావం అధికంగా వుంది. ఆయన కథల పేర్లు కొన్ని : 'అపిదళిత వజ్రస్య హృదయమ్', 'యావజ్జీవ హెూష్యామీ', 'షట్కర్మయుక్తా', 'శుభికే! శిరఆరోహ' , 'కన్యాకాలేయత్నాద్వరితా '. సంస్కృతంలో పెట్టిన ఈ కథల శీర్షికలే గాకుండా, ఆయన కథల్లోనూ అక్కడక్కడా సంస్కృత పద బంధాలూ, పదాలూ తారసపడతాయి.

గుంటూరు జిల్లా శ్రామికుల, రైతుల, కష్ట జీవుల బాధల్నీ, వేదనల్నీ, జీవిత ఘర్షణల్నీ అద్భుతంగా, అత్యంత ప్రతిభా వంతంగా పామర భాషలో అక్షరీకరించిన మా.గోఖలే 50 కథలు రాసారు. వాటిలో ఒక్కటి కూడా ఇంగ్లీషు పదం లేదు. అన్నీ తెలుగు శీర్షికలే. అవి కూడా గుంటూరు మాండలికంలోనే వున్నాయి. పెల్లాం బూసిమ్మ, సీకటి పొత్తు, పాలెంలో దీపాలమాశ, పెల్లి, ఆరికేం మారాజులు, పులిస్రాకులు, పల్లె గూడెం కాడ, మనసు పుట్టుద్ది, అడక్క దినక సేసేదేంది ..

శీర్షికలు ఇలా వున్నాయి.

ఇదే జిల్లాకి చెందిన త్రిపురనేని గోపీచంద్ 105 కథలు రాసారు. వాటిలో రెండు కథల పేర్లు కథకి 'క్లయిమాక్స్', 'పుష్' అనే చొరవ. ఈ రెండు కథల పేర్లలో వచ్చిన ఇంగ్లీషు పదాల్ని రచయితే కొటేషన్స్‌లో పెట్టారు. అంటే, అవి అన్య భాషాపదాలు అనే కదా ఆ కొటేషన్స్ భావం. మిగతా 103 కథల పేర్లూ తెలుగులో వున్నాయి.

చలం 98 కథలు రాసారు. ఆయన కథల్లో రెండు కథలకి ఇంగ్లీషు శీర్షికలు వున్నాయి. అవి : వాణీ ఏ స్టడీ, ఆర్గుమెంట్.

ఆత్మీయత లాంటి మంచి కథలు రాసిన అందే నారాయణ స్వామి కథలు అన్నీ తెలుగు పేర్లతోనే వున్నాయి. వాసిరెడ్డి సీతాదేవి 50 కథలు రాసారు. (మా. గోఖలే, సీతాదేవి వాళ్ళ సమగ్ర రచనల సంపుటాల్లో వాళ్ళ కథలు కచ్చితంగా 50 వున్నాయి.) ఈ రచయిత్రి కథల్లో మూడు కథల పేర్లు : మిసెస్ కైలాసం, జాక్ పాట్, మిస్టర్ ముకుందం.

విరసం ప్రచురించిన కొడవటిగంటి కుటుంబ రావు సమగ్ర రచనల సంకలనాల్లో నా దృష్టికి వచ్చిన కథలు మొత్తం 254. ఆయన 330 కథలు రాసినట్లు ఆ పుస్తకాల సంపాదకులు లెక్క తేల్చారు. అందులో 280 సేకరించినట్లుగా వాళ్ళ ముందుమాట చెపుతోంది. అయితే 254 మాత్రమే నా పరిశీలనలో కనిపించాయి. అందులో 7 కథలకి ఇంగ్లీషు శీర్షికలు వున్నాయి. అవి : 32 డౌన్ క్రాసింగ్, ఎక్స్ ట్రా, సినిమా స్టార్, ఫాలౌట్, బ్లాక్ మార్కెట్, ఫోర్త్ డైమన్షన్, ట్యూషన్. ఇక ఈ రచయితే రాసిన దిబ్బ కథలు 12, గొలుసు, దిబ్బ కథలు కలిపి 6, హపూర్వ హపరాధ పరిశోధక కథలు 16, శాస్త్ర విజ్ఞాన కల్పన కథలు 3. ఇవి మొత్తం 37. వీటిలో డిటెక్టివ్ అనే పదం తప్ప ఇక అన్నీ తెలుగు పేర్లే. గల్పికలు 73 రాసారు. వాటిలో ఫారిన్ కొలాబరేషన్ ఒక్కటే ఇంగ్లీష్ శీర్షిక. మిగతా 72 గల్పికలకీ తెలుగు పేర్లే వున్నాయి. నాటికలు 19 రాసారు. అన్నీ తెలుగు పేర్లు తోనే వున్నాయి.

ఇక చాసోగా ప్రసిద్ధి చెందిన చాగంటి సోమయాజులు మొత్తం కథల్లో మూడు పేర్లు ఇలా వున్నాయి : జంక్షన్లో బడ్డీ, ఫారిన్ అబ్బాయి, ప్రెసిడెంట్ లక్ష్మీకాంతం. ఫారినూ, జంక్షనూ, ప్రెసిడెంటు ఇవి దాదాపు తెలుగు పదాల్లోనే కలిసి పోయాయి. మిగతా శీర్షికలన్నీ చక్కటి తెలుగు మాటలతోనే వున్నాయి.

కె.ఎన్. వై. పతంజలి 44 కథలు రాసారు. వాటిలో 'అడల్ట్ స్టోరీ' ఒక్కటే ఇంగ్లీష్ శీర్షిక. రాచకొండ విశ్వనాధశాస్త్రి కథలు నేను చూసినవి 43. వీటిలో 'ది స్మోకింగ్ టైగర్' అను పులి పూజ, బేడ 'ట్రాజడి', మొదటి నెల జీతం 'జాస్మిన్'. ఈ మూడు కథలకీ సగం ఇంగ్లీషు, సగం తెలుగు పదాలతో వున్న శీర్షికలు వున్నాయి. వీటిలో ఇంగ్లీషు పదాల్ని రచయిత కొటేషన్స్‌లో పెట్టారు. కాళీపట్నం రామారావు 53 కథలు రాసారు. వాటిలో 'నో రూం', 'ఫ్లాట్ ఫారమో' ఇంగ్లీషు పేర్లతో వున్నాయి. మిగతావన్నీ తెలుగు శీర్షికలే.

'నేను రాయలసీమకు చెందిన ఒక గ్రామీణ రచయితని' అని చెప్పుకున్న మధురాంతకం రాజారాం వందల కథలు రాసారు. అప్పుడు కొన్నీ, అప్పుడు కొన్నీ నేను చదివిన కథలు 180. వీటిలో 7 కథలకి ఇంగ్లీషు పేర్లు వున్నాయి. అవి : స్పాట్ లైట్, గ్రూప్ ఫోటో, యమర్జెన్సీ, సర్వీసు రిజిష్టరు, లెస్ లగేజీ మోర్ కంఫర్ట్, మిస్ ఎమరాల్డ్ ఫ్రమ్ ఫ్రాన్స్, కార్టూన్.

ఇవి కాలం చేసిన రచయితల కథల వివరాలు. వీళ్ళు చాలా అరుదుగా, అతి తక్కువగా కథలకి ఇంగ్లీషు పేర్లు పెట్టారు. వర్తమానంలోనికి వస్తే కొందరు రచయితలు కథలకే కాదు, తమ తెలుగు కథల సంకలనాలకి కూడా ఇంగ్లీషు పేర్లు పెడుతున్నారు.

అంపశయ్య నవీన్ రాసిన 23 కథలతో ఒక సంకలనం వచ్చింది. ఆ పుస్తకం పేరు 'ఫ్రమ్ అనూ రాధ, విత్ లవ్'. ఈ సంపుటిలో మరో రెండు కథలకి ఇంగ్లీషు శీర్షికలు వున్నాయి. బ్లాస్ట్ బ్లాస్ట్, ట్యూషన్ మేష్టారు అనేవి. మిగతా 20 కథలకీ తెలుగు పేర్లే వున్నాయి. మరి కథకుడు ఈ సంపుటికి ఇంగ్లీషు పేరు పెట్టాడు.

జొన్నవిత్తుల శ్రీ రామ చంద్రమూర్తి కథలతో ఒక సంకలనం వచ్చింది. ఇందులో మొత్తం 16 కథలు. వీటిలో చాలా మంచి కథలు వున్నాయి. మంచి స్త్రీ వాద కథ 'వంజ'. పేద దళిత, వెనుక బడిన వర్గాల విద్యార్ధుల తిరుగుబాటు స్వరంతో 'పంచన్ లామా'. ఇలా 16. వీటిలో ఒకటి మినహా అన్ని కథలకీ తెలుగు శీర్షికలే! ఒక్క కథకే ఇంగ్లీషు పేరు. అది 'ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్'. పుస్తకానికి ఈ కథ పేరు పెట్టారు. అడపం, వైతరణి, సిద్ధుల మర్రి, బిత్తల బోకి, తెలుగు పతాకం. సంపుటిలోని కథల్లో ఇవి కొన్ని. వీటిలో ఏ పేరు పెట్టినా ఎంతో బాగుండేది. రచయిత ఏరికోరి ఇంగ్లీష్ శీర్షికతో రాసిన కథ పేరు పెట్టారు సంపుటికి. వివిన మూర్తి 'వాల్ పేపర్' పేరుతో ఒక సంకలనం తెచ్చారు. పుస్తకానికి పెట్టిన కథ పేరు మినహా సంపుటిలోని ఇతర కథలు అన్నిటికీ తెలుగు శీర్షికలే! ఎంతో మంచి కథలు , గొప్ప కథలు రాసిన డా. గీతాంజలి తన కథల సంకలనానికి పెట్టిన పేరు 'హస్బెండ్ స్టిచ్'. ఈ పేరుతో రెండు సంకలనాలు వెలువరించారు. రెండో సంకలనానికి 'హస్బెండ్ స్టిచ్ 2' స్టోమా అని పేరు పెట్టారు.

నేను ఈ వ్యాసం రాస్తూ కొన్ని పుస్తకాల్నీ, కథల్నీ పరిశీలించాను. రచయితల కంటే రచయిత్రులే కథలకి ఎక్కువగా

ఇంగ్లీష్ శీర్షికలు పెట్టారని నాకు అనిపించింది. అంటే రచయిత్రులకి ఇంగ్లీష్ భాషాభిమానం లేదా ఆ భాష వ్యామోహం ఎక్కువగా వుందా?

ఇవి చూడండి : పి.సత్య వతి : సూపర్ మామ్ సిండ్రోమ్, పేపర్ వెయిట్; బీకే.వరలక్ష్మి : గేప్, లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్; ఆర్.శశికళ : డ్రాపవుట్, స్కూల్ ఫస్ట్, బై మిస్టేక్; ఎం.ఆర్. అరుణ కుమారి : టచ్ మి నాట్, ఐ లవ్ ఇండియా, కేర్ కేర్; ఎస్.జయ : బ్లాంక్ చెక్; కవిని ఆలూరి : ఫ్రమ్ అడ్రస్, ఎలక్షన్ డ్యూటీ; వాడ్రేవు వీర లక్ష్మీ దేవి : బి వేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్, పేరెంట్; ముదిగంటి సుజాతా రెడ్డి : వైరస్, బ్రెయిన్ డ్రెయిన్; కుప్పిలి పద్మ : వాటర్ ఫ్రంట్, వే టు మెట్రో, కవర్ పిక్, నో ఎగ్జిట్, ఫూలింగ్, ది లాస్ ఆఫ్ ఇన్నోసెన్స్, మదర్ హుడ్ ఏ రియాల్టీ చెక్, సెకండ్ హస్బెండ్, బ్రేకప్ బొకే, ఇన్‌స్టెంట్ లైఫ్, విడిఆర్ఎల్, క్యూట్ గర్ల్; జి.లక్ష్మి : థర్డ్ ఆప్షన్, డి.లీట్, రూట్ కెనాల్; సి.సుజాత : కండీషన్డ్ ప్లాంట్, త్రీ ఇన్ వన్, స్మైల్స్ ఫర్ సేల్; చంద్రలత : రిమోట్ కంట్రోల్, కొలీగ్స్, స్పెసిమన్; సాహితి (ఎస్.శ్రీ దేవి) : లివింగ్ టు గెదర్; పసుపులేటి గీత : ట్రోజన్ హార్స్ ... రచయిత్రులు పెట్టిన కథల పేర్లు ఇవి.

రంగనాయకమ్మ గారు 84 కథలు రాసారు. వాటిలో 22 కథల ప్రచురణని ఆపేసారు. పునర్ముద్రణ ఆపేసిన వాటితో కలుపుకుని మొత్తం 84. ఇన్ని కథల్లోనూ ఒక్కటంటే ఒక్క కథకి కూడా ఇంగ్లీషు పేరు లేదు. అన్నీ తెలుగు పేర్లు.

మగవాళ్ళు తమ కథలకి ఇంగ్లీషు పేర్లు పెట్టలేదని కాదు. మగవాళ్ళు కూడా తమ కథలకి ఆంగ్ల శీర్షికలు పెట్టారు. రచయిత్రులే తమ కథలకి ఎక్కువగా ఇంగ్లీషు పేర్లు పెట్టారని నేను పరిశీలించిన పుస్తకాల నించి నాకు కలిగిన అభిప్రాయం.

ఈ రచయిత్రులు అందరూ కూడా తెలుగు రాష్ట్రాలలో వున్నవాళ్ళు. వీళ్ళు రాసిన ఈ కథలు అన్నీ దాదాపుగా తెలుగు సమాజానికీ, తెలుగు కుటుంబాలకీ, తెలుగు నేలకీ, తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలకీ, ఆచార వ్యవహారాలకీ, అలవాట్లకీ, తెలుగు వాళ్ళ వ్యక్తిత్వాలకీ సంబంధించినవి. తెలుగు రాష్ట్రాలలో వున్న వీళ్ళు తెలుగు కథలకి ఇంత ఎక్కువగా ఇంగ్లీష్ పేర్లు పెట్టారు కదా! మరి ప్రవాస భారతీయ రచయితలు రాసిన కథలు కూడా చూద్దాం!

ఆరి సీతారామయ్య 14 కథలతో 'గట్టు తెగిన చెరువు' కథా సంపుటిని వెలువరించారు. ఇందులో రెండు కథల నేపథ్యం భారత దేశం. మిగతా 12 కథలూ అమెరికా జీవితాలూ, అక్కడి చదువులూ వాటికి సంబంధించినవే. ఈ 14 కథల్లో 'థ్యాంక్స్.. మామ్!' పేరుతో ఒక్క కథ మాత్రమే ఆంగ్ల శీర్షికతో వుంది. తెలుగు మాతృభాష కాని ఒక అమెరికన్ పిల్లవాడు వాళ్ళ అమ్మకి చెప్పిన సందర్భం. ఆ కథకి ఆ శీర్షిక పెట్టడమే సరైనది. మిగతా 13 కథలూ తెలుగు పేర్లతోనే వున్నాయి. 'కేన్యా టు కేన్యా' పేరుతో ఈ రచయితే రాసిన మరో సంపుటిలో 15 కథలు వున్నాయి. ఇందులో ఒక్క కథ మాత్రమే మన దేశ నేపథ్యంలో రాసింది. రెండు ఇండోనేషియాకి చెందినవి. మిగతా 12 కథలూ అమెరికా జీవితాలకి సంబంధించినవే! ఈ 15లో 3 కథలకి ఇంగ్లీషు శీర్షికలు వున్నాయి. అవి : లైఫ్ సైన్స్, టెస్ట్, కేన్యా టు కేన్యా.

మరో ప్రవాస రచయిత జె.యు.బి.వి. ప్రసాద్ రెండు కథా సంకలనాలు తెచ్చారు. ఒక దాంట్లో కొన్ని వ్యాసాలు కూడా వున్నాయి. 'ఆ కుటుంబంతో ఒక రోజు' సంపుటిలో 20 కథలు వున్నాయి. ఇందులో 10 అమెరికా నేపథ్యంలోనూ, 10 కథలు ఇండియా నేపథ్యంలోనూ రాసినవి. ఈ 20 కథల్లోనూ ఒక్క కథకి కూడా ఇంగ్లీషు శీర్షిక లేదు. అన్నీ తెలుగు పేర్లే. ఈయనదే మరో కథల, వ్యాసాల సంకలనం 'పెళ్ళాల పులి'. ఇందులో 8 కథలు వున్నాయి. 3 ఇండియా జీవితాలకీ , 4 కథలు అమెరికా జీవితాలకీ, ఒక కథ అమెరికాలో వున్న కొడుక్కి ఇక్కడి విశేషాలతో అమ్మ ఉత్తరం రాయడం. ఈ కథల్లో ఒకదానికి మాత్రమే ఆంగ్ల శీర్షిక వుంది. అది 'మదర్స్ డే'. ఈ డే మన సంస్కృతి కాదు. బాగా ముదిరి పోయిన అమెరికన్ పెట్టుబడి దారీ సమాజం సరుకులు అమ్ముకోవడానికి రకరకాల డేలు సృష్టిస్తుంది. ఫాదర్స్ డే, వాలైంటైన్స్ డే, థ్యాంక్స్ గివింగ్ డే .. అలాంటిదే మదర్స్ డే! అమెరికాలో వున్న మనవాళ్ళు ఈ డే జరుపుకోవడం గురించి రాసిన కథ. మదర్స్ డేని తెలుగులో రాయాలంటే అమ్మల రోజు అనో, తల్లుల దినం అనో, అమ్మల దినం అనో రాయాలి. అది వికారంగా, అసహ్యంగా వుంటుంది. తెలుగు శీర్షిక పెట్టాలని ఒక నియమం పెట్టుకుని మరో పేరు పెట్టి వున్నట్లయితే ఈ కథ జీవమూ, పరువూ పోయేది. మదర్స్ డే అని పేరు పెట్టడమే ఈ కథకి బలమూ, న్యాయమూ!


సాయి బ్రహ్మానందం గొర్తి రాసిన 25 కథలతో 'సరిహద్దు' సంకలనం వచ్చింది. ఇందులో ఇండియా నేపథ్యంలో 12 కథలూ, అమెరికాకి చెంది 12, కెనడా నేపథ్యంలో ఒక్క కథ వున్నాయి. అన్నీ మంచి కథలే. వీటిలో ఒక్క కథకి కూడా ఇంగ్లీష్ శీర్షిక లేదు. 25 తెలుగు శీర్షికలతో వున్న కథలే. మరో రచయిత కన్నెగంటి చంద్ర 'మూడో ముద్రణ' సంపుటిలో 22 కథలు వున్నాయి. ఇందులో 7 అమెరికా, 15 ఇండియా జీవితాలకి సంబంధించినవి. అన్నీ తెలుగు పేర్లతో వున్న కథలే.

'సిలికాన్ లోయ సాక్షిగా' పేరుతో డా.కె.గీత రాసిన 18 కథలతో ఒక సంపుటి వచ్చింది. (ఈమె కథా రచయిత్రి

కె.వరలక్ష్మి గారి కూతురు ) ఇందులోని 18 కథలు వరుసగా : 1. స్పానిష్షు – ఉష్షూ 2. వర్క్ ఫ్రమ్ హోం 3. డిపెండెంటు అమెరికా 4. కాలేజీ కథ 5.డ్రైవింగ్ – లైసెన్స్ 6.ఫుడ్డు – వేస్టు ఫుడ్డు 7. హోం లెస్ 8. ఇల్ హెల్త్ –ఇన్సూరెన్సు 9. సింగిల్ మామ్ 10. ఓపెన్ హౌస్ –1 . 11. ఓపెన్ హౌస్ –2 . 12.లాప్ టాప్ కథ –1. 13. లాప్ టాప్ కథ –2 . 14. లివ్ ఎ లైఫ్ 15. చైల్డ్ కేర్ 16. రిపేర్ ఇన్ అమెరికా 17. ఫీనిక్స్ 18. అమీగాస్. ఇందులో తెలుగు శీర్షికతో వున్న కథలు ఎన్ని? కనీసం ఒక్కటైనా వున్నదా? పాఠకుడి చెంతకి కథ వేగంగానూ, సులభంగానూ చేరాలంటే తెలుగు శీర్షికతోనే వుండాలి. అప్పుడే పాఠకుడు పేజీ తిప్పకుండా మరో కథలోనికి పోకుండా ఆగిపోయి అది చదివే తరువాత కథలోనికి వెళ్ళి పోతాడు. నిన్నటి తరం రచయితల గొప్ప కథలూ, మంచి వస్తువుతో, మంచి భావాలతో రాస్తున్న నేటి తరం రచయితల కథలూ మనకి ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

తప్పనిసరి అయితేనూ, నిత్య జీవితంలో వాడే పదం అయితేనూ, తెలుగు భాషలో కలసి పోయిన పదం అయితేనూ, బలం చేకూరుతుందనుకుంటేనూ అనివార్యమైన పరిస్థితిలోనే కథకి ఇంగ్లీషు శీర్షిక పెట్టవచ్చు. అయితే తెలుగు కథకి తెలుగు పేరు పెట్టడమే సమంజసమూ, సమర్థనీయమూ, సహేతుకమూ, సరైనదీనూ! తెలుగు శీర్షికతో వుంటేనే నిస్సందేహంగా పాఠకుడు ఉత్సాహంగానూ, ఆసక్తిగానూ, ఆనందంగానూ కథని ఆస్వాదిస్తూ చదివి ఆలోచిస్తాడు. పాఠకుడు కథని చదివాడూ అంటే ఆ రచయితా, రచయిత్రీ లక్ష్యం పూర్తిగా నెరవేరినట్లే కదా! ■

> "ఎన్ని విశేషణాలు, క్రియా విశేషణాలు వాడినా, నేను తిన్నగా 'మనిషి గడ్డిపై కూర్చున్నాడు' అని సాదాగా రాసినప్పుడే చక్కగా అర్థమవుతుంది."
>
> - చెకోవ్



## నవ్వు

**న**వ్వితే మర్చిపోయిన బాల్యం కానరావాలి
నవ్వుకెంత శక్తి వుందో!
శిశువు పెదాలపై చిగురించే గోరంత నవ్వు
అమ్మ కళ్ళలో దీపాలు వెలిగిస్తుంది
ఇద్దరి మధ్య మాటల్లేని మౌనం
గోడల్లే పెరిగినప్పుడు
నవ్వు చేసే మంత్రంతో మాయమౌతుంది
ఆకాశం కేసి చూసి చూసి
అలసిన కళ్ళకు ఆహ్లాదంగా
నల్లటి మేఘం కనిపించినప్పుడు
రైతు పెదాలపై విరుస్తుందో నవ్వు
మురిసిపోయి కురిసిన వర్షం
పంటచేను పచ్చటి నవ్వవుతుంది
ఒక అపార్థాన్ని మాయం చేసేందుకు
నవ్వు మందులా మారుతుంది
దూరాన్ని దగ్గర చేసేందుకు
గుండెల్లోంచి నవ్వు మొలకెత్తాలి
యాంత్రికమైన జీవనంలో ఏరుకునేందుకు
కొన్ని క్షణాలు కావాలంటే
అప్పుడప్పుడు పెదాల పైన
నవ్వులు పూసే సమయాలు రావాలి
మనసు అద్దంలో
నవ్వు మసకబారకుండా చూసుకుంటే
బతుకు బాటలో కన్నీరు కూడా
పన్నీరుగా మారుతుంది!

- డా. పాతూరి అన్నపూర్ణ
94902 30939



# ఇరవై ఏళ్ల కల

- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి
7382301101

**రా**త్రి ఒగ్గంట దాటింది. ఇంట్లో లైట్లు ఆర్పలేదు. నేనూ మా నాయనా మిద్దిపైన పడుకోనుండాం. ప్రతి అయిదు నిమిషాలకొకసారి మా నాయన ఆ డొక్కు సెల్లులో టైం చూసుకుంటా వుండాడు. ఇంకా వస్తుందేమో ఇంకా వస్తుందేమో నని. అయినా రావట్లేదు. ఏదో తెలియని భయం... ఏం తప్పు చేస్తున్నామనో ఏమో?

ఎంతసేపటికీ నిద్ర పట్టట్లేదు. ఇటు చలికాలమూ గాదు, అటు ఎండాకాలమూ గాదు. దుప్పటి కప్పుకుంటే ఉడుకు, తీస్తే సలి. దానికి తోడు సీటీగలు. ఏదో గుబులు మా నాయన్ని పట్టి పీడిస్తూనే ఉన్నట్లుండాది. నేను మా నాయన్ని చూస్తానే ఉండాను. సరిగ్గా ఏ పక్కా ఐదు నిమిషాలు గూడా పడుకోలేదు. ఇంతలో ఎంతనొక్కినా పంజేయని ఆ సెల్లుని పక్కనేసి 'తొమ్మిన్నరకే వస్తుందన్నాడే ఏమైనట్లు, చౌడేపల్లి గూడా దాటేస్నామన్నారు. ఒగసారి ఫోన్ జెయ్యి చిన్నోడా.. యాడోస్తాండారో అడగదాం' అన్నాడు. నేను ఫోన్ చేసి మా నాయనకిస్తే కొంచేపటికి, 'హలో యాడోస్తాండారబ్బా ఇంగా రాలేదే' అన్నాడు.

'ఒచ్చేస్తాండాంనా... సోమల్లో పెట్రోలు కొట్టిచ్చు కుంటాండాము, ఒచ్చేస్తాంలే' అని అవతల నుండి వినపడగానే 'సరే నాయనా భద్రంగా రండి' అని ఫోన్ పెట్టేస్తూ, 'ఏంపాడు నాశనమో ఏమో.. మన బతుకు మనం బతకాలన్నా ఒగడి దయాదాచ్చిన్యాలపైన ఆధారపడినట్టుండాది ఈ ముండ బతుకు. ఎప్పుడు బయట పడతామో ఏమో' అంటూ నిట్టూర్సినాడు.

'ఏం నాయనా అట్లంటాండావు. ఏం జరిగింది' అన్నాను.

'నీకు తెలీదురా చిన్నోడా. నువ్వొచ్చింది తెల్లారేగదా, ఈడ చానా జరగతా వుండాయిలే. కన్న బాధలూ పడి ఇరవైయేండ్లు కడుపుగట్టుకొని రేయింబగుళ్ళు ఆ మట్టి పిసుక్కుంటూ జమచేసిన డబ్బుల్తో మనం ఒక బోరు ఏసుకొని, ఎవుని కాళ్ళూ పట్టుకోకుండా బతుకుదామనుకున్నామా. అయితే ఇబ్బుడు అది యాడ జరగనిస్తాండారు రా ఈ నాయాండ్లు. యాడ బన్నోని కండ్లన్నీ మన్నేత్తిమీదనే నాట్యం జేస్తావుంటే ఏం చేసేది చెప్పు'.

'కొంచెం ఇలావరిగా చెప్పు నాయనా.. ఏం అర్థంగాలా' అన్నాను.

'ఇందులో అర్థం కాకపోవడానికి ఏముందిరా... ఆ రాజారెడ్డి ఉండాడు కదా, మనూరి పెద్దల్లో ఒక పెద్ద. ఎవురి పెద్దలకి ఈళ్ళు పెద్దో నాకు తెల్దు గానీ ఈ పెద్దలకు నా...' అంటూ ఏదో మనసులో నాకు ఇనపడకుండా గొనిగినాడు. తరవాత 'ఒగరి బోరు పక్కన ఇంగొగరు బోరెయ్యగూడదంటరా. ఒగేల ఏసినా నూరో ఇన్నూరో అడుగుల దూరం ఉండాలంట. అట్లా కాదని బోరేస్తే ప్రభుత్వం కూడా శిక్షిస్తుందంట. రూల్స్ అంట రూల్స్. ఈనమ్మ రూల్స్. సన్నాబన్నోల్లకే ఈ రూల్స్ అన్నీ, కలిగినోల్లకు యాడుండాయి ఈ రూల్స్. మన చేన్లో మనం బోరు ఏసుకోడానికి కూడా ఇన్ని ఆక్షేపనలేందో'. 'మనం చేన్లో బోరు పాయింటు పెట్టించింది ఎవురెగేసినారో ఏం పాడు నాశనమో ఈ విషయం అబ్బుడే ఊరు ఊరంతా పాకిపోయి ఆ రాజారెడ్డి చెవిలో గూడా పడింది. ఇదేమన్నా ఇచిత్రం పనా ఏందీ'.

'తెలిస్తే తెలీనీలే నాయనా.. ఇబ్బుడేమైంది'

'ఏమయ్యేదేందిరా.. బుడతల చింతమాను కాడ చేనులో రోడ్డుకు పడమరగా మనం బోరు పాయింటు పెట్టించినాం

కదా.. అయితే రోడ్డుకు తూరుప్పక్కంతా పదెకరాలు ఆయనదే కదా. అదే మనూరి పెద్దల్లో ఒగ పెద్ద. ఎవురి పెద్దలకి ఈళ్ళు పెద్దో నాకు తెల్దు గానీ ఈ పెద్దలకు నా...' అంటూ మళ్లా ఏదో గొనిగి, 'ఆయన భూమిలో ఒక బోరు ఉంది. ఆ బోరుకు ఇబ్బుడు మనం పెట్టించిన పాయింటు దగ్గరనేలే. ఆడ మనం బోరు ఏస్తే వాళ్ళ బోరులో నీళ్ళు ఆగిపోతాయంట. అందుకని మనకు బోరు బండి వచ్చి బోరు ఏసే రోజుకి వాళ్ళొచ్చి అడ్డుకుంటారంట' అన్నాడు.

'అట్లేందుకు చేస్తాడులే నాయనా. ఎంతైనా పెద్నాయనే కదా'

ఆ మాటకి మా నాయనకి యాడగాలిందో ఏమో, 'వాళ్ళ గురించి నీకేం తెలుసురా. ఇరవై ఏండ్లనుండి వాళ్ళతో ఎన్నెన్ని పడతా వుండానో నీకేం తెలుసు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు, మనమా అందరూ ఉన్నా ఒంటిగాల్లమే. పక్కోడు బాగుపడితే చూసి ఆనందించేటోడు ఒగడూ లేడు. మొన్నటికి మొన్న నువ్వు అదేందో చదవాలని యూనివర్సిటీలో చేరడానికని డబ్బుల్లేకపోతే మనోల్లందరికాడికీ కాల్లరిగేదాకా తిరిగితే మతించేటోడు ఒగరూలె. చివరికి ఉన్న ఒగ కుంటావుని అమ్ము కోవాల్సి వచ్చింది. ఇబ్బుడేందో చెప్తాండావ్. పెద్నాయనంట పెద్నాయన. వరసకు పెద్నాయనే అయితే మాత్రం ఏంజేద్దాం. తీరా బోరుబండి వస్తే ఏమంటారో ఏమో...' అంటూ నన్ను చడామడా ఏసుకున్నాడు.

'ఒకసారి టైం ఎంతో చూడరా చానాసేపయ్యింది. యాడొస్తాండారో ఏమో?' అని అంటుండగానే ఇంతలో ఫోన్ వచ్చింది.

'నోవ్ రామిరెడ్డన్నా.. బండి మూడ్డాములకుంట దాటిం దంట బిన్నా రానా' అని వినపడింది. నాయనా నేనూ ఆదరా బాదరా సాపాదిండూ అన్నీ ముదరజుట్టి, గబగబా కిందికి దిగి, అమ్మని లేపి, మేము చేనుకాడికిబయల్దేరి ఇంటిముందుకి వచ్చేసరికి, మానాయన ఏదో గొనుక్కుంటూ చేతిలైటేసి తారాడతా వుండాడు. ఏంది నాయనా తారాడతాండావే అంటే 'ఈ ముండ కుక్కలు ఒగట్లైనా జాతీనైంది ఉందా... తూ... ఈటెమ్మా, రోజూ రాత్రిల్లో నాకిదే పనైపోయిందే' అన్నాడు. మళ్ళా ఏంది నాయనా అంటే 'అవాయ్ చెప్పుల్రా, ఈ కుక్కలు యాడ పడేసినాయో ఏమో. పడేస్తే పర్లేదు వాటెక్క కొరికి పడేసింటే మళ్ళా వాటికోసం యాడ తొంభై రూపాయలు పెట్టేది. సర్లే పదా. వాటికోసం ఈన్నే ఉంటే బండి ఒచ్చేస్తుంది. చేన్లో గెనాలూపాడూ బండిటైర్లకు తగులుకోకుండా చూడాల. ఆ సందులో గడ్డపార, పార ఉంటాయి తీసుకొనిరా పదాం' అన్నాడు.

నేనూ మానాయనా చేనుకాడికి పోయి బండికోసం ఎదురుజూసుకోనుండాము. నాకేమో అంత నడిరాత్రిలో అట్లా రోడ్డుపక్కన నిలబడుకోనుంటే ఎందుకో బయమేస్తా ఉంది. రోడ్డుమీద వచ్చే బండ్లలైట్లు నేరుగా నాకళ్ళల్లో పడతా ఉంటే, అవి రోడ్డు మీద పోతాండాయ లేదా నామీదకే వస్తాండాయ అనేటట్లు ఎదురుగ్గా ఏమీ కనబడకుండా ఉంది. ఇంతలో ఒక లారీ హారన్ వేసుకుంటూ వచ్చి నా పక్కనే ఆగింది.

మా నాయన వాళ్ళతో ఏదో మాట్లాడిన తరవాత బండి నేరుగా పాయింటు దగ్గరికి పోయింది. బోరు బండాయన ఒక చిన్న గులకరాయిని తీసుకొని మూడడుగుల ఎత్తులో నుండి ఒకరాయిని బోరుబండి పైపు దిగే దగ్గర నుండి వదిలాడు. అది నేరుగా పాయింటుకి గుర్తుగా పెట్టుకున్న కనికిరాయి మీద పడింది. సరిగ్గా ఉందిలే అనుకున్నాక మళ్ళీ ఒగటికి రెండుసార్లు సరిజూసుకొని బండిని ఎగుడు దిగుడు లేకుండా సమంగా పెట్టి, 'మాకింగా ఒగ అరగంట పడుతుంది. ఈలోగా పూజ అట్లాంటిదేదో చేసేడిగా ఉంటే చేసుకోండినా' అని చెప్పివాళ్ళ సరంజామానంతా సిద్ధం చేసుకుంటుండారు.

మా నాయన చెంబుడు నీళ్ళతో బోరు పాయింటు దగ్గర తడిపి, పసుపు కుంకుమని అక్కడ జల్లి, కడ్డీలు ముట్టించి, దండం పెట్టుకొని, టెంకాయను బోరు పాయింటుకు గుర్తుగా పెట్టిన కనికిరాయిని తీసేసి అదే తావులో పెట్టినాడు. ఈ తంతంతా జరుగుతుండగానే మా నాయన అప్పుడప్పుడూ ఏదో భయంతో ఊరిదావ వైపు, రోడ్డుకు తూరుప్పక్క నుండే పదెకరాల వైపు చూస్తానే ఉండాడు.

కొంతసేపటికి మేమంతా పక్కకి జరిగినాం. రెండు నిమిషాలకి బండి ఆన్ అయ్యింది. బోరుబండి శబ్దం హెూరుమని వస్తాంది. కొంచేపటికి అది మరింత ఎక్కువైంది. అయితే ఇంగా బోరు డ్రిల్లింగ్ పైపు భూమిలోకి దిగలేదు.

ఇంతలో 'ఆపరా బండి' అంటూ రాజారెడ్డి, ఆయన కొడుకూ వచ్చారు. ఒక్కసారిగా మాకందరికి గుండెలు గుభేల్ మన్నాయి.

'ఏమ్ నా' అంటూ మా నాయన వాళ్ళ దగ్గరికెళ్ళాడు.

'బోరెయ్యద్దండి నిలిపేయండి'

'ఏం నా, ఎందుకెయ్యగూడదు'

'అదంతా నీకనవసరం బోరెయ్యద్దంటే ఎయ్యద్దంతే' అంటూ పెద్దగా అరిసినాడు.

బోరుబండి ఇంగా ఆన్ లోనే ఉంది. ఆ శబ్దానికి ఎవరేం మాట్లాడుతున్నారో సరిగా ఇనపన్నందుకు ఒకరితో ఒకరు గట్టిగట్టిగా మాట్లాడుకుంటాండారు. కల్లకివతలున్న మాకు ఆడేదో పెద్దగొడవే జరగతాండాదే అనేటట్లుండాది. వెంటనే అన్నా నేనూ వాళ్ళదగ్గరికి పోయినాం.

'బండి ఆపండిరా, ఏం చెప్తాంటే ఇనపల్లేదా' అంటూ బోరుబండోల్లని రాజారెడ్డి గదమాయించినాడు.

'బోరు ఆపేది లేదునా. ఎందుకాపల్ల' అని మా నాయన గట్టిగానే అరిసినాడు.

'ఈడ ఎయ్యద్దండిరా. ఇంగ్యాడన్నా ఏసుకోండి.'

'ఇంగ్యాడన్నాఅంటే యాడేసుకోవల్లనా.మాకుండే భూమిలో ఈడ్నే నీళ్లుండాయన్నారు. ఈడ గాకుండా ఇంగ్యాడేసేది.'

'అదంతా నాకు తెలీదు. మీరు ఈడ బోరేస్తే మా బోరు నిల్చిపోతుంది. అందుకే ఎయ్యద్దండి.'

'మీ బోరు ఎందుకు నిల్చిపోతుందినా.'

'మా బోరుకు పోతాండే సార ఈన్నించే వస్తాండేది. అందుకే మీరు బోరేస్తే మాకు నీళ్ళు నిల్చిపోతాయి.'

'అదేంది నా, కింద యాడో బోతాండే నీటి సార ఈన్యే బోతాందని నువ్వెట్లా చెప్తావు.'

'మా బోరు పాయింటు పెట్టేటప్పుడు మాకు వస్తాండే నీళ్ళ సార ఎట్లెట్ల వస్తాండాదో పాయింటు పెట్టేటాయన చెప్పినాడు. అందుకే ఈడ ఎయ్యద్దని చెప్తాండా. ఆపైన నీ ఇష్టం. అట్లా కాదని నువ్వు బోరెయ్యాలనుకుంటే ఇన్నూరడుగులకు అవతల ఏసుకో, లేదంటే లేదు. ఈడ మాత్రం ఎయ్యొద్దు' అంటూ మరీ గట్టిగా అరిసినాడు.

'మీరంటే ఉన్నోళ్ళు కాబట్టి మీరెబ్బుడనుకుంటే అబ్బుడు బోరేసుకునే స్తోమత మీకుంటుంది. కానీ మేమలా కాదునా, ఇరవయ్యేండ్ల నుండి కడుపు కట్టుకొని దాచిపెట్టుకున్న డబ్బుతో బోరేసుకోడానికి మాకిప్పుడే కుదిరింది. ఇప్పుడు మీరు ముందేసినారని ఈడేయ్యద్దని, ఆడేయ్యద్దని, మీకు నీళ్ళు నిల్చి పోతాయని ఇన్ని ఆక్షేపణలు పెట్టడం ఏమన్నా బాగుందానా.'

'అదంతా నాకు తెలీదురా, నువ్వీడ బోరెయ్యొద్దు' అని రాజారెడ్డి. 'నేను ఏసేది ఏసేదే' అని మా నాయన. ఇలా చానాసేపు గట్టిగా అర్సుకుంటా మాట్లాడిన తరవాత రాజారెడ్డి 'నువ్వు ఈడ బోరేస్తే నేను పొయ్యి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేస్తాను' అంటూ వెళ్ళిపోయినాడు.

ఒక్కసారిగా మాకందరికి ఏమి చెయ్యాలో అర్థం కాలేదు. ఏదైతే అది అయ్యిందిలే అని బోరెయ్యడానికి మాకు ధైర్యం సరిపోలేదు. ఒకవేళ ఏస్తే వాళ్ళు ఏం చేస్తారో ఏమోనని ఒకపక్క భయం. అమ్మ నెత్తినచెయ్యిపెట్టుకొని గెనెంమీద అలానే కూల బడిపోయింది. ఒక్కరికీ గొంతులో మాట పెగల్లేదు. గుండెల నిండా ఏదో తెలియని భయం... ఏం చెయ్యాలో అర్థంకాని పరిస్థితిలో మేమంతా ఉంటే, మా నాయన గబగబా ఊరి వైపు దారి పట్టినాడు.

'ఏం నాయనా అట్లా పోతాండావు, యాడికి'

'కృష్ణారెడ్డి దగ్గరికిరా, ఆయనకు అన్ని విషయాలు ముందే చెప్పినాను. అట్లే కొండారెడ్డి కాడికి పోయోస్తా, ఆయన మాటంటే ఊర్లో అందరికీ గౌరవమే. పైగా రెండుసార్లు సర్పంచ్‌గా చేసి మంచి పేరు తెచ్చుకోవడం వల్ల ఎమ్మెల్లే దగ్గర గూడా మంచి పేరుంది. ఆయనకి కూడా విషయమంతా ముందే చెప్పినాను' అని చెప్పి వెళ్ళిపోయినాడు.

మా నాయన ఎంతకీ రాకపోయే సరికి, నాకేదో భయమేసి ఊర్లోకి పోదామని కొంత దూరం పొయ్యేసరికి మా నాయన దిగాలుగా ఎదురైనాడు.

'ఏమైంది నాయనా.. పెద్దలతో మాట్లాదినావా, ఏమన్నారు'.

'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు అందురూ దాయాదులే, పైగా పంచాయితీ పెద్దలే అయినా మాట సాయానికి కూడా ఇండ్ల తలుపులు తీసి ఏమైందిరా అని అడిగేవాళ్ళు లేరు. సమస్య రాకముందు నీకెందుకురా మేమున్నాము అంటూ అందురూ ఎగదోలేవాళ్ళే. తీరా ఇబ్బుడు ఇట్లుంది పరిస్థితి అంటే, రాజారెడ్డికీ మాకు పడదు. ఇబ్బుడు నేనొచ్చి మాట్లాడితే బాగుండదు అని ఒకరు. ఆయన ఇంత పని చేస్తాడనుకోలేదు. వాళ్ళతో గొడవలెందుకులే. వాళ్ళు ఒప్పుకున్నాకే బోరేసుకో అని ఒకరు చేతులెత్తేసేటోళ్ళే' అంటూ అక్కడే కూచ్చున్నాడు.

బోరుబండోల్లు 'ఇంగెంతసేపునా.. మాకు వేరే పార్టీ ఒకటి వెయిట్ చేస్తా ఉంది. మేము పోతాము. మీరు ఒకమాట మీదికి వచ్చినాక మాకు ఫోన్ చెయ్యండి వస్తాము' అన్నారు.

'ఒక పది నిమిషాలు ఉండండినా.. ఏవిషయం చెప్పేస్తాము' అని నేను వాళ్ళతో చెప్పి నేరుగా రాజారెడ్డి ఇంటికి పోయినాను.

◆ ◆ ◆

'పెద్నాయనా.. మా నాయన ఇన్నేండ్లు ఆ ఊట బాయిని నమ్ముకొని ఏదో పడతా లేస్తా, అబ్బాఅమ్మా అంటే సంవత్సరానికి ఒక ఫలితం పండిస్తా ఉండే. ఇప్పుడు రెండు మూడెండ్లుగా వానలు సరిగ్గాపడక ఆ ఊటబాయి కూడా ఎండిపోయింది. ఇట్లే ఉంటే జరగదని ఏదో ఒక బోరేసుకుంటే అంతోఇంతో ఆవులకు గడ్డేసుకొని రెండు జెర్సీఆవులను పట్టుకొని నిమ్మలంగా వుందామనుకొని, ఈ రోజు ఇట్లా బోరు బండిని పిలిసినాడు. ఇప్పుడు నువ్వు కాదంటే ఎట్లా పెద్నాయనా' అని మాట్లాడతా వుంటే, నా నోట్లోమాట నోట్లో ఉండగానే 'మీరెన్ని బాధలు పడితే మాకెందుకు' అంటూ పెద్దమ్మ ఏదో సాగాదీస్తానే ఉంది. 'పెద్నాయనా నువ్వొకమాట చెప్పు పెద్నాయనా, అట్లా గూడా మా బోరు వల్ల మీ బోరులో నీళ్ళిండిపోతే అది మీరే పెట్టుకోండి' అని ఎంతగా ప్రాధేయ పడినా వాళ్ళ మనసు కరగలేదు.

చివరికి చేసేదేమీలేక 'మీరు ఉన్నన్నాళ్ళూ మీ భూమిపక్కన అది బీడుభూమిగానే ఉంటుంది. అది చూసి మీరు ఆనందంగా ఉండండి. మేము ఆ బీడు భూమిని చూస్తూ బతికినన్నాళ్ళూ బాధ పడుతూనే ఉంటాము' అని అక్కడినుండి నేరుగా చేనుకాడికి పోయినా.

అర్ధగంటకంతా బోరుబండి వెళ్ళిపోయింది. అందరం ఇంటికొచ్చేసినాము. అప్పటికే తెల్లారి జామున అయిదు గంటలైంది. ఎవ్వరికీ నిద్ర రావట్లేదు.

♦ ♦ ♦

'వీధిలో రాజారెడ్డి ఎదురుపడినాడు. వాళ్ళ బోరు పాయింటు పెట్టిన కుంటిరెడ్డి వచ్చి దానికి దీనికి ఏ సంబంధం లేదు అని చెప్తే మీరు బోరేసుకోడానికి నాకెటువంటి అభ్యంతరం లేదు అని చెప్పినాడు' అని మా నాయన అమ్మతో చెప్పినాడు. ఆ మాట మా నాయననోట వినగానే మాకందరికి ప్రాణాలు లేచి నిలబడినట్లయినాయి. ఆత్రం పట్టలేక 'నువ్వు బిన్నా పొయ్యి ఆ కుంటిరెడ్డిని పిల్చుకొనిరా' అని మా అమ్మ చెప్పగానే అన్ని సద్దినీల్లు తాగి నేనూ మా నాయనా కుంటిరెడ్డి ఇంటికి పోయినాము.

గేటు తీసుకొని కుంటిరెడ్డి ఇంటి మొగసాలలో మేము నిలబన్నాము. ఇంతలో ఎప్పుడొచ్చినాడో ఏమో ఆ రాజారెడ్డి చేతిలో నుండి సిగరెట్టుని కింద పడేస్తూ 'చెప్పింది గుర్తుంచుకో కుంటిరెడ్డి' అని గట్టిగా చెప్తూ వెళ్ళిపోయినాడు. అది విని మా నాయనా నేనూ ఒకరి మొఖాలు ఒకరం చూసుకున్నాం.

ఇంతలో 'రా రా బామ్మర్ది చాన్నాళ్ళకు మా ఇల్లు కనపడిందే ఏమి సంగతి' అని అడిగినాడు కుంటిరెడ్డి. 'ఇప్పటికే అన్నీ తెలుసుంటాయి కదా మామా. మల్లా ఎందుకు పుండుమీద కారం చల్లినట్లు అడగడం' బాధతో అన్నాడు మానాయన. 'ఒరేయ్ నాయాలా నాకన్నీ తెలుసులేరా. అయినా ఆ రాజారెడ్డికి ముందే చెప్పినానే మీ పాయింటుకి వాళ్ళ పాయింటుకి సంబంధం లేదు అని. మళ్ళీ బుద్ధి లేకుండా అట్లెట్లా చేసినాడు' అన్నాడు. ఆ మాటతో మానాయన కళ్ళల్లో ఇరవయ్యేళ్ళ కల నాకు కనపడింది.

'ఎప్పుడొస్తావో చెప్పు మామా.. ఈ పంచాయితీ అట్లా తెగిపోతే మా బతుకేదో మేము బతుకుతాము' అంటూ మా నాయన అడిగినాడు. 'సాయంత్రం నేనే ఫోన్ చేస్తాను. అప్పుడు రా. ఒరేయ్ నాయాలా.. ఆ రాజారెడ్డి అంత మంచోడేమీ కాదురా, మళ్ళా ఏదో ఒక తిరకాసు పెడతానే ఉంటాడు. ఊరి ముందు దారింటి కాకుండా మూడ్డాములకుంట దారింటి వస్తాను. నువ్వు ఆడుండు' అన్నాడు. సరే అనుకుంటూ నేను మా నాయనా ఇంటిదారి పట్టినాం.

♦ ♦ ♦

'పాయింట్ ఎక్కడరా బామ్మర్ది'

'ఇంకొంచెం అట్ల ముందుకి పా మామా' అంటూ పది అడుగులు ముందుకేసి 'ఇదే మామా' అని చూపించినాడు నాయన.

అప్పటిదాకా కిందికున్న తెల్ల పంచెను ఎడమ చేతితో ఎత్తిపట్టుకొని, కుడిచేతిని భూమికి అభిముఖంగా పెట్టి, నీళ్ళల్లో కలపెట్టినట్టు చేతిని ఆడించుకుంటూ పాయింటుకు నాలు గడుగులు ఇటూ నాలుగడుగులు అటూ ఏసాడు. 'లాభం లేదు కదరా రేయ్ బామ్మర్ది. ఎవ్రురా ఈడ పెట్టింది పాయింటు' అన్నాడు.

'ఆ తాటిగుంటపాలెం ఆయన పెట్టినాడులే మామా, ఏమైంది'.

'నీళ్ళు లేవు కదరా, యాన్నో అరించీ మాత్రమే తగలతా ఉండాయి కదరా బామ్మర్ది' అని అంటూ 'నీచేను యాన్నుంచి యాడిదాకో చెప్పరా.. ఒకసారి మొత్తం చూద్దాం' అన్నాడు.

మానాయన మొత్తం చూపించినాడు. కుంటిరెడ్డి మామ అంతా తిరిగి చూసి 'లాభం లేదురా బామ్మర్ది. ఇంగ్యాడన్నానీ భూమి ఉంటే చెప్పురా చూద్దాం' అన్నాడు. సరే అని ఈ చేనుకి కొంతదూరంలో ఉండే ముప్పైగుంటల చేనులోకి తీసుకెళ్ళినాడు మా నాయన. ఆ చేనులో పల్లేరుముండ్లు ఎక్కువగా ఉండడంతో, 'ఒరేయ్ బామ్మర్ది... చేనుని అంతా పరిగిలి పట్టించినావ్ కదరా, ఇట్లేనా కాపోడు సేద్యం చేసేది' అని మళ్ళీ ఆయన విద్యను ప్రదర్శించి, 'నాయాలా రేయ్ బామ్మర్ది.. ఈడ పోతావుంది చూడరా సార' అంటూ కాస్త నిదానంగా అడుగులేసినాడు. పది అడుగులు ముందుకి, పది అడుగులు వెనక్కి వేసి 'నాయాలా రేయ్.. ఈడ ఇన్ని నీళ్ళు పెట్టుకొని ఆడేడో తనకలాడ తావుండావు కదరా నీ పాసును గాలా' అని దగ్గరలో వుండే కానుగచెట్టు కాడికి పోయి, తమరగా ఉండే సన్నని పుల్లని పెరుక్కొని మళ్ళీ ఇటు పది అడుగులు, అటు పది అడుగులు వేసి చూసినాడు. అదేందో గానీ ఆయన చేతిలోనిపుల్ల దానం తట అదే తిరుగుతూ ఉంటే నాకేమో ఆశ్చర్యమేసింది. 'మూడు ఇంచీల వరకూ నీళ్ళు పడతాయిలేరా బామ్మర్ది' అంటూ గుర్తుగా ఒక రాయిని పెట్టి ఇంగ 'పదాం పదరా బామ్మర్ది' అన్నాడు.

నాలుగు రోజుల తరవాత ఒకరోజు రాత్రి పదకొండు గంటలకు బోరుబండి వచ్చింది. అమ్మ, నేను, అన్నా, మా నాయనా అందరం చేనుకాడికి చేరుకున్నాం. కొంతసేపటికి బండి డ్రిల్లింగ్ రాడ్డు భూమిలోకి దిగింది. ఒక్కసారిగా మొత్తం చుట్టుపక్కలంతా ఒగటే దుమ్ము. మేం అందరం ఆనందంగా చూస్తున్నాం. అలా చూస్తా ఉండగానే యాభై అడుగులు, వంద

అడుగులు ఇలా పైపులు దిగుతూనే ఉన్నాయి. ఉత్త ముగ్గుపిండి తప్ప నీటి చుక్క జాడైనా కనపడకుండా ఉంది. మా నాయన ప్రతి రెండుపైపులకొకసారి ఆ ముగ్గుపిండిని చేతిలోకి తీసుకొని రవ్వంత తడైనా ఉందా లేదా అని చూస్తా ఉండాడు. కొంత సేపటికి సరసరామని మరో అయిదు రాడ్లు దిగిపోయినాయి. ఎక్కడో ఒక సార తగిలినట్లుంది. మట్టి ముద్దలు ముద్దలుగా పడుతూ ఉంది. 'ఒరేయ్ చిన్నోడా ఇలా రారా' అన్నాడు మా నాయన. నేను వెళ్ళేసరికి, ముద్దలు ముద్దలుగా రాలుతున్న ఆ ముగ్గుపిండి కాస్తా మునిసిపల్ కొళాయిల్లో నీళ్ళు వచ్చినట్లు సన్నగా కారడం మొదలైంది. అది చూసి 'ఇంగేం భయంలేదులేరా మన పంట పండేటిగానే ఉంది' అన్నాడు. ఆ క్షణం మా నాయన కళ్ళు కార్తీకమాసంలో సీతమ్మగుట్ట మింద పెట్టే దీపంలా వెలిగిపోతా వుండాయి.

'నువ్వు ఇంటికి బొయ్యి రెండు గోనెసంచులు తేపోరా. బోరులో ఎయిర్ వదిలినప్పుడు నీళ్ళు పైకి ఎగరకుండా పెట్టల్ల' అన్నాడు మా నాయన. నేను ఇంటికి పోయ్యొచ్చేసరికి ఊరిలోని జనం కొంతమంది ఏమాత్రం నీళ్ళు పన్నాయో అని చూడడానికి వస్తూపోతూ ఉండారు.


బోరు ఆరువందల అడుగులు దాటిపోతూ ఉంది. 'ఏంది నాయనా ఆరువందలు దాటినా నీళ్ళు సన్నగానే వస్తాండాయే' అన్నాను. 'కుంటిరెడ్డి మామ ఆరువందల యాభై నుండి ఏడువందల యాభై అడుగుల మధ్యలో నీళ్ళు బాగా పడతాయన్నాడులేరా, చూస్తా ఉండు ఇంగొగ పైపో రెండు పైపులో దిగినాక చూడు' అన్నాడు. నేనేమో అట్లనే చూస్తా ఉండా. మానాయన అన్నట్లు రెండుపైపులు గాదు ఆరుపైపులు దిగిపోయినాయి. నీళ్ళు మాత్రం అవే. ఒగిటిన్నర ఇంచీనే. మా అందరికి ఏదో గుబులు మొదలైంది. మానాయన అటూఇటూ తిరుగుతూ కుంటిరెడ్డికి ఫోన్ చేస్తా ఉండాడు. ఆయనేమో ఫోన్ ఎత్తినట్లు లేదు. కాలుగాలిన పిల్లిలా మా నాయన కాలు యాడా ఒక నిమిషం కూడా ఆగలేదు. కొంత సేపటికి బండి ఆపరేటర్ మా నాయాన్ని పిలిచి, డ్రిల్లింగ్‌లో నుండి వచ్చే చిన్నచిన్న రాళ్ళను చూపించి 'నీకేం భయం లేదు పోనా.. ఇవి వచ్చినాయంటే నీళ్ళు బాగా పడతాయిలే' అన్నాడు. ఆపరేటర్ ఆ మాట అన్నాడోలేదో ఒక్కసారిగా నీళ్ళు పైకి ఎగజిమ్మినాయి. మా ఆనందానికి అవధులు లేకుండా పోయినాయి.

బండి ఆపరేటర్, నీళ్ళ ఫోర్సు ఎక్కువైందినా.. డ్రిల్లింగ్ అవ్వటం లేదు ఇంగ బండి ఆపేద్దాం' అన్నాడు. ఆమాట మేము వింటుండగానే అమాంతం ఒక్కసారిగా డ్రిల్లింగ్ పైపు ఇరవై అడుగులు దిగిపోయింది. ఆపరేటర్ ముందుకి వెనక్కి పైపుని డ్రిల్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఐనా లాభం లేకుండా పోయింది. పైపులోనుండి నీళ్ళుగాని మట్టిగాని ఏదీ పైకి రావడంలేదు. శతవిధాలా వాళ్ళు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొంతసేపు తరవాత గులకరాళ్ళ కంటే పెద్దరాళ్ళు బయటికొచ్చాయి. ఇదంతా చూస్తూనే ఉన్నాం తప్ప మాకేం అర్థం కావట్లేదు. కొంతసేపు తరవాత బండిని ఆపేశారు.

'ఏమైంది?' అన్నాడు మానాయన. 'డ్రిల్లింగ్ రాడ్డుకు చిన్నచిన్న రాళ్ళు తగులుకొని అది తిరగడం లేదు. అందుకే డ్రిల్లింగ్ అవ్వడంలేదు. ఇప్పుడు ఆపైపులన్నా బయటికి వస్తాయో రావో చెప్పలేము' అన్నాడు. మాకు గుండెలు ఝల్లుమన్నాయి. 'మీరేం భయపడద్దండి మా పైపులు పైకి లాగి బోరుని క్లీన్ చేసి మీకు నీళ్ళు వచ్చే విధంగా చేసే పోతాములే' అన్నాడు.

వాళ్ళు సాయంత్రం వరకూ ప్రయత్నించి ప్రయత్నించి వదిలేసినారు. ఆ పైపులు లాగడానికి వీళ్ళ దగ్గరున్న బండి పవర్ సరిపోదని బెంగళూరు బార్డర్లో ఉన్న చింతామణి నుండి ఒక పవర్ బండిని పిలిపించినారు. ఆ మరుసటి రోజుకి వాళ్ళ సామగ్రినంతా పైకి లాగేసుకున్నారు. మిగిలిన ఆ బోరు పరిస్థితిగాని, అందులోని నీళ్ళ గురించిగాని ఎంత అడిగినా మాకు చెప్పడంలేదు. వాళ్ళల్లో వాళ్ళే ఏదో మాట్లాడుకుంటా వుండారు. కొంతసేపటికి ఒకాయన వచ్చి 'ఈ పాయింటులో బోరు వెయ్యలేము. లోపల మట్టి కొంచెంకొంచెమే పూడిపోతా వుంది. ఒకవేళ మేము పైపులు దించితే, తిరిగి అవి వస్తాయన్న గ్యారంటీ లేదు' అని చేతులు పైకెత్తేశాడు. చుట్టుపక్కల వాళ్ళు ఇంగ ఆ బొక్కలో ఉన్న నీళ్ళ కోసం మోటారు, పైపులు కూడా వేయడం దండగే. అవి కూడా పూడిపోతే వాటి ఖర్చు కూడా శివార్పణమే అంటూ వెళ్ళిపోయారు.

ఎంత ప్రాధేయపడినా లాభం లేకుండాపోయింది. చేసేదేమీ లేక వాళ్ళకి ఇవ్వాల్సినడబ్బు వాళ్లకి ఇచ్చేసి అందరం ఇంటికి చేరుకున్నాం. అప్పటికే పొద్దు పోయింది. ఇరవయ్యేళ్ళ కల నెరవేరుతున్నట్లే కనిపించి ఇలా అవ్వడంతో ఆక్షణం ప్రాణముండీ లేనట్లు మా నాయన, బోరులో పడిన ఆ కాసిన్ని నీళ్ళనూ పైకి లాక్కోలేక, కూడపెట్టుకున్న డబ్బూ పోయి, రేపటి జీవితం ఎట్లా అన్న భయంతో మాయమ్మ కనిపిస్తావుండారు. వాళ్ళనలా చూస్తుంటే నాకు ఏం చెయ్యాలో దిక్కు తోచడం లేదు. గబగబా వెళ్లి రెండు చెంబుల నీళ్ళు పోసుకొని, బట్టలు సర్దుకొని పయనమయ్యాను. 'ఇంత మొబ్బులో యాటికి బయల్దేరినావురా' అని మాయమ్మ అడిగింది. 'తిరపతిలో నేను చదువుకునే తాన ఒక హోం ట్యూషన్ ఉందంట. నెలకు నాలుగు వేలిస్తారంట. నేను పోతాను. ఈడ ఉండి ఈ బాధలు నేను చూడలేను...' అని సిద్ధం కాసాగాను. ■



# శ్రీలంక సంక్షోభం కొన్ని పాఠాలు

- ఎంవిఎస్ శర్మ

**భి**న్న జాతులు, సమూహాలు ఉన్న దేశంలో వాటి నడుమ విద్వేష పూరిత వాతావరణం, ఘర్షణలు నెలకొంటే ఆ దేశంలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం మన దేశంలో మోడీ ప్రభుత్వం కూడా మెజారిటేరియన్ ఆధిపత్య వాదాన్నే వివిధ రూపాల్లో ప్రదర్శిస్తోంది. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య... హిందువులకు, ముస్లిములకు మధ్య... హిందీ వారికి, హిందీయేతరులకు మధ్య ఘర్షణలను బిజెపి – ఆరెస్సెస్ కూటమి రెచ్చగొడుతోంది. ఇటువంటి స్థితిలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విషయంలో ఎన్ని మార్పులు చేసినా ప్రయోజనం ఉండదు. ఇప్పటికే ఇన్ఫోసిస్ వంటి కొన్ని బడా కంపెనీలు తమ ప్రధాన కార్యకలాపాలను వేరే దేశాలకు తరలిస్తున్నాయి. దేశంలో కార్పొరేట్లు పెట్టే మదుపులు తగ్గిపోయాయి.

రోజువారీ ఆహార దినుసులు మార్కెట్లో లభించకపోవడం, ఒకవేళ లభించినా వాటి ధరలు అనూహ్యంగా పెరిగిపోవడం, పెట్రోల్, డీజిల్ దొరకకపోవడం.. శ్రీలంక ప్రజల్ని సంక్షోభం లోకి నెట్టిన తక్షణ కారణాలు. దేశ అవసరాలకు కావల్సిన ఆహార దినుసులను చమురు ఉత్పత్తులను దిగుమతి చేసు కోడానికి అవసరమైన విదేశీ మారక నిల్వలు అడుగంటి పోవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది.

చమురు ఉత్పత్తుల కోసం అత్యధిక దేశాలు దిగుమతులపై ఆధారపడతాయి. అందుకు శ్రీలంక మినహాయింపు కాదు. కాని స్వతంత్రం వచ్చి (1948) ఏడు దశాబ్దాలు గడిచినా ఇంకా దేశీయ అవసరాలకు సరిపడా పాల ఉత్పత్తులను, ఆహార దినుసులను ఉత్పత్తి చేసుకోలేని దుస్థితిలో శ్రీలంక ఎందుకు ఉండిపోయింది ?

**సింహళ జాతీయవాదం :** 1950ల్లోనే శ్రీలంక ప్రభుత్వం కేవలం సింహళ భాషను మాత్రమే అధికార భాషగా గుర్తిస్తూ నిర్ణయించింది. ఆ తర్వాత కాలంలో కొన్ని సడలింపులు ఉన్నా, ప్రధానంగా సింహళ జాతీయ ఆధిపత్యవాదమే దేశంలో బలపడింది. శ్రీలంకలో తేయాకు, కాఫీ, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు విస్తారంగా పండుతాయి. బ్రిటిష్ వారికి వలసగా ఉన్న కాలంలో ఈ తోటలను ఎక్కువ విస్తీర్ణంలో పెంచారు. అందుకోసం పెద్ద సంఖ్యలో తమిళులు అక్కడికి వలస వచ్చారు. గణనీయమైన సంఖ్యలో తమిళ భాష మాట్లాడేవారు శ్రీలంకలో ఉన్నారు. ఈ తోటల ద్వారా వచ్చే ఉత్పత్తులను ఎగుమతి చేసి కీలకమైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించారు.

ఎప్పుడైతే సింహళ జాతీయవాదం ప్రభుత్వ ప్రోద్బలంతో ఊపందుకుందో అప్పటినుంచీ తమిళులతో తాము పరాయి వారుగా పరిగణించబడుతున్నామనే భావన బలపడింది. అది క్రమంగా తీవ్రరూపం ధరించి తమిళ టైగర్లు ముందుకొచ్చారు. ఇంకోపక్క సంపన్నులుగా వున్న తమిళులు భారతదేశానికో పశ్చిమ దేశాలకో తరలిపోయారు. వ్యాపారాల్లో, సాంకేతికతలో తగు నైపుణ్యం ఉన్న తమిళులు దేశాన్ని వదలిపెట్టడంతో దేశ ఆర్థికవ్యవస్థ ముందడుగు వేసే అవకాశమే లేకుండా పోయింది.

దానికి తోడు దాదాపు 25ఏళ్ల పాటు తమిళ టైగర్లతో పోరాటానికి, ఆ ఉద్యమాన్ని అణచివేయడానికి శ్రీలంక ప్రభుత్వం తన శక్తినంతటినీ వినియోగించాల్సి వచ్చింది. ఒక అంతర్యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ కాలంలో... దేశంలో పెట్టుబడులు పెట్టడానికి స్వదేశీ, విదేశీ మదుపరులు ఎవరూ సాహసించలేదు. ప్రభుత్వం పెట్టుబడులు పెట్టగల పరిస్థితిలో లేదు.

**మొదటి పాఠం :** భిన్న జాతులు, సమూహాలు ఉన్న దేశంలో వాటి నడుమ విద్వేష పూరిత వాతావరణం, ఘర్షణలు నెలకొంటే ఆ దేశంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం మన దేశంలో మోడీ ప్రభుత్వం కూడా మెజారిటేరియన్ ఆధిపత్యవాదాన్నే వివిధ రూపాల్లో ప్రదర్శిస్తోంది. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య; హిందువులకు, ముస్లిములకు మధ్య; హిందీ వారికి, హిందీయేతరులకు మధ్య

ఘర్షణలను బిజెపి – ఆరెస్సెస్ కూటమి రెచ్చగొడుతోంది.

ఇటువంటి స్థితిలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విషయంలో ఎన్ని మార్పులు చేసినా ప్రయోజనం ఉండదు. ఇప్పటికే ఇన్ఫోసిస్ వంటి కొన్ని బడా కంపెనీలు తమ ప్రధాన కార్యకలాపాలను వేరే దేశాలకు తరలిస్తున్నాయి. దేశంలో కార్పొరేట్లు పెట్టే మదుపులు తగ్గిపోయాయి.

**రెండో పాఠం : ఆహార స్వావలంబన**

శ్రీలంక ప్రభుత్వం తోటల ద్వారా వచ్చే తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కాఫీ తదితర ఉత్పత్తుల అమ్మకాల మీదనే ఎక్కువ దృష్టి పెట్టింది. ప్రజల నిత్యావసరాలైన ఆహారధాన్యాలను దేశంలో ఉత్పత్తి చేయడం మీద తగిన శ్రద్ధ పెట్టలేదు. 1960 దశకంలో ఒక్కసారిగా తేయాకు, రబ్బరు వగైరా ఉత్పత్తుల అంతర్జాతీయ ధరలు పడిపోయాయి. ఎగుమతుల ఆదాయం బాగా తగ్గింది. ఇంకోవైపు ప్రజల నిత్యావసరాలను దిగుమతి చేసుకోడానికి విదేశీ మారక ద్రవ్యం అవసరం బాగా పెరిగిపోయింది. అప్పుడు శ్రీలంక ప్రభుత్వం హరిత విప్లవం తలపెట్టింది. అది పూర్తి ఫలితాలనిచ్చే లోపే సింహళ – తమిళ వివాదం ముందుకొచ్చింది. ఏడాది క్రితం వంద శాతం సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని నిర్ణయించడంతో దేశంలో పండే పంటల దిగుబడులన్నీ పడిపోయాయి. ప్రజల కడుపులు నింపడానికి శ్రీలంక ప్రభుత్వం బొచ్చె పట్టుకుని ఐఎంఎఫ్ దగ్గరికి పోయి 17వ సారి అప్పు ఇవ్వాలని వేడుకుంటోంది.

భారతదేశంలో కూడా 1950, 1960 దశకాల్లో... దేశ అవసరాలకు సరిపడా తిండిగింజల ఉత్పత్తి జరిగేది కాదు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల చుట్టూ తిరిగి దేబిరించాల్సి వచ్చేది. 1970 దశకంలో చేపట్టిన హరిత విప్లవం దేశ ఆహార స్వావలంబనను సాధించింది. దానర్థం దేశ ప్రజలందరూ కడుపు నిండా తినగలుగుతున్నారని కాదు. పెట్టుబడిదారీ సమాజంలో ఆకలిని రూపుమాపడం సాధ్యం కాదు. కాని దేశ ప్రజలందరికీ కావల్సినంత పరిమాణంలో ఆహారధాన్యాలను మనమే పండించుకోగలుగుతున్నాం. ఏడెనిమిది కోట్ల టన్నుల తిండి గింజలు నిల్వ చేసుకోగలిగాం. తిండి కోసం విదేశాల చుట్టూ తిరగనవసరం లేదు.

ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఈ స్వాలంబనకే ఎసరుపెట్టే వ్యవసాయ చట్టాలను తెచ్చింది. రైతుల చారిత్రాత్మక పోరాట ఫలితంగా ఆ చట్టాలు రద్దయి వుండొచ్చు. కాని మోడీ ప్రభుత్వం ఆలోచనలో మార్పు లేదు. మళ్లీ ఏదో ఒక విధంగా ఆ చట్టాలను తేవాలని, వ్యసాయాన్ని కార్పొరేటీకరించాలని ప్రయత్నిస్తోంది. అదే జరిగితే మన దేశ ఆహార స్వావలంబన దెబ్బతినడం ఖాయం. ఇంత పెద్ద దేశం తన ప్రజలకు కావాల్సిన తిండి గింజలను పండించుకోలేని పరిస్థితే వస్తే, తిండి కోసం దిగుమతులపై ఆధారపడవలసి వస్తే ఎటువంటి భయంకర వాతావరణం నెలకొంటుందో ఆలోచించండి! దేశ ఆహార స్వావలంబనను, పారిశ్రామిక స్వావలంబనను కాపాడుకోవాలంటే ఇప్పుడు కొనసాగుతున్న కార్పొరేట్ హిందూత్వ రాజకీయాలకు దేశంలో స్థానం లేకుండా చేయాలి.

**మూడోపాఠం : నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు**

జయవర్ధనే అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1979 నుంచి శ్రీలంక నయా ఉదారవాద విధానాలను ప్రారంభించింది. ఐఎంఎఫ్ షరతులన్నింటికీ తలొగ్గింది. తన దేశంలో ఉత్పత్తి చేయగల సరకులను సైతం దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. టూరిజం వంటి రంగాల మీదనే ఎక్కువగా ఆధారపడింది. చివరికి ఇప్పుడు ఈ దుస్థితికి చేరింది.

మన దేశంలో కూడా నయా ఉదారవాద విధానాలనే వేగంగా అమలు చేస్తున్నారు. దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా అడుగులు వేసే బదులు మనకి ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని సైతం దెబ్బతీస్తున్నారు. యావత్ ప్రపంచానికీ వ్యాక్సిన్లను అందించగల సామర్థ్యాన్ని పెంపొందించుకున్న మన దేశం నేడు కోవిడ్ వ్యాక్సిన్ల కోసం దిగుమతుల పైనే ఆధారపడాల్సి వస్తోంది. రక్షణ రంగం వంటి కీలక రంగాల్లో సాధించుకున్న స్వావలంబనను నాశనం చేసుకుని అమెరికాతో రక్షణ బంధం పేర ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికన్ ఉత్పత్తుల పైనే మొత్తం ఆధారపడాల్సిన స్థితికి దిగజారాం. సాఫ్ట్‌వేర్ రంగం (మేథోశ్రమ)లో ముందడుగు వేశాం కాని కీలకమైన హార్డ్‌వేర్ ఉత్పత్తుల విషయాన్ని విస్మరించాం. దీని ఫలితంగా కీలకమైన ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ అంతా విదేశాల నుండే దిగుమతి చేసుకోవల్సి వస్తోంది. దీని పర్యవసానంగా మన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కూడా మందగించిపోయింది.

పొరుగు దేశం చైనా ఇందుకు భిన్నంగా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంపై ఎక్కువ కేంద్రీకరించింది. కనుకనే నేడు ప్రపంచం మొత్తం మీద అతి పెద్ద ఎగుమతిదారుగా ఎదిగింది. నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేస్తోంది.

దేశభక్తి గురించి కబుర్లతోటే శివాలెత్తి పోవడం, ఆ పేరుతో ఇరుగు పొరుగు దేశాలతో కయ్యాలను ప్రేరేపించడం, తప్ప నిజంగా దేశాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసే ఆలోచన ఈ మోడీ ప్రభుత్వానికి లేదు. శ్రీలంకలో సింహళ జాతీయవాదం – నయా ఉదారవాద విధానాల కాంబినేషన్ ఆ దేశాన్ని, అక్కడి ప్రజలకు ఎటువంటి స్థితికి తెచ్చిందో చూస్తున్నాం. ఇక్కడ మన దేశంలో హిందూత్వ జాతీయవాదం – కార్పొరేట్ శక్తుల కాంబినేషన్ కూడా ఆ విధానాలనే బరితెగించి అమలు చేస్తోంది. ఈ జోడీకి ఎంత త్వరగా చెక్ పెట్టగలిగితే అంత త్వరగా మన దేశాన్ని వినాశనం నుంచి కాపాడుకోగలుగుతాం. ఇదే దేశ భక్తులందరి కర్తవ్యం. ■

# వాడని వసంతం



- బి గోవర్ధనరావు
94419 68930

1
కదలికే కదా
కారణాలను వెలికి తీసేది
కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చేది
చీకటి కోణాలను తెరిచి చూస్తూ..
నిన్నటి నిజాలను
నిలిచి చూస్తూ..
మిగిలిన మంచితనాన్ని బతికించేది!
చెదిరిన కలలను పూయించేది
సడలిన విలువలను సరిచేసేది
మనిషిని మనిషిగా నిలబెట్టేది!

2
చలనం.. చైతన్యం
ఈ రెండూ –
రేపటి ఉషోదయాలు
మాపటి సమయాలు
వర్తమానంలో వెలిగే
దారి దీపాలు.. శాంతి స్వప్నాలు
కనపడని నిశ్శబ్ద విప్లవాలు!
కలతలేని రహోస్యోద్యమాలు!
మహా భవితను తెచ్చే
జీవనపథ గమ్యాలు!
మహా చరిత్రను చాటే
మరో ప్రపంచాలు!


తమ ఉనికిని చాటుకుంటూ –
ఆరంభం నుంచి
అనంతం వరకు
ప్రగతిని నడిపిస్తాయి
జగతిని ఏలుతుంటాయి!

3
వున్న చోటనే వుండటం
ఒక శిలా సదఅశం –
ముందు కెళ్లకుండా
మాటలతో గడిపేయటం!
పోరాటం లేకుండా
పలాయనాన్ని పఠించటం!
ఆలోచనా లేకుండా
అధైర్యంతో చనిపోవడం!
సూర్యుణ్ణి చూడకుండా
చీకట్లో చివికి పోవడం!
మలుపును చూడకుండా
గెలుపుకు దూరమవ్వడం!
ఒక వ్యర్థ జీవిత ప్రహసనం.

మనుగడ కోరని తీర్పు
మనిషి బతకని కూర్పు
ఆనందాన్ని ఇవ్వని మార్పు
ఎందుకుండాలి?
ఎందాక సాగాలి!
కదలికే కదా కాంతిని పంచేది!
కలయికే కదా భ్రాంతిని త్రెంచేది
కలలుంటే కదా కర్తవ్యం కదిలేది
మొదలెడితే కదా
మార్గం తెలిసేది!
ముందడుగేస్తే కదా
వేకువను చూసేది!

4
విశ్వ కావ్యాలుగా
కదిలే మహా సముద్రాలు!
విశ్వ రహస్యాలను
విడమర్చి తెలిపే
ఆకాశ దేశాలు!
విభ్రాంతిని గొలిపే
చుక్కల రాజ్యాలు!
ఉరుముల, మెరుపులతో
జడివానల జలగేయాలు
ఇవన్నీ కదలికల విన్యాసాలు!
విరిసిన చైతన్యపు కిరణాలు!!

కదలిక లేకుంటే –
గింజ మొలవదు..
బువ్వ పుట్టదు!
ఆకలి తీరదు..
బ్రతుకు నడవదు!
పొద్దు పొడవదు..
ప్రాణం నిలవదు!
కదిలిక పర్యాయపదం కాలం!
అదొక నవజీవన జనగీతం!
అదొక వసివాడని వసంతం! ■






# జానపద కళల పరిరక్షణ ఒక చారిత్రిక అవసరం

**ఉత్తరాంధ్ర జానపద సాహిత్య పరిశోధకుడు**

**బద్రి కూర్మారావు**

**బాల్యంలో కేరింతలు కొట్టించిన జానపద పాటలు, కళారూపాలు తిరిగి అతడిని వాటిపై పరిశోధకుడిగా మలిచాయి. అందుకు 'ఆసక్తి' కొంత కారణమైతే అంతరించిపోతున్నాయన్న 'ఆవేదన' మరికొంత తోడైంది. సుమారు మూడు దశాబ్దాలపాటు ఉత్తరాంధ్ర అంతటా క్షేత్ర పర్యటన చేసి ఎన్నో జానపద కళారూపాలు, గేయాలను సేకరించారు. ఒకవైపు ఉపాధ్యాయులుగా ఉంటూనే ఈ సేకరణ చేసి రెండు అమూల్యమైన గ్రంథాలను వెలువరించారు. 'తెలుగు జానపద సాహిత్య పరిషత్తు' (హైదరాబాద్) వారి వార్షిక పురస్కారం పొందారు. ఆయన బద్రి కూర్మారావు. వారితో ముఖాముఖి ఇది.**

**తెలుగు జానపద సాహిత్య పరిషత్తు వారి 49వ వార్షికోత్సవంలో అవార్డు స్వీకరించడం మీకు ఎలా ఉంది?**

చాలా ఆనందంగా ఉంది. జానపద విజ్ఞానంలో విశేషమైన కృషి చేసిన వాళ్ళని తెలుగు జానపద పరిషత్తువారు అవార్డుకు ఎంపిక చేస్తారు. అలా నా కృషిని గుర్తించి నన్ను ఎంపిక చేయడం కేంద్ర సాహిత్య అవార్డు పొందినంత ఆనందంగా ఉంది.

**మీ బాల్యంలో జానపదం ఎలా ఉండేది?**

నలభై ఏళ్ల నాటి మాట. మా గ్రామాలకు రోడ్లు, మంచి నీళ్ళు, విద్యుత్తు అంతగా లేవు. సినిమాల ప్రభావం కూడా తక్కువ. టీవీల ఊసేలేదు. మా గ్రామాలకు జముకుల పాట కళాకారులు వచ్చి, నెలల కొద్ది గ్రామాల్లో ఉండి, రాత్రిపూట భారత, రామాయణ కథలు పాడేవారు. కాయకష్టం చేసిన ప్రజలు ఆ పాటలు విని సేద తీరి, వారికి తోచిన కానుకలు చదివించేవారు. ఇక పగటిపూట గంగిరెద్దుల వారు, ఎరుకుల పాట వారు, బుడిగ జంగాలు, చెంచులు, మాలదాసర్లు వంటి సంచార గాయకులు, సర్కస్ విద్యలు మొదలైనవారు వచ్చేవారు. వారు భిక్షాటన చేస్తూ పాటలు పాడేవారు. ప్రజలు వారిని ఆదరించేవారు. మా ప్రాంతంలో కూడా ఎన్నో ఏళ్ల నుంచి కోయ నృత్యాలు, సాము గారడీలు, తుడుం సన్నాయి మేళం, చెంచు నాటకాలు, పగటివేషాలు వంటి కళాకారులు ఉండేవారు (ఉన్నారు). గ్రామాల్లో జరిగే గౌరమ్మ పండగ, గ్రామదేవత పండగల్లో ఎన్నో కళలను ప్రదర్శించేవారు. తోలు బమ్మలాటలు, బుట్టబమ్మలు మొదలైన వాటితో ఊరంతా సందడిగా ఉండేది. ఈ ప్రాంతం వామపక్ష ఉద్యమాలకు నిలయం. సుబ్బారావు పాణిగ్రాహి, వంగపండు వంటి గాయకుల ఉత్తేజపూరితమైన పాటలతో తులతూగేది.

**మీ కుటుంబంలో ఎవరైనా కళాకారులు ఉన్నారా? మీరే మొదటివారా?**

లేరు. మా అయ్య కొద్దిపాటి అక్షర జ్ఞానంతో రాత్రిపూట వరాహ చరిత్ర, రామరాయ శతకం, దాసర పద్యాలు పాడేవాడు. బర్మాలో బాంబులు పడ్డప్పుడు ఆయన కాలినడకన వచ్చేటప్పుడు ప్రయాణంలో జరిగిన సంఘటనలు, కలిగిన కష్టాలను కథల రూపంగా చెప్పేవారు. అమ్మ జోల పాటలు పాడుతుండేది.

**ఆర్థిక శాస్త్రం అభ్యసించి, బోధకులుగా ఉన్న మీరు జానపదం వైపు ఎలా ఆకర్షితులయ్యారు?**

ఆర్థిక శాస్త్రం చదివినా ఎందుకో చిన్నప్పుడు విన్న, చూసిన జానపద పాటలు, కళలు, కళాకారులు గుర్తుకు వస్తూనే ఉ

ండేవారు. నాకు తెలిసి అప్పటినుంచే జానపదం అంతర్లయగా ఉంటూ వచ్చిందేమో! కళ్ళెదుటనే అవన్నీ మాయమైపోవడం మరింత బాధ అనిపించేది. ఎప్పుడైనా ఆ కళాకారులను కలవాలి, వారి గురించి తెలుసుకోవాలని తాపత్రయం వెంటాడుతూ ఉండేది. ఉపాధ్యాయ ఉద్యోగం (1991)లో చేరిన పదేళ్ళ తర్వాత గానీ అది కార్యరూపం దాల్చలేదు.

**జానపద పరిశోధకుల్లో మీకు స్ఫూర్తి కలిగించినవారు ఎవరు?**

CESS హైదరాబాద్‌లో పరిశోధన చేస్తున్నప్పుడు ఒక పుస్తకాల షాపులో మిక్కిలినేని రాధాకృష్ణ గారి 'జానపద కళారూపాలు' పుస్తకం కంటపడింది. ఆద్యంతం చదివాను. తర్వాత బిరుదురాజు రామరాజు గారి 'జానపద గేయ సాహిత్యం', పులికొండ సుబ్బాచారి గారి 'రుంజు మ్రోగుతూనే ఉంది', జయధీర్ తిరుమలరావు గారి ఆంధ్రజ్యోతిలోని ఇంటర్వ్యూలు... ఇలా ఎన్నో చదివాను. మాదాడి నారాయణరెడ్డి గారు రాసిన 'ఆదిలాబాద్ జిల్లా జానపద గేయాలు', డా. కె. ముత్యంగారు రాసిన 'సునాముది జీవధార'... చదివాను. ఇవన్నీ నన్ను నా గ్రామంలో నా వారి మధ్య, జానపద కళల మధ్య నిలిపాయి.

**ఉత్తరాంధ్రలో ప్రత్యేక జానపద కళారూపాలు ఏవి? అవి ఎప్పుడు ప్రదర్శిస్తారు?**

జముకుల పాట (వేసవిలో రాత్రిపూట జరిగేది), తూర్పు భాగవతం (అమ్మవారి జాతర్లలో తొలి రోజు), పందిరి పాట (దశావతారం), తప్పెడగుళ్ళు, సేవా గారడీ (యాదవుల గావు సంబరాలు, సింహాద్రి అప్పన్న కొలువు), పులివేషాలు (పైడితల్లమ్మ పండగలో), ఎరుకుల పాట (పగటిపూట), చాతాన వైష్ణవులు (కృష్ణాష్టమి), హరిదాసులు (శ్రీరామ నవమి) .. ఇలా చాలా ఉన్నాయి.

**ఇతర ప్రాంతాల జానపదాలకు ఉత్తరాంధ్రలోని జానపదాలకు వ్యత్యాసం ఏమిటి? ప్రత్యేకత ఏమిటి?**

ఉత్తరాంధ్ర జానపదానికి ఇతర ప్రాంతాల జానపదానికి యాసలో తేడాలు ఉన్నాయి. బొబ్బిలి యుద్ధం, కాటమరాజు కథలు, పేరంటాల కథలు... మొదలగు అంశాలు వేరుగా ఉంటాయి. తెలంగాణ వలే ఉత్తరాంధ్రలో కూడా ఎంతో జానపద సాహిత్యం ఉంది.

**క్షేత్రస్థాయి పరిశోధనలో మీరు ఎదుర్కొన్న సవాళ్ళు, సమస్యలు ఏమిటి?**

మొదటిలో కళాకారుల వివరాలు అడగటానికి బిడియంగా ఉండేది. వాళ్ళకు ఫొటోలు తీసి వివరాలు అడిగినప్పుడు 'మీరు ఏమి చేస్తున్నారు? మాకు ఫించన్లు ఇప్పిస్తారా?' అని అడిగేవారు. కొంతమంది వివరాలు ఇవ్వడానికి ఇష్టపడేవారు



కాదు. మహిళా గాయకులను పాడమన్నప్పుడు వారు కొద్దిగా సిగ్గుపడేవారు. మొదట్లో టేపు రికార్డరు ఎలా ఉపయోగించాలో తెలిసేది కాదు. అంత చొరవగా వెళ్ళలేకపోయేవాడిని. మా బంధువు శ్రీమతి కోరాడ రామరత్నం పాటలు రికార్డు చెయ్యడంలో భాగంగా తోడుగా నన్ను తీసుకెళ్ళేది. ఆ క్షేత్ర పర్యటన నా పరిశోధన ప్రయాణాన్ని కీలక మలుపు తిప్పింది. ఎక్కువగా సెలవు రోజుల్లో మాత్రమే క్షేత్ర పర్యటనకు వెళ్ళేవాడిని.

**నాటికి నేటికి జానపదంలో వచ్చిన మార్పులు?**

ప్రాచీనమైన, అచ్చమైన జానపదాల్లో యాస తేడా ఉండడం, నిరక్షరాస్యులు పాడడం, వాయిద్యాలు ఉపయోగించినప్పుడు అవి బయటకు వినబడకపోవడం... కొంత ఇబ్బందిగా ఉంటుంది. జానపద బాణీలతో ఆధునిక సామాజిక విప్లవ పాటలు రాస్తున్నారు. కొన్ని జానపద కళలు రూపాంతరం చెందాయి. ముఖ్యంగా బుడిగ జంగాలు కథలు బుర్రకథలుగా మార్పు చెందాయి.

**మీ 'ఉత్తరాంధ్ర జానపద కళలు, కళింగాంధ్ర జానపద గేయాలు' పుస్తకాలు రాయడానికి గల కారణాలు?**

ఉత్తరాంధ్ర జానపద కళలు, సాహిత్యం ఎక్కడా పెద్దగా గ్రంథస్థం కాలేదు. పరిశోధనలు కూడా లోతుగా జరగలేదు. అందుకే అరవై జానపద కళారూపాలను, ఐదు వందల పేజీలతో కూడిన జానపద గేయాలు సేకరించి పుస్తకంగా తెచ్చాను. ఇది నాకెంతో సంతఅప్తినిచ్చింది.

**గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం ద్వారా అందిస్తున్న జానపద కళలు?**

తోలుబొమ్మలాట, జముకుల పాట, తప్పెటగుళ్ళు, గంగిరెద్దుల పాటలు, ఎరుకల, బుడిగ జంగాలు పాటలు, స్త్రీల జానపద గేయాలు, హరికథ, బుర్రకథ, గిరిజనుల మైమై గుర్రం, ఉద్దానం సన్నాయి, తుడుం మేళం, పగటివేషాలు, దేవుడి పాట, చెంచుల నాటకాలు మొదలైనవి.

**తెలుగు నాట జానపద కళారూపాల్లో నేడు అంతరించిపోతున్న కళారూపాలు ఏవి?**

తోలుబొమ్మలాట, యక్షగానం, చిందు భాగవతం, జముకుల పాట, ఆశ్రిత కులాల సాహిత్యం ఇలా ఎన్నో... నేడు జానపద కళాకారులకు తగిన గుర్తింపు, గౌరవం దక్కటం లేదు. ఆ బాణీలు ఉపయోగించుకున్న గాయకులకు, సినీ కళాకారులకు మాత్రమే దక్కుతుంది.

**ప్రపంచీకరణ ప్రభావం జానపదంపై ఎలా ఉంది?**

ప్రపంచీకరణ మూలంగా ఇప్పటికే ఎన్నో కళారూపాలు అంతరించిపోయాయి. మరికొన్ని కొన ఊపిరితో ఉన్నాయి. వాటికి ఆదరణ లేక అతి త్వరలో కనుమరుగైపోతాయి. దేవాదాయ ధర్మాదాయ, సాంస్క అతిక, జానపద శాఖలతో ఆ కళల పరిరక్షణ బాధ్యత చేపట్టాలి. వారి ప్రదర్శనలకు అవకాశం కల్పించి ఉపాధి చూపాలి. ప్రభుత్వం జరిపే ప్రచారాలలో వీరికి కుడా అవకాశం కల్పించాలి. వీటికి కార్పొరేషన్, శిక్షణా కళాశాలలు ఏర్పాటు చెయ్యాలి.

**నేటి పరిశోధకులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?**

నేడు లోతైన పరిశోధనలు జరగడం లేదు. తెలుగు సాహిత్యంలో మరీ మొక్కుబడిగా జరుగుతున్నాయి. విషయం కొత్తదిగా ఉండి లోతైన అధ్యయనం జరిగితే తప్పనిసరిగా వారికి తగిన గుర్తింపు ఉంటుంది.

**నేటి సినీగేయాల్లో ఎక్కువగా జానపద బాణీల్లో రావడంపై మీ అభిప్రాయం?**

సినిమాలో జానపదాలు తొలినుంచీ ఉన్నాయి. ఇటీవల ఎక్కువయ్యాయి. మంచిది. కానీ జానపద కళాకారులకు వాటిలో గౌరవం దక్కడం లేదు. కారణం వారి పేర్లు ఉండవు.

**జానపదంలో మీ భవిష్యత్తు కార్యాచరణ?**

జానపద కళలు, తెలుగు భాష మనుగడ కోసం నా వంతుగా చేయవలసి పోరాటం ఉంది. ఆంగ్ల మాధ్యమ మోజులో తెలుగు భాష పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. టీవీ, సినీ మాధ్యమాల ద్వారా జానపద కళలకు కొంత నష్టం వాటిల్లింది. అందుకే తెలుగు భాష కోసం గిడుగు చేసిన పోరాటం గుర్తు చేసుకొని ఆయన పేరు మీదుగా గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళా పీఠం సంస్థ ఏర్పాటు చేశాను.

**సంభాషణ :**
**బుగడూరు మదన మోహన్ రెడ్డి**
**సొరిపల్లి నాగరాజు**
పరిశోధక విద్యార్థులు,
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ,
**99898 94308, 80083 70326**



## ప్రకృతి మర్మం

**ర**వి కిరణాలను ఆకర్షించుకున్న ఆకుల
పచ్చదనపు పడుచు గడుసుదనం
పూయించిన చిగుర్లు కాంచన పూలవి..
పూలకడుపున కాయలు కాయించే
తుమ్మెదల పరపరాగ సంపర్క
సమ్మోహన క్రియతో పండ్ల విత్తులు

జీవజల వానలు వర్షధారలు
ఆదిత్యుడి సముద్రుడి సయోధ్యే
రూపుమార్చుకున్న జీవజలం
ఆవిరులై ఆకాశాన మేఘాలై వెలసింది
జలజల ముత్యాల వానై కురిసింది..

దున్నుతున్నాయి ఎడతెగక భూమిని
పంటకై రైతు మిత్రులు వానపాములు
గుల్లబారిన సత్తువతో నిండు గర్భిణి మట్టి
మంత్రించి ఇచ్చింది పసిడి పంటలను ..
భూమి వాయు జల అగ్ని ఆకాశ
పంచభూతాల వలయంలో చిక్కుకుని
సహజ సహజీవనంలో జీవుల జీవనం..

ఏ జీవి నిర్జీవి సర్వ స్వతంత్ర కాదు
పరస్పర ప్రేమమయ సహాయ
సహకారమే సహజీవన సారం
పంచభూత పర్యావరణ హితం
మనిషి మనుగడకు భద్రం

ఎవరు నేర్పిన జీవవైవిధ్య మంత్రమిది!
కలిసిమెలిసి జీవించమనే ప్రకృతి మర్మం!!

**- డా. పి.విజయలక్ష్మి పండిట్**
**86390 61472**

# స్వగతం

- చొక్కాకుల ప్రసాద్,
95026 26012

ఓయ్ కుర్రమూకలూ..
నవ యవ్వన ఉత్సాహంతో చిరునవ్వులు చిందిస్తూ
చిలిపితనంలో చిందులేస్తున్న మీరేనర్రా,
సంతస లోకపు.. పతాక ధారులు
తిమిరాంధకార కూపపు... తిరుగుబాటుదారులు!
ముదిరిన వయసుతో వచ్చిన అనుభవంతో
మీకో ముచ్చట చెబుతాను
బుద్ధిగా విని నా బతుకు ధన్యం చేస్తారు గదూ?!

**Nostalgia :**
పట్టణానికి అవలనున్న సుందరమైన కొండల్లో పుట్టాను
చాలా ఏళ్ళ కిందట!
పుడమితల్లి కడుపు చీల్చుకొని బయటికొచ్చిన క్షణమే
బెదిరి, అదిరి భయపడ్డాను
కానీ, ఆ చల్లని తల్లి దయవల్ల బతికి – గొప్ప చెట్టునై
వందల రకాల జీవరాశులకు ఆలవాలమయ్యాను!

ఒకానొక రోజు మనుషులు కొందరు నిలువునా నను కూల్చి
నాగరీకతకు ఆటపట్టయిన ఈ నగరానికి తరలించారు
అప్పటి ఆ ప్రయాణంలో నా ఎద రొద ఏంటో తెలుసా?
పరోపకారంతో పరవశిస్తున్న నన్ను
ఈ దుర్మార్గపు నరులెందుకు నరికేసారు అని!

తర్వాత, నా తనువుని తుక్కు తుక్కులుగా చేసి
నరనరాల్లో ఉక్కు మేకులు దించి
ఒక ఆకారానికి తీసుకొచ్చారు
ఎందుకింత చిత్రవధో నాకప్పుడు అర్థం కాలేదు!
అలా చేసిన నన్ను, ఉత్తుంగ తరంగాలను
తరతరాలుగా తరగకుండా ఉత్పత్తి చేస్తూ
సమస్త జీవకోటికీ నరనరాల్లో ఉత్తేజమ్ జమచేసే
సాగర తీరపు విశ్వవిద్యాలయం తరగతి గదిలో పెట్టారు
అంతే! నాలో తెలియని భావాలు భళ్లుమని
అంతటి కోపావేశంలో కూడా ఊరట కలిగింది!


ఈ చదువుల భాండాగారంలో మొదటిసారిగా నాపై
శ్రీశ్రీ కలగన్న మరో ప్రపంచపు దూత ఒకడు కూర్చున్నాడు
వాని మేధాతనం, ఊహాకల్పనతో
నాకు కూడా జ్ఞానం అబ్బడమ్ మొదలైంది
తరువాత హేమాహేమీలైన అధ్యాపక–విద్యార్థుల
బృంద జ్ఞానపు గానంలో తడిసిముద్దయ్యాను
ఆ జ్ఞానామృతాన్ని కడుపారా సేవించి
నాలోనున్న Material తత్వాన్ని
Sublimeగా Liberate చేసుకోగలిగాను!

ఇక్కడ నాకెన్నో తీపి గుర్తులున్నాయ్..
ఓ పడుచును మనసారా ప్రేమించిన కుర్రవాడు
తనలోని భావాలను వ్యక్తపరిచే శక్తి లేక
నను బ్రోచిన క్షణాలు.. సుగంధ సుమధురాలు
అప్పుడు నా తనువుని అతని ప్రేమతత్వపు చిత్తరువుగా చేసి
తన ఎదలోని భావాలను ఆ వన్నెచిన్నెల చిన్నదాని
కళ్ళకు కట్టినట్టుగా ఉంచడానికి
నాపై లిఖించిన గీతలు, రాతలు పిచ్చిపిచ్చిగా ఉండొచ్చును గాక
కానీ వాటిని, ఆ వలపు జంటలు ముద్దులతోనిచ్చిన
పచ్చబొట్లలా చూసుకుంటాను
నిరంతరం కన్నీటిబొట్లను ఆనందంతో జారవిడిచి,
అలాంటివి ఎన్ని ఎక్కువగా ఉంటే
అంత ధన్యురాలిగా నను నేను భావించుకుంటాను!
కానీ, పరీక్షల్లో కాపీ కొట్టడం కోసమ్
రాసిన నా'పై' రాతలు మాత్రమ్
చిరాకుగా నల్లని బొల్లి మచ్చల్లా నను ఇబ్బంది పెడతాయ్!

ఏమైతేనేమ్ ..
ఎన్నో వేల యువతీ యువకులు
నను వినియోగించుకుని నిలదొక్కుకుని
వినీలాకాశంలో వినూత్న తారలుగా
వెలుగొందుతున్నారనే విషయం జ్ఞప్తికి రాగానే
వొళ్లంతా ఆప్యాయతతో జలదరిస్తుందర్రా.. !

కొందరు కుర్రదీ, కుర్రోళ్ళయితే మరీనూ
ప్రపంచపథంలో పడి ఎన్నో ఘనతలను సాధించినా
తరగతి గదిలో చావుకు దగ్గరగా ఉన్న నన్ను
వారి వారి హృదయాంతరాల్లో పదిల పరుచుకొని
వీలు చిక్కినప్పుడు
నా దగ్గరకు వచ్చి పసిపిల్లల్లా మురిపెంగా స్పృశిస్తారు
నాపై కూర్చొని
తమ గతకాలపు మధురానుభూతులను తలచుకుంటారు
కృతజ్ఞతతో ఆనందాశృవులను విదిలిస్తూ
ఇది కదా, నిర్వాణానికి అసలైన క్షణమ్
అని అనుకుంటానర్రా.. జిలుగు వన్నెలూ!

ఇదర్రా.. ఈ ముదుసలి ప్రాణం లేని
జవసత్వాలొదిలిన చెక్క బల్ల యొక్క స్వగతం!
'నను మరువకు నరుడా' అంటూ
ఇక సెలవు తీసుకుంటానర్రా... పిడుగులూ! ■





# మూడు దశాబ్దాల కాలపు తివాచీపై నేసిన కథా చిత్రమాల

- వి.విజయ కుమార్
85558 02596

**జీ**వితం కథ అయినప్పుడు మనిషి హృదయాన్ని ఎందుకు పట్టుకుంటుందో తెలీదు. కూలిపోతున్న పూరి గుడిసె చిత్రం ఒక అందమైన గులాబీ చిత్తరువు ఇచ్చిన లాంటి అనుభూతిని సైతం ఇవ్వడం ఆశ్చర్యం. కళాత్మకంగా చెప్పేదేదైనా హృదయాన్ని తాకడం వల్లేమో జీవితాన్ని కథలుగా మలచినా, కూలిపోయిన గుడిసెల్ని చిత్తరువులో బంధించినా రసానుభూతిని కలిగించడం అనిపిస్తుంది.

కేశవ్ పగిలిన పాదాల నెత్తుటి చారికల్ని ఆర్తిగా స్పృశించిన వారు. గొప్ప ఆర్థిక విశ్లేషణతో దేశ భవిష్యత్తు పట్ల ఆరాటం ప్రదర్శించినవారు. పోరాటపు స్ఫూర్తిని రగిలించినవారు. గణాంకాల లెక్కలతో, గగుర్పాటు కలిగించే సత్యాలతో నిస్తేజంగా వున్న సామాజిక వికృతిని ప్రతిభావంతమైన భాషతో, ప్రయోజనకరమైన రీతిలో ప్రభావశీలమైన వ్యాసకర్తగా అలరారిన వారు.

'నెమిసిస్'కు నాందీ ప్రస్తావన రాస్తూ సర్వమంగళ గారి పొయటిక్ హృదయాన్ని పట్టి, అనితర సాధ్యమైన శైలిలో తన కవితాత్మక భావావేశంతో తననే డామినేట్ చేశారేమోనన్నంత గొప్పగా వ్యక్తీకరించిన కవి హృదయం కలవారు ఈ కేశవ్ రావు గారు.

ఇప్పుడిదిగో కేశవ్ 'ఆకలి' కథలతో కథా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. పచ్చి నిజాలు రాసే పాత్రికేయుల కలాలకు గణాంకాలు నప్పినంతగా జీవన చిత్రీకరణలు ఒప్పవేమో! కానీ కేశవ్ కథల్లో జీవితం ఉంది, ఆర్తి ఉంది, పనికట్టుకొని చెక్కని శిల్ప వైవిధ్యం వుంది. కథ అనగానే ఏదో మెలిక, ఏదో ముగింపూ, ఒక కన్నీటి బొట్టో, ఒక వెంటాడే జ్ఞాపకామో. అవన్నీ ఉంటేనే కథ, లేదంటే కాదనే సంప్రదాయం నుంచి జంప్ చేసి, ఎదురైన అరుదైన సంఘటనల్ని పట్టుకొని, చిత్రిక పట్టి, పత్రిక పట్టి పంపించే సాధారణ కథా రచయిత తపనతో కాకుండా చాలా కాజువల్‌గా రాసిన కథలివి.

ఆకలి ఉన్నంత కాలం ఆర్తి ఉంటుంది. ఆ ఆర్తిని పట్టుకొని కథ రాసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆర్తి అవసరంలేని ఒక సమాజ నిర్మాణం కోసం ఏం చెయ్యాలో చెప్పే ప్రయత్నం ఇంచుమించు ప్రతి కథలోనూ అంతర్లీనంగా తారసిల్లుతుంది. అదే కేశవ్ గొప్పదనం. కేశవ్ రాసిన ఆకలి కథల మెచ్యూరిటీ క్రమంగా తొలి కథ నుంచి విస్తరిస్తూ చివరి కథతో పరిపూర్ణమౌతుంది.

సర్వసాధారణంగా, రోజువారీగా జరిగే, యాదృచ్ఛికంగా ఎదురయ్యే సంఘటనల 'ఆకలి' కథా సంపుటిలో మనం చూసే జీవితమే వుంది, ప్రతి అద్దాలో నిలబడే, ఉస్సూరని కనబడే చంద్రన్నల వైపు చూడాలే గానీ హౌరా అయినా హైదరాబాద్ అయినా, జనపనార కార్మికుడైనా, కాంక్రీటు శ్రామికుడైనా అవే కడగళ్లు.. కన్నీటి వడగళ్లు. పాతికేళ్ల క్రితం కథైనా అప్పుడు పుస్తకాలు అమ్మిన కూతురు స్థానంలో, ఇప్పుడు పుస్తెలు అమ్ముకొనే ఇల్లాళ్ళు అంతే తేడా జీవితం యధాతథం 'పాపులర్ రైటర్' కథ చదవగానే అంతరించి పోయిన అన్ పాపులర్ వార పత్రిక యుగంలో ఒకరిద్దరు మనోహర్లు గుర్తుకొస్తారు. కొన్నేళ్ల పాటూ ఇన్వెస్టిగేటివ్ చేతబళ్ళతో, పుర్రె బొమ్మలూ, తెల్ల పాములూ, జాకెట్ బొందులూ, బూతు ఎడ్యుకేషన్, ద్వంద్వార్థాలూ, దొంగార్థాలూ ఎలా వెలిగాయో ఆ తర్వాత స్పందన లాంటి పాఠకుల చైతన్యంతో ఎలా కొండెక్కాయో భలేగా చెప్పారీ కథలో!

'నన్ను క్షమించకు!' 90ల నాటి ఒక రియలిస్టిక్ జీవన చిత్రం. ఓ పదిహేడేళ్ల అమ్మాయి పెళ్ళైయ్యాక తన ఊహా లోకాల్లో చిత్రించుకున్న వ్యక్తి ఏ రకంగానూ పొంతన లేని

భర్తగా ఎదురవ్వడంతో తీవ్రంగా డిజప్పాయింట్ అవుతుంది. కొట్టేవాడో, తిట్టేవాడో, కట్నం కావాలనో, వేధించేవాడో యేదో ఒక కేటగిరీలో ఇమిడే వాడో అయినా బావుండు. కానీ వీడు మౌనమై మరో వ్యక్తిని హృదయ పీఠంపై మోస్తున్న వాడు. అదే అసలు సమస్య. ఇప్పుడు ఈ బ్రేక్ అప్ వెబ్ సీరీస్ కథనాలు చూసే మనకు నవ్వొచ్చినా తొంభైల నాటి ఆల్బమ్ మెమరీ కాబట్టి అప్పటికది ఒక పరిష్కారం లేని సమస్యే. అయినా అప్పటికే సహజీవనమా, డివర్సా? అంటో రమతో అనిపించడం రచయిత పరిణితికి నిదర్శనం.

'మార్పు' నిజంగా ఒక అద్భుతమైన మార్పు గురించి హృద్యంగా తాకే కథ. అవినాష్ ఒక సగటు యువకుడిగానే ఇందు లాంటి రిచ్ గాళ్‌ని పెళ్లి చేసుకుంటాడు. గెస్ట్‌గా వచ్చిన సమీర్‌ని సరిగ్గా రిసీవ్ చేసుకోలేదని కినుక వహించిన అవినాష్ ఇందు లాంటి అమ్మాయి అంతకంటే భిన్నంగా ప్రవర్తించలేదనే వాస్తవాన్ని గ్రహించలేకపోతాడు. అసంతృప్తి వెంటాడుతూనే ఉంటుంది. ఒక సందర్భంలో హైదరాబాద్ లో వున్న సమీర్ దగ్గరకు వచ్చిన అవినాష్ సమీర్ చేసే సామాజిక సేవను చూసి తీవ్ర ఉద్విగ్నతకు లోనౌతాడు.

మందుల్ని సేకరించి హాస్పిటల్ దగ్గర పేదవారికి పంచే సమీర్ సేవా కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసిన అవినాష్‌లో మానవీయ కోణం పురివిప్పుతుంది. ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకుంటాడు. పది లక్షల ఆర్థిక సహాయం ఇస్తూ ఒక గొప్ప మాట చెబుతాడు. నేనూ నీలా పనిచేయడానికి మారతా నంటాడు. అదే 'మార్పు'. వ్యక్తులు సినిమాల్లో, కథల్లో మారినట్టు నిజజీవితంలో మారతారా? కచ్చితంగా మారతారు. సరైన జ్ఞానం దిశగా పయనిస్తే!

'చెప్పాలని వుంది' అనుకొని గొంతుకలోనే ఆగిపోయిన ఒక విషాద గాథ ఈ కథ! మసీదు కూల్చివేత తర్వాత అనేక మతపరమైన అల్లర్లకు ఆలవాలమైంది దేశం. మైనారిటీల మనుగడ ఒక దశలో ప్రశ్నార్థకంగా మారింది. రైల్లో ప్రయాణిస్తున్న ఒక ముస్లిం కుటుంబంపై అల్లరి మూకలు దాడిచేసి అమానుషంగా బలి తీసుకోవడం వెనుక ఔచిత్యం ఏమీ వుండదు. మనిషి మనిషిని ప్రేమించడానికి ఆహార్యమో, పెంచుకున్న గడ్డమో, వేసుకున్న దుస్తులో, అమ్మ నేర్పిన భాషో షరతులైతే మతం ఏం నేర్పుతున్నట్టు? ఎంతో శ్రమ కోర్చి రాయి రాయి మోసిపేర్చిన కట్టడంతో పాటు ఎన్ని హృదయాలు ఛిద్రమై ఆ శిథిలాల్లో కుప్పకూలాయ్? రాళ్ళ మీదా రప్పల మీదా ద్వేషాలు పెంచే అనాగరిక మతాలకు దన్నుగా వుండే మనిషి మారేదెప్పుడు? ఆ ద్వేషాగ్నిలో శలభాల్లా కాలి బూడిదయ్యే అమాయక ప్రజలను రక్షించగలిగే జ్ఞానాన్ని కలిగించే దెవరు? అదిగో అప్పుడే ఇలాంటి కథల అవసరం ఉంది. 'చెప్పాలని వుంది' అనుకోవడమే కాదు చెప్పి తీరాల్సిందే! గొంతు పెగుల్చుకొని, భూనభోంతరాళాలు పిక్కటిల్లేలా చెప్పాలి!

'తెలివైన పరీక్ష' ఫక్తు చందమామ కథే అయినా ఒక ఎనెక్డాట్‌గా తీసుకుంటే ఒక గొప్ప కథ కూడా! జీవితంలో ప్రతి సన్నివేశంలోనూ అంతర్లీనంగా నడిపించే ఒక జ్ఞాన శకలం ఉంటుంది. పట్టించుకోము గానీ జీవితాన్ని సక్రమ మార్గంలో నడిపించేందుకైనా, వక్రమార్గం పట్టించేందుకైనా ఈ జ్ఞానమే మార్గదర్శనం చేస్తుంది. మానవీయ గ్రంథాలు చదవటంవల్ల మనిషి సన్మార్గంలో నడిస్తే, మత గ్రంథాలు చదువుకోవడం వల్ల వికృతమైన దారిపడతాడు. కోశాధికారిగా ఎంపిక చేయడానికి మంత్రి ఒక పరీక్ష పెడతాడు. అందులో సోమేశ్వరం ఎంపిక అవుతాడు. సోమేశ్వరానికి ఉన్నదీ, మిగతావారిలో లేనిదీ ఒక్కటే! యే బాటలో పయనించాలన్నా ఆ తోవని చూపే మార్గదర్శకాలు సరిగ్గా ఉండాలి. సరైన రీతిలో వాటిని జ్ఞానానికి అనుసంధానం చేసుకోవాలి. జ్ఞానాన్వేషణ సరైన రీతిలో జరగాలి. లక్ష్యం చేరడానికి మార్గం తెలియాలి. మార్గం తెలియాలంటే జ్ఞానం కావాలి. జ్ఞానం దానంతటదే వచ్చిపడేది కాదు! త్రిలోకాల్లో ఏం జరుగుతుందో కళ్ళు మూసుకొని చెప్పే తపఃశక్తి లాంటి అబద్ధపు జ్ఞానం కాదది! ఒక అన్వేషణ ద్వారా జరగాల్సిన పని, శోధించి తెలుసుకోవాల్సిన మార్గం! సోమేశ్వరం చేసిన పని అదే! మార్గం ఓపికగా తెలుసున్నవాడే విజేత! అది కోశాధికారి కొలువుకైనా, విప్లవం కోసమైనా!

'క్రికెట్ స్కోర్' అనే ఒక అనవసరపు జాడ్యం ఒక పేద దేశంలో ఒక ఫాషన్‌గా వుంటూ పాషన్‌గా మారి సాధారణ జీవితాల్లో తొంగిచూసి ఎంతగా విధ్వంసం చేసిందో ఒక సంఘటన ఆలంబనగా చెప్పే ప్రయత్నం చేశారు. నిజానికి ఈ కథ కనెక్టివిటీ ఓ పదిహేనేళ్ల వెనక్కి వెళ్లి చూస్తే అది యెంత నిజమో తెలుస్తుంది.

'కాపీ రైటింగ్' కూడా అంతే! సునిశితమైన హాస్యంతో అందించిన ఈ కథలో విద్యా వ్యాపార సంస్థల్లో జరిగే దారుణాల లోగుట్టును ప్రతిభావంతంగా ఆవిష్కరించారు. 'కొత్తగా రెక్కలొస్తే', 'సాఫ్ట్ వేర్ బెలూన్' మరింత డిఫ్లేట్ అయితే జరుగుతున్న, జరగబోయే విపరీత, విపత్కర పరిణామాలను చిత్రించిన ఈ కథల్లో అనివార్యంగా భ్రష్టు పట్టిపోతున్న ఈ ధోరణి మారాల్సిన అగత్యాన్ని గొప్పగా చెప్పారు కేశవ్ ఈ కథల్లో.

పెళ్లి, ఇంద్రధనస్సు వ్యథలు మనం రోజూ చూసే పురుష

పుంగవుల కథలు. కాకపోతే స్త్రీలు యే చైతన్యం కలిగి ఉండాలో ఆ చైతన్యాన్ని కలిగించే, రగిలించే జ్వలనాలు. 'నన్ను క్షమించకు' కూడా ఈ ఛాయలతో వున్నా అంతర్గతంగా ఒక పశ్చాత్తాప హృదయాన్ని పురుషుడిలో చిత్రించే ప్రయత్నం చేశారీ కథలో కేశవ్!

'వేరు వాసన' మారిన ఆధునికీకరణ తాలూకూ ముక్కుపుటాలను బద్దలు చేసే ఒక అనివార్యపు డియోడరెంట్! అది సుగంధం కావాల్సిన పనిలేదు! మన నాసికాలకు అందనంత దూరంగా వుంటే ఇంకా పర్లేదు. కానీ అది ఊపిరిలోకి దూరి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది! టైమ్ మెషీన్‌లో ఓ అర్థ శతాబ్దం వెనక్కి వెళ్లే అవకాశం తాతయ్యకి దొరికితే బావుండు!

కేశవ్ రాసిన ఈ పదహారు కథలూ మూడు దశాబ్దాల కాలం అనే కాన్వాస్ పై చిత్రించిన వేరు వేరు జీవిత చిత్రాలు. సమాజమూ, జీవితమూ కలగలిపి అల్లుకున్న ఎంబ్రాయిడరీ! కొన్ని మెరుస్తాయ్, కొన్ని మిణుకు మిణుకుమంటాయ్, కొన్ని మురిపిస్తే, కొన్ని మరిపిస్తాయ్. మరికొన్ని మరచిన జ్ఞాపకాల్ని వెలికి తెస్తాయ్.

కథ అల్లిబిల్లిగా అల్లినా, అసలేమీ అల్లకపోయినా, యే కథైనా ఒక గొప్ప అనుభూతినిస్తే చాలు అనుకునేవారికీ, సామాజిక ప్రయోజనం లేని కథలా అని పెదవి విరిచేవారికీ ఇద్దరికీ సంతృప్తినిచ్చే కేశవ్ 'ఆకలి' కథలివి! తప్పక చదవాల్సిన సజీవ సంఘటనల నిలువెత్తు జీవన చిత్రాలు. ■

**" తెలుగువాడివై తెలుగు రాదనుచు**

**సిగ్గులేక ఇంక చెప్పటెందుకురా**

**అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు**

**సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!"**

**- కాళోజీ నారాయణరావు**



## అంతిమ ఫలితాలు

**కొ**న్ని ప్రేమలు
పరువు చెట్టు కొమ్మకో
పెద్దరికం దూలానికో ఉరివేసుకుంటాయి
కొండొకచో ఉరివేయబడుతుంటాయి

కొన్ని ఆశయాలు
అవసరాల అంగట్లో అమ్ముడుపోతుంటాయి
వేలం గద్దెనెక్కి
ధరను నిలకడగా పెంచేసుకుంటూ
సిగ్గుమాలిన పాట పాడుకుంటుంటాయి

కొన్ని కోపాలు
పంట నొక్కిపెట్టిన కింది పెదవి ఒత్తిడిలో
కనిపించీ కనిపించని గాటుగానో
చెమర్చుతోన్న రక్తంగానో
చేతగాని నిదర్శనం చూపుతుంటాయి

కొన్ని అవమానాలు
నేల చూపులు చూస్తున్న తలవంపులో
బేలతనపు భుజం ఆసరాలో
కాలగర్భానికి పయనమౌతుంటాయి

కొన్ని దు:ఖాలు
కన్నీటి కెరటాల కదలికలను
కనురెప్పల చెలియలికట్ట దాటనీయకుండా
నిషిద్ధగీతం నిశ్శబ్దంగా ఆలపిస్తుంటాయి

ఆరంభానికి తగని అంతిమ ఫలితాలు
అప్పుడప్పుడూ ఇలా ప్రదర్శితమౌతుంటాయి

**- శ్రీధర్ చౌడారపు**

# ఇలాంటి ప్రయత్నం ప్రతి ఏటా జరగాలి

**అనంతపురం జిల్లా రచయిత్రుల కథా సంకలనం ఆవిష్కరణ**




**ముంగారు మొలకలు కథా సంకలనాన్ని ఆవిష్కరించిన దృశ్యం**

రెండేళ్ల ఎదురుచూపు తరువాత అనంతపురం జిల్లా కథయిత్రుల కథా సంపుటి 'ముంగారు మొలకలు' ఆవిష్కరణ 28.3.2022 సాయంత్రం అనంతపురం పట్టణంలోని ఏపీ ఏన్జీవో హెూంలో జరిగింది. సమావేశానికి ప్రముఖ కథా రచయిత్రి, అనంత రచయిత్రుల వేదిక అధ్యక్షులు జి.నిర్మలారాణి అధ్యక్షత వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బాలాకుమారి పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రాచార్యులు, ప్రముఖ సాహిత్య విమర్శకులు డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి పుస్తక సమీక్ష చేశారు. సాహితీ స్రవంతి సభ్యురాలు డా॥ బి.హేమమాలిని అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. తొలుత జి.నిర్మలారాణి మాట్లాడుతూ స్త్రీలు రచన చేయాలంటే ఎన్నో ఇబ్బందులు, ఆంక్షలు కుటుంబం నుంచే మొదలవుతాయని, వాటన్నింటినీ దాటుకుని చాలా కొద్దిమంది మాత్రమే ఈ రంగంలోకి రాగలుగుతున్నారని అన్నారు. అవకాశం వస్తే ఎంతోమంది మహిళలు కలం పట్టి తమ గొంతును చాలా గట్టిగా వినిపించగలరని అన్నారు. పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ బాలాకుమారి మాట్లాడుతూ.. ఇంత చక్కటి పుస్తకాన్ని తెచ్చినందుకు రచయిత్రులను అభినందించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు, పుస్తక సంపాదకులు డా॥ ఎం.ప్రగతి మాట్లాడుతూ ఇటువంటి కథల సంకలనాన్ని తీసుకురావాలన్న ఆలోచన ఎలా వచ్చిందో వివరించారు. అనంతపురం జిల్లాకు చెందిన రచయిత్రుల కథలను మాత్రమే ఈ సంపుటిలోకి తీసుకొన్నామని, దీనికోసం ఎంతో కసరత్తు చేయాల్సి వచ్చిందని వివరించారు. అనంతపురం జిల్లాలోనే పుట్టి పెరిగిన వారు, ఈ జిల్లాలో పుట్టి మరొక ప్రాంతానికి వెళ్లిన వారు, వేరు ప్రాంతాల్లో పుట్టి పెరిగి, ఉద్యోగం, వివాహం తదితర కారణాల వల్ల ఈ జిల్లాలో స్థిరపడిన వారు .. ఇలాంటి ప్రతిపాదికన రచయిత్రులను ఎన్నుకున్నామని చెప్పారు. ఇందులో నాలుగు తరాలకు చెందిన రచయిత్రుల రచనలున్నాయని, 85 ఏళ్ల వయసున్న వారినుంచి, ఇప్పుడిప్పుడే కథా రచన చేస్తున్న యువతులూ ఈ సంపుటిలో చోటు చేసుకున్నట్టు వివరించారు.

డాక్టర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి కథలను సమీక్షిస్తూ ... ఇందులో ఉన్న 25 కథలూ వస్తువైవిధ్యం కలిగినవని, ఏ కథలో కూడా ఒకే అంశం పునరావృతం కాలేదని అన్నారు. వస్తువు బాగున్నప్పటికీ రచనా విధానంలో కొన్ని మెలకువలు నేర్చుకోవలసిన వారు కొంతమంది ఉన్నారని, అందరికీ ఉపయోగపడే విధంగా ఒక కార్యశాల నిర్వహిస్తే బాగుంటుందని సూచన చేశారు. ఈ సంకలనంలోని కథలను కొన్ని మానవ సంబంధాలను గురించి చెప్పేవి, కొన్ని స్త్రీ పురుషుల మధ్య సంబంధాన్ని గురించి తెలిపేవి, మరికొన్ని రాజకీయ సంబంధమైనవి, ఇంకొన్ని స్త్రీలు తమ స్వయంశక్తితో తమ సమస్యలను తామే పరిష్కరించుకునే దిశగా సాధికారాన్ని ప్రదర్శించేవిగా విభజించి, ఆయన చక్కని విశ్లేషించారు.

కార్యక్రమంలో తరువాత కొంతమంది రచయిత్రులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మొదటిసారిగా పుస్తక రూపంలో తమ రచనలను చూసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. ఇటువంటి సంకలనాలు సంవత్సరానికి ఒకటైనా తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. స్త్రీలు సాహిత్యరంగంలోకి ప్రవేశించాలంటే వారి ఇళ్లలోని పురుషులు పూర్తి సహకారం అందించాలని ఆశించారు.

కార్యక్రమానికి వచ్చిన సాహితీవేత్తలు డా॥ శాంతి నారాయణ, డా॥ తూముచెర్ల రాజారాం, డా॥ బండి నారాయణ స్వామి, డా॥ రాధేయ మధురశ్రీ తదితరులు రచయిత్రుల ప్రథమ ప్రయత్నాన్ని స్వాగతించారు. స్త్రీలు సాహిత్యంలోకి ఇంత పెద్దఎత్తున రావడం హర్షించదగిన పరిణామమని చెప్పారు. చివరగా చిలుకూరి దీవెన వందన సమర్పణ చేశారు. ఈ సభలో కథా రచయిత్రులు శోభామణి, పోరాల శారద, చిలుకూరి లక్ష్మీదేవి, శశికళ, చిలుకూరి దీవెన, మాడుగుల సులోచన, బి.హేమమాలిని, రచయితలు డా॥ అంకె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ■

## 'వాన మెతుకులు' పరిచయ సభ


సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటేశన్

రాయలసీమ రైతు బతుకుల్ని, వెతల్ని వర్తమాన సాహిత్య సమాజానికి పరిచయం చేసిన కథల సంకలం వానమెతుకులని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, ప్రముఖ రచయిత ఈ.వెంకటేశ్ అన్నారు. కర్నూలులోని లలిత కళాసమితిలో **24.4.2022** తేదీ ఆదివారం రాయలసీమ ప్రచురణల ఆధ్వర్యంలో వెలువరించిన రైతుల కథల సంకలనం వానమెతుకులు పరిచయ సభ సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సభాధ్యక్షతన జరిగింది. కథల సంకలనాన్ని ఆవిష్కరించిన వెంకటేశన్ మాట్లాడుతూ... కథలన్నీ జీవితాలకు దగ్గరగా కొనసాగాయని అన్నారు. ఈ కథల్లో సమస్యలొక్కటే చెప్పడం కాకుండా సంస్కృతి, సంస్కృతిలో భాగంగా మిళితమైన వివిధ ఆచారాలు, వాటి పరిణామాలను కథకులు విశ్లేషించారని అన్నారు. గోనెగండ్ల మండలం రాళ్ళదొడ్డికి చెందిన రైతు డిజి ఈరన్న మాట్లాడుతూ రైతు ఎంత నష్టపోయినా వ్యవసాయాన్ని వీడడని, నష్టమొచ్చినా నిష్క్రమించడని అన్నారు. ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని, శాస్త్రవేత్తల పరిశోధనలు రైతును బతికించేందుకు ఉపయోగపడాలని అన్నారు. న్యూ సోషలిస్ట్ ఇన్నియేటివ్ ఆఫ్ ఇండియా కన్వీనర్ జి.భార్గవ మాట్లాడుతూ.. ఈ సంకలనం రైతు జీవితాలను వివరించటమే కాదు; పాలకుల దుర్మార్గాలను ఎండగడుతుందని అన్నారు. రాయలసీమలో కథా సాహిత్యం బాగా విస్తృతమౌతుందని, ఇందులోని కథలు రైతు జీవితాలను ఆవిష్కరించాయని అన్నారు. ఈ సంకలనంలో చోటు చేసుకుని శ్రీ గుర్రాల లక్ష్మీప్రసాద్ స్మారక అవార్డు అందుకున్న ఊరిమర్లు కథా రచయిత మారుతీ పౌరోహితానికి ప్రముఖకవి జి.వెంకటకృష్ణ పురస్కారాన్ని అందించారు. సభను ప్రచురణల సంపాదకలు ఇనాయతుల్లా ప్రారంభించారు. మహమ్మద్ మియా రైతు చైతన్య గీతాలను ఆలాపించారు. కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## The Great Wager and Other Poems ఆవిష్కరణ

శ్రీకాకుళం జిల్లా గర్వించదగ్గ ఆంగ్ల రచయిత, సుప్రసిద్ధ అధ్యాపకులు కీ.శే.ఉప్పాడ అప్పారావు రచించిన ఇంగ్లీషు పద్య సంకలనం 'ది గ్రేట్ వేజర్ అండ్ అదర్ పోయమ్స్' పుస్తకాన్ని గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 30వ తేదీ బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఆవిష్కరించారు. వివిధ రీతులకు చెందిన 30 పద్య ఖండికలు ఈ పుస్తకంలో ఉన్నాయి. 14 లైనులుండే సానెట్స్, 16 లైనుల చొప్పున ఐదు భాగాలున్న 'ది సన్' అనే ఒక ఖండిక, రామాయణంలో భరతునికి శ్రీరాముని సమాధానంలో కైకేయి గొప్పదనం గురించి దీర్ఘకవిత, బమ్మెర పోతన విరచిత 'ఎవ్వనిచే జనించు' పద్య సారాంశాన్నిచ్చే ప్రార్థనా కవిత, గురజాడ వారి 'ముత్యాల సరాలు' నుంచి 'దేశమంటే మట్టికాదోయ్' సారాంశానుసరణ; 'యూరీ గెగారిన్' గురించి ఒక కవిత ... వైవిధ్యభరితంగా ఈ సంపుటిలో చేసుకున్నాయి. ఉప్పాడ వారి ఆంగ్ల కవిత్వం బహుముఖీనంగా ప్రదర్శితమైందనీ పుస్తక సమీక్షా ప్రసంగం చేసిన విశ్రాంత ఉపన్యాసకులు, అప్పారావు గారి శిష్యులు జి.జె.గాంధీ పేర్కొన్నారు. ఈ కవి సహజంగానే ప్రకృతి ప్రేమికులనీ, ఆయన ప్రావీణ్యం భాషాపరంగా నారికేళపాకమని అన్నారు. భావ సౌందర్యంతో విలసిల్లే పదప్రయోగాలు ఈ కవితల్లో అలరారుతున్నట్టు వివరించారు.

కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ గ్రంథావిష్కరణ చేయగా, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి సభకు అధ్యక్షత వహించారు. గార కృష్ణారావు, అట్టాడ అప్పల నాయుడు, చరిత్ర ఉపన్యాసకులు చిన్నారావు ప్రసంగించారు. ఇంకా శశిభూషణ్, ఫణికుమార్, జె.ఎస్.ఎస్.ప్రకాష్, ఉమాదేవి, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు వందన సమర్పణ చేశారు. అప్పారావు గారి కుమారుడు ఉప్పాడ సుధాకరరావు కాపీరైట్స్‌తో Notion Press.com వారు ప్రచురించిన ఈ పుస్తకం అమెజాన్ ద్వారా పొందవచ్చు.



**– వి.జి.కె.మూర్తి,**
గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం

## 'నాన్న పచ్చి అబద్ధాల కోరు'కు సాహితీ పురస్కారం

ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయుడు సురేంద్ర రొద్ద రచించిన 'నాన్న పచ్చి అబద్ధాల కోరు' పుస్తకానికి కుప్పం రెడ్డమ్మ సాహిత్య పురస్కారం లభించింది. ఆదివారం చిత్తూరు హోటల్ సింధు టవర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి కట్టమంచి బాలకృష్ణ రెడ్డి, కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ అధినేత్రి డాక్టర్ రామలక్ష్మమ్మ కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారన్ని అందజేశారు. డాక్టర్ నిరంజన్ రెడ్డి రోజాప్రియ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.10 వేల నగదు, దుశ్శాలువా, మొమెంటోతో సురేంద్ర రొద్దని ఘనంగా సన్మానించారు. వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సురేంద్ర రొద్దని ఉపాధ్యాయ బృందం, సాహితీ ప్రియులు అభినందించారు.



సాహితీ పురస్కారం అందుకొంటున్న సురేంద్ర రొద్ద



**చిత్తూరు జిల్లా పుత్తూరు ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయంలో 9.4.22న ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన 30 మినీ కథల సంపుటి 'మిక్చర్ పొట్లం' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా విద్యా శాఖాధికారి వి.శేఖర్, అష్టావధాని ఆముదాల మురళి, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, శ్రీశ్రీ కళా వేదిక ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరినాయుడు, సాహితీ ప్రియులు బి.భాస్కర్ రాజు, యుగంధర్ రాజు, గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.**

## జీవిత సత్యాలను ఆలపించిన 'జీవనగీతం'

నిత్యజీవితంలో అవలంబించాల్సిన నిజాలు, జీవిత సత్యాలన్నీ జీవనగీతం కావ్యంగా మన కళ్ళ ముందు పరచుకున్నాయని సీనియర్ ఐఏఎస్ అధికారి, సెర్ప్ సిఈఓ ఏయండి ఇంతియాజ్ అన్నారు. ప్రసిద్ధ నటులు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య రాసిన జీవనగీతం పద్యకావ్య ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రవీంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో అధినేత జి.పుల్లయ్య అధ్యక్షతన కర్నూలులో పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక సమస్యలను కవిత్వంగా చెప్పడమే కాకుండా సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని మనిషి నిర్మించుకోవాలన్న వాస్తవాన్ని ఈ కవిత్వంలో చెప్పడం విశేషమని అన్నారు. ఈ జీవనగీతంలో మనిషి జీవన ప్రయాణంలో ఎదురయ్యే ప్రతి విషయాన్ని, ప్రతిఘటనను తనదైన శిల్ప నైపుణ్యంతో అక్షరీకరించి తెలుగు సాహిత్యానికి గొప్ప తాత్విక, మానవత, నైతిక సంపదను అందించారని పేర్కొన్నారు. ఇంతటి గొప్ప కావ్యాన్ని సాహిత్య సమాజానికి అందించిన పత్తి ఓబులయ్య అభినందనీయుడని ప్రశంసించారు.



పత్తి ఓబులయ్య రచించిన జీవనగీతం పద్య కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సాహిత్య ప్రకాశ్‌కు మహేశ్వరయ్య స్మారక పురస్కారం ప్రదానం



పురస్కార గ్రహీత సాహిత్య ప్రకాశ్‌తో కార్యక్రమ నిర్వాహకులు, అతిథులు

**ఉ**పాధ్యాయుడు, కవి, కథారచయిత, సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి సంకటి మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారం-2021 ప్రదాన సభ 27.4.2022వ తేదీన కర్నూలులో జరిగింది. ప్రముఖ కవి, రచయిత సాహిత్య ప్రకాశ్ తను రాసిన అక్షరం తలవొంచదు కవిత్వ సంపుటికి గానూ పురస్కారం అందుకున్నారు. మహేశ్వ రయ్య స్మారక ఉపన్యాసాన్ని సాహితీ స్రవంతి రాష్ట్రఅధ్యక్షులు కెంగార మోహన్ చేయగా; ప్రధాన వక్తగా జి.వెంకటకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల బసప్ప, ప్రజానాట్యమండలి బాధ్యులు బసవరాజు, నవలా రచయిత అజీజ్, సాహితీ స్రవంతి నగర గౌరవాధ్యక్షులు కవిత వెంకటేశ్వర్లు, అధ్యక్షులు అయ్యన్న, ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, ఉపాధ్యక్షులు విజయులు తనగల, నాయకులు పెరికల రంగస్వామి, సూగూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కదిరిలో ఆంగ్ల భాషా దినోత్సవం




విజేత విద్యార్థులకు బహుమతీ ప్రదానం

**యు**నెస్కో ప్రకటించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ డేను ఏప్రిల్ 23న కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ నిర్వహిం చింది. ఈ కార్యక్రమానికి ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్మిత అధ్యక్షత వహించారు. నేటి ప్రపంచీకరణ యుగంలో ఆంగ్లభాష లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా అనేక అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. తెలుగు, ఆంగ్లం పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా భాష సుసంపన్నమవుతుందని అన్నారు. విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు డా.కె.బయప్పరెడ్డి... షేక్స్పియర్ సాహిత్యం ప్రపంచ సాహిత్యంలో అజరామరామైనదని అన్నారు. మానవ సంబంధాలను ఆయన తన సాహిత్యంలో వ్యక్తీకరించిన విధానం నేటికీ మార్గదర్శిగా ఉందని వివరించారు. ఇంకా సాహితీ స్రవంతి అధ్యక్షులు పిల్లా కుమారస్వామి, ఆంగ్ల శాఖాధిపతి డా.హైదర్ వలి మాట్లాడారు. విద్యార్థులకు ఆంగ్ల భాషలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బహుమతులను స్పాన్సర్ చేసిన పిల్లా కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపన్యాసకులు మహమ్మద్ ఆలీ, తెలుగు ఉపన్యాసకులు డా.శ్రీనివాసులు, డా ఆదినారాయణ, డా.శివప్రకాష్, రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**25.4.2022న గుంటూరులో 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లూరు శివప్రసాద్ (సభాధ్యక్షులు), ఆచార్య ఎన్‌వి కృష్ణారావు, ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ; కెఎస్.లక్ష్మణరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్ (ఆవిష్కర్త), పెనుగొండ లక్ష్మీనారాయణ (రచయిత), డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, చిటిపోయ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.**

# కడియాల రామ్మోహన రాయ్ కన్నుమూత



సాహిత్య విమర్శను తన సామాజిక బాధ్యతగా గుర్తెరిగి నిబద్ధతతో వ్యవహరించిన డా. కడియాల రామమోహన్ రాయ్ గుంటూరులో ఏప్రిల్ 6న తుది శ్వాస విడిచారు. కొన్ని వందల సాహిత్య వ్యాసాలు, ఆరొందల పైచిలుకు గ్రంథ సమీక్షలు, శతాధిక రేడియో ప్రసంగాలు రామమోహన్ రాయ్ నిరంతర సాహిత్య కృషికి అద్దం పడతాయి. వీరు రాసిన 'తెలుగు కవితా వికాసం', 'కృష్ణశాస్త్రి కవితా వైభవం', '20వ శతాబ్ది తెలుగు కవిత్వం', 'గుంటూరి శేషేంద్ర శర్మ', 'ఉత్తరాంధ్ర నవలా వికాసం', 'కృష్ణశాస్త్రి కవితావైభవం', '13 ఉత్తమ కథలు', 'శ్రీశ్రీ రచనల ప్రభావం' వంటి గ్రంథాలు ఆంధ్ర పాఠకులు మరువలేరు. 1983లో వీరు సమర్పించిన 'తెలుగు సాహిత్యంలో కృషీవల జీవనం' అన్న గ్రంథానికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రసాదించింది. 1999లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమవిమర్శ పురస్కారం పొందారు.

ఆయన 1944 ఏప్రిల్ 11న గుంటూరు జిల్లా సిరిపురంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. తండ్రి కడియాల భద్రయ్య, తల్లి కమల. తండ్రి నాస్తికుడు, హేతువాది, సాహిత్యాభిలాషి కావడం వల్ల ఆయన ప్రభావం రామమోహన్ రాయ్‌పై పడింది. గుంటూరు హిందూ కళాశాలలో బీఏ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ (తెలుగు) చదివారు. గుంటూరు జేకేసీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. వీరికి తానా వారి ఉత్తమ విమర్శక పురస్కారం, 2017లో నవ్యాంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారి భాషా పురస్కారం, 2018లో అద్దేపల్లి రామమోహనరావు కవిత్వ విమర్శా పురస్కారం లభించాయి.

రాయ్ రాసిన 'మన తెలుగు నవలలు' తెలుగు నవలా ప్రియులకు కరదీపికగా నిలుస్తుంది. 'తెలుగు సాహిత్యంలో రైతు జీవితం', 'ఇరవయ్యవ శతాబ్ది తెలుగు సాహిత్య వికాసం', 'వెయ్యేళ్ల తెలుగు పద్య వికాసం – సమగ్ర పరిశోధన', 'మన తెలుగు నాటకాలు, నాటికలు' వంటి గ్రంథాలు ఇంకా ప్రచురణకు నోచుకోలేదు. 78 ఏళ్ల వయసులో కూడా ఉత్సాహంగా సాహిత్య సభల్లో పాల్గొని ప్రసంగించేవారు. రామమోహన్ రాయ్ మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటు. సాహితీ స్రవంతి ఆయన స్మృతికి నివాళ్లు అర్పిస్తోంది.

## కవులు మతోన్మాద చర్యలను సహించరాదు : ఇక ఇప్పుడు ఆవిష్కరణ

ప్రముఖ కవి, రచయిత కటుకోజ్వల ఆనందాచారి కవిత్వం 'ఇక ఇప్పుడు' పుస్తకావిష్కరణ 24.4.2022 ఆదివారం సాయంత్రం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కబీర్ సమ్మాన్ అవార్డు గ్రహీత కె శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ 'తెలంగాణ మట్టి నుంచి వచ్చిన కవులు, రచయితలు మత ఉన్మాద చర్యలను సహించరు. ఇక్కడి రచయితలు, కవులు మానవతావాదాన్ని తమ కవిత్వజెండా చేసుకుని సాహిత్య సృష్టి చేస్తారు.' అని పేర్కొన్నారు. 'ఇక ఇప్పుడు' కవితల్లో మానవీయ స్పర్శ బలంగా వుందని, అదే నేటి సమాజానికి అత్యవసరమని అన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ... మనుషులను మతం పేరున విభజించే విధ్వంసకర భావజాలానికి వ్యతిరేకంగా ప్రగతిశీల సాహిత్యం విస్తారంగా రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి యాకూబ్, నందిని సిధారెడ్డి, మహెజబీన్, బన్న అయిలయ్య, సీతారాం, డా.ఎస్ రఘు, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, మెర్సీ మార్గరెట్, నస్రీన్ ఖాన్, వల్లభాపురం జనార్ధన, స్ఫూర్తి, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కట్టా నర్సింహ్మ, రాంపల్లి రమేష్, అనంతోజు మోహనకృష్ణ, సలీమ, నరేష్, తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



**ఇక ఇప్పుడు పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్; వేదికపై శివారెడ్డి, సీతారాం, యాకూబ్ తదితరులు**

# స్వీకారం




## బౌద్ధ జాతక కథలు

**రచన : యస్.డి.వి.అజీజ్**

**వెల : రూ.200 పేజీలు : 184**

**ప్రతులకు : రచయిత, 91331 44138**

ఇవి ఆకాశవాణిలో నాటికలుగా ప్రసారం అయిన బౌద్ధ జాతక కథలు. ఈ సంపుటిలోని 13 కథలను రచయిత ఎస్‌జి అజీజ్ గారు రేడియోకు అనుగుణంగా చాలా చక్కగా నాటకీకరించారు. వీటిని ఆకాశవాణి కర్నూలు కేంద్రం నుంచి ప్రసారం చేశాము. శ్రోతలు దీన్ని స్వాగతిం చారు. ప్రేమతో తమ సంతోషాన్ని, హర్షాన్ని, ఉత్తరాల ద్వారా, ఫోన్ల ద్వారా వ్యక్తపరిచారు. నాటి కథలు నేటికీ ప్రామాణికమని చెప్పటంలో ఎలాంటి సందేహమూ లేదు.

**- రొక్కం కామేశ్వరరావు**, సంచాలకులు, ఆకాశవాణి



## ముఖారి కవిత్వం

**రచన : రొక్కం కామేశ్వరరావు**

**వెల : 100 పేజీలు : 114**

**ప్రతులకు : 81063 67175**

ఇది రొక్కం కామేశ్వరరావు వెలువరించిన సరళమైన, స్పష్టమైన, సూటియైన కవిత్వం. వర్తమాన భారతం ఎదుర్కొంటున్న అనేక ఆటుపోట్లపై ఈ కవితలు ఘోషిస్తాయి. ఈ కవిది ప్రగతివాద, విశాల దృక్పథం. ప్రతి తలపూ జనపక్షం. మొత్తం 29 కవితలు ఉన్నాయి. ఈ పుస్తకంలో సగభాగంలో గతంలో ఆయన వెలువరించిన అంతర్వీక్షణం కవిత్వ సంపుటిపై సమీక్షలు, స్పందనలు ఉన్నాయి.

**- సాహితి**



## వాకిలి కవిత్వం

**రచన : ఒబ్బిని**

**వెల : 200 పేజీలు: 240**

**ప్రతులకు : 98495 58842**

ఇది 111 కవితలు తనలో నింపుకొని ఎదురుచూస్తున్న వాకిలి. మంచి కవిత్వం రాసే మంచి మనిషి ఒబ్బిని. వ్యక్తిగా ఆయన సౌమ్యులు. సహృద యుడు, మధ్య తరగతి మందహాసాన్ని తెలిసినవాడు. కవిత్వంలో ఒక మంచి వాక్యం ఎత్తిచూపితే మురిసిపోయే అల్ప సంతోషి. జీవితంలోని రాగద్వేషాలను ఆయన అపూర్వంగా ఆవిష్కరిస్తాడు. గొప్ప నిబద్ధతతో రాస్తాడు. మీరూ చదివి ఆస్వాదించండి.

**- సౌభాగ్య**



## జవాబు కావాలి కవిత్వం

**రచన : సలీమ**

**వెల : 120 పేజీలు : 112**

గుంటూరు జిల్లాలో పుట్టిన సలీమ ఇప్పుడు హైదరాబాదులో నవ తెలంగాణా పత్రికలో పనిచేస్తోంది. 2009 నుంచి కవిత్వం రాస్తోంది. భారత స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర అన్న అంశంపై నాగార్జున యూనివర్సిటీలో పరిశోధన చేస్తోంది. ప్రశ్నించటమే జ్ఞానాన్ని పెంచుతుందని, జవాబులు అప్పుడే దొరకుతాయని బలంగా నమ్మే వ్యక్తి. అందుకే ఈ పుస్తకానికి 'జవాబు కావాలి' అని పేరు పెట్టి సమాజాన్ని నిలదీస్తోంది. ఇది సలీమ తొలి కవితా సంపుటి.

**- శిలాలోలిత**



## ప్రజా వైద్యురాలు డా.మోటూరు ఉష

**సంస్మరణ వ్యాసాల సంకలనం**

**వెల : 50 పేజీలు : 112**

**ప్రతులకు : ఐద్వా, 94900 98620**

ప్రజా వైద్యురాలు డాక్టరు మోటూరు ఉష కమ్యూనిస్టు నాయకులు మోటూరు హనుమంతరావు, ఉదయం గార్ల కుమార్తె. అమ్మానాన్నల బాటలోనే ప్రజా పక్షపాతిగా,సామాజిక సేవకురాలి గా నడిచారు. అనేకమంది కమ్యూనిస్టు నేతల పిల్లల్లాగానే ఆమె కష్టాల మధ్య పెరిగారు. కష్టజీవుల సేవకు అంకితమై, ప్రజా వైద్యశాల ద్వారా ఎందరికో వైద్యసేవలు అందించారు. ప్రజా, మహిళా ఉద్యమాలకు బాసటగా నిలిచారు. 2018 జులై 2వ తేదీన కన్నుమూశారు. ఆమెను స్మరిస్తూ మిత్రులు, హితులు రాసిన జ్ఞాపకాల సంకలనం ఇది.



## జీవన వేదాలు - గుండె నాదాలు

**నూతలపాటి సాంబయ్య**

**వెల : అమూల్యం పేజీలు : 176**

**ప్రతులకు : రచయిత, 98480 34930**

ఇది నూతలపాటి కవితా స్రవంతి. ఇందులో కవి గారి సమకాలీన సామాజికాంశాలు ఎక్కువగా అక్షరరూపం దాల్చి, సాహిత్య లక్షణాల్లో ఒకదానిని పూర్తిగా ఆక్రమించాయి. ఇది కవి ఆత్మీయ, అంతర్లీన, అంతర్ముఖీన, అంతర్మథన భావ పరంపరకు అక్షరరూపంగా మారిన వయన రచన. ఇందులోని ప్రతి కవితా ఒక సందేశాత్మకతను సంతరించుకొని ఉంది.

**- మంచికంటి వేంకటేశ్వరరావు**

# అబ్బూరి రామకృష్ణారావు

జననం : 30.05.1896 మరణం : 30.04.1979



తొలితరం అభ్యుదయ వాది. రచయిత, నాటక కర్త.
శ్రీశ్రీకి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి. తెలుగునాట సాహిత్యంలో
తొలినాళ్ళలో కమ్యూనిస్టు భావాల వ్యాప్తికి కారకుడు.

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 3 ■ SANCHIKA - 8 ■ KRISHNA ■ May 2022
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ■ Date of Publication : 27.04.2022


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు




రూ. 180/-

- వీరబ్రహ్మం నడిపిన ఉద్యమం చాలా విశాల దృక్పథంలో నడిచింది. బుద్ధునిలాగా ఈయన స్వార్థాన్ని, సామాజిక అసమానతల్ని ద్వేషించారు. - జి.లక్ష్మీనరసయ్య
- వేమన, వీరబ్రహ్మంలు అసమానతల దోపిడీ వ్యవస్థని, కుల వ్యవస్థని, అంటరానితనాన్ని, మతాన్ని, మూఢాచారాన్ని, వేదాన్ని, యజ్ఞాన్ని, పౌరోహిత్యాన్ని సూత్రమే నిరసిస్తున్నారు. అంతటితో ఆగలేదు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దాన్ని బోనెక్కించారు. అదే వాళ్ళు చేసిన గొప్పనేరం. - కె.కళ్యాణరావు
- బ్రహ్మంగారి రచనలు 17వ శతాబ్దం నాటి రాజకీయ అస్థిరతనూ, ప్రజల కడగండ్లనూ వెలువరించిన సాంఘిక వైరుధ్యాలనూ తాత్విక భాష్యాలు. - ఎస్.గోపి
- వీరబ్రహ్మం తానేది చెప్పినా దాన్ని ఆచరించి చూపడానికి వీలుగా కులమతాలకు అతీతంగా వివిధ వృత్తుల వారిని దగ్గరకు చేర్చుకున్నారు. - దార్ల వెంకటేశ్వరరావు
- బ్రహ్మంగారు చేసిన గురుబోధలు ఎంతో గట్టిగా ఉన్నా పామర జనం గుండెల్లోకి సూటిగా దూసుకుపోయే బాణాల వంటివి. - అద్దేపల్లి



కాళికాంబా సప్తశతి
రూ. 100/-

పోతులూరి వీరబ్రహ్మం సమగ్రచరిత్ర
రూ. 200/-



వీరబ్రహ్మం పద్యాలు
రూ. 110/-

కర్మయోగి వీరబ్రహ్మం
రూ. 30/-

వీరబ్రహ్మం రచనలు
రూ. 70/-

విప్లవకవి యోగి వీరబ్రహ్మం
రూ. 120/-

తాత్వికత - తులనాత్మకత పోతులూరి వీరబ్రహ్మం
రూ. 40/-



బహుముఖ ప్రజ్ఞాశాలి - బహుజనతాత్వికుడు
రూ. 40/-

వేమన - వీరబ్రహ్మం - ఒక పరిశీలన
రూ. 25/-

వీరబ్రహ్మం కవిత్వం : కవిత్వాంశాలు
రూ. 45/-

20% ప్రత్యేక తగ్గింపుతో...

విజయవాడ : 9490099055
విశాఖపట్నం : 9490099058
గుంటూరు : 9490094430
ఏలూరు : 9440013188
ఒంగోలు : 9492292036
నెల్లూరు : 9490099279
కర్నూలు : 8500042738
అనంతపురం : 8554223317

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్‌పే నెం : 9490099258
రిజిస్టర్ పోస్టులో పంపుతాం

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2. ఫోన్ : 0866 - 2577533
బ్రాంచీలు : విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం